సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 350

బుధవారం 11-3-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

కో-ఆపరేటివ్‌లకూ కష్టాలు

యస్ బ్యాంక్ సంక్షోభంతో నిలిచిపోయిన రూ. 200 కోట్ల చెక్ లావాదేవీలు -బిజినెస్‌లో

ఫైనల్లో వికాస్, సిమ్రన్‌జిత్

ఒలింపిక్స్ ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో 'పసిడి' పోరుకు భారత బాక్సర్లు - స్పోర్ట్స్‌లో

● ఆసియా నంబర్ వన్ జాక్ మా

'అగ్ర' కుబేరుడు

ఇప్పటిదాకా ఆసియా కుబేరుల్లో అగ్రస్థానంలో ఉంటున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ (41.9 బిలియన్ డాలర్లు) రెండో స్థానానికి పరిమితమయ్యారు. చైనాకు చెందిన ఆలీబాబా గ్రూప్ హోల్డింగ్ వ్యవస్థాపకుడు జాక్ మా (44.5 బిలియన్ డాలర్లు) మళ్లీ నంబర్‌వన్ స్థానంలో నిల్చారు.

- బిజినెస్‌లో

● తారామతి, ప్రేమామతి జిగేల్

సమాధులకు కొత్తందాలు

తారామతి, ప్రేమామతి సమాధులు కొత్తందాలను సంతరించుకున్నాయి. పర్యాటకులను ఆకట్టుకునేందుకు జిగేల్ మంటున్నాయి. లక్షా 3 వేల యూఎస్ డాలర్లతో సుందరీకరించిన ఈ రెండు సమాధులను భారత్‌లోని యూఎస్ అంబాసిడర్ కెన్నెత్ ఐ జస్టర్ చేతుల మీదుగా పర్యాటకులకు అంకితం చేశారు.

- 2లో

● అబ్బురపరిచే విన్యాసాలు

నింగిలో సయ్యాట!

నింగిలో అద్భుతానికి హైదరాబాద్ నగరం మరోసారి వేదికైంది. ఫిక్కీ, పౌర విమానయాన సంస్థ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా రెండేళ్లకోసారి 'వింగ్స్ ఇండియా' పేరిట ఈ నెల 12 నుంచి నిర్వహించే ఏవియేషన్ షోకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ ముస్తాబైంది.

- 14లో

● ప్రధాని మన్ననలు

జల కల్పన..

కల్పనా రమేశ్ ఓ ఆర్కిటెక్ట్. లక్షల రూపాయలు ఆర్జించే అవకాశం ఉన్న తన కెరీర్‌కే పరిమితమై పోకుండా భావితరాలకు విలువైన నీటి బొట్టును ఒడిసిపట్టి అందించేందుకు జలయజ్ఞానికి శ్రీకారం చుట్టారు. జల సంపదను నిల్వ చేసేందుకు వినూత్న డిజైన్లు రూపొందించి దేశ ప్రధాని మోదీ మన్ననలు పొందారు.

-ఫ్యామిలీలో

16 నుంచి ఒంటిపూట

ఏప్రిల్ 24 నుంచి బడులకు వేసవి సెలవులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు.. ఇతర అన్ని యాజమాన్యాలు, అన్ని మీడియంల పాఠశాలలు అన్నింటికీ వచ్చే సోమవారం (16వ తేదీ) నుంచి ఒంటి పూట బడులుగా విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పాఠశాల విద్యా కమిషనర్ చిత్రా రామ్‌చంద్రన్ ప్రకటించారు. వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో 16 నుంచి ఒంటి పూట బడులను కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పాఠశాలలు కొనసాగించాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనాన్ని 12:30 గంటలకు పెట్టాలని పేర్కొన్నారు. పాఠశాలలకు వచ్చేనెల 23వ తేదీ చివరి పని దినమని, 24వ తేదీ నుంచి వేసవి సెలవులు వర్తిస్తాయని వెల్లడించారు. తిరిగి పాఠశాలలు (కొత్త విద్యా సంవత్సరం) జూన్ 12 నుంచి ప్రారంభం అవుతాయని వివరించారు. రాష్ట్రంలోని ఆర్జేడీలు, డీఈవోలు ఈ ఉత్తర్వులను అన్ని పాఠశాలలకు పంపించాలని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌కు సింధియా గుడ్‌బై

● ఆపరేషన్ కమల్..

అమిత్ షా, మోదీతో భేటీ అనంతరం నిర్ణయం

- రాజ్యసభ సభ్యత్వంతోపాటు కేంద్ర మంత్రి పదవి దక్కే అవకాశం
- మైనార్టీలో మధ్యప్రదేశ్ కాంగ్రెస్ సర్కారు
- పార్టీకి 22 మంది ఎమ్మెల్యేల రాజీనామా
- ఏర్పాటైన 15 నెలలకే పతనం దిశగా కమల్‌నాథ్ ప్రభుత్వం

దేశమంతా హోలీ సంబరాల్లో ఉన్న వేళ కాంగ్రెస్‌కు షాక్ తగిలింది. ఇటు కమల్‌నాథ్ సర్కార్ సంక్షోభం.. అటు బీజేపీలో సంబరాలు.. వెరసి మధ్యప్రదేశ్‌లో రాజకీయం రసవత్తరంగా మారింది. మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ప్రధాని మోదీని కలిసిన అనంతరం జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్‌ను వీడుతున్నట్లు ప్రకటించగానే బీజేపీ కార్యకర్తలు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. మరోవైపు తమ ప్రభుత్వాన్ని కూలదోయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఆరోపణలు గుప్పించింది. అధికార కాంగ్రెస్‌కి రాజీనామా చేస్తూ 22 మంది ఎమ్మెల్యేలు రాజ్‌భవన్‌కు లేఖలు పంపడంతో ప్రభుత్వ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఉత్కంఠ కొనసాగుతుండగా కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన ఆరుగురు మంత్రులను తక్షణమే తొలగించాలని కోరుతూ సీఎం కమల్‌నాథ్.. గవర్నర్ లాల్జీ టాండన్‌కు లేఖ రాశారు. మొత్తంగా 15 నెలల కమల్‌నాథ్ సర్కారు పాలన కూల్చివేత అంచున ఊగిసలాడుతోంది.

- పూర్తి వివరాలు 5లో

సింధియా టైమ్స్ తర్వాత రాజస్తానేనా?

బీజేపీలో సింధియాలు.. సింధియాలో బీజేపీ

111 జీవో పరిధిలోని నిర్మాణాలను కూల్చివేస్తున్న ప్రభుత్వ సిబ్బంది

బాబోయ్ 111 జీవో

సామాన్యులకు 16 వేల కోట్ల నష్టం

- జీవో పరిధిలోని లేఅవుట్ల కూల్చివేత పర్యవసానం
- ఏ పార్టీ ప్రభుత్వమొచ్చినా రద్దు చేస్తామనే హామీలు
- రియల్టర్లు వెంచర్లు వేసి అమ్ముకునే వరకు చోద్యం చూసిన అధికారులు
- రద్దవుతుందనే ఆశతో ప్లాట్లు కొనుగోలు చేసిన సామాన్యులు
- ఇటీవల 2,991 ఎకరాల్లో లేఅవుట్లు ధ్వంసం చేసిన పీఆర్ శాఖ
- గజం రూ. 20 వేలు లెక్కేసినా నష్టం రూ. 16 వేల కోట్లపైనే

ఏళ్లుగా హామీ: 'అధికారంలోకి వస్తే 111 జీవోను రద్దు చేసి మీ స్థలాలకు ఢోకా లేకుండా చూస్తాం'అంటే పార్టీలు ఇచ్చిన ఎన్నికల హామీని నమ్మి సామన్యులు ఈ జీవో పరిధిలోని గ్రామాల్లో వెలసిన వెంచర్లలో కొన్నేళ్లుగా ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేస్తున్నారు.

ప్రస్తుతం: ఈ జీవో రద్దు మాట దేవుడెరుగు... జీవో పరిధిలోకి వచ్చే గ్రామాల్లో లేఅవుట్లకు అనుమతి లేదంటూ పంచాయతీరాజ్‌శాఖ వేల ఎకరాల్లో వేసిన లేఅవుట్లను నేలమట్టం చేస్తోంది.

పర్యవసానం: అధికారులు ఆయా లేఅవుట్లను కూల్చేస్తుండటంతో వారి సొంత గూటి ఆశ ఆదిలోనే ఆవిరవుతోంది. 111 జీవో సడలింపు ఆశజూపి లేఅవుట్లు వేసిన డెవలపర్లు జేబులు నింపుకోగా ఆ జీవో పరిధిలో ప్లాట్లు కొనుక్కున్న వారు ఆర్థికంగా నష్టపోతున్నారు.

- పూర్తి వివరాలు 2లో

టీఆర్ఎస్ నుంచి రాజ్యసభకు కేకే, పొంగులేటి!

నేడు అధికారికంగా ప్రకటించే అవకాశం

శాసనమండలి అభ్యర్థుల కసరత్తు కూడా పూర్తి చేసిన కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కోటాలో ఖాళీగా ఉన్న రెండు రాజ్యసభ స్థానాలకు టీఆర్ఎస్ తరఫున పోటీ చేసే అభ్యర్థుల పేర్లను పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఖరారు చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత డాక్టర్ కె. కేశవరావు మరోమారు రాజ్యసభకు వెళ్లనున్నారు. రెండో స్థానానికి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేరు దాదాపు ఖరారైంది. పార్టీ తరఫున పలువురు నేతలు రాజ్యసభ సభ్యత్వాన్ని ఆశించినా చివరకు ఈ ఇద్దరు నేతల వైపే కేసీఆర్ మొగ్గుచూపినట్లు తెలిసింది. నిజామాబాద్ మాజీ ఎంపీలు కవిత, ప్రొఫెసర్ సీతారాం నాయక్, మందా జగన్నాథం రాజ్యసభ ఆభ్యర్థిత్వాన్ని ఆశించిన వారి జాబితాలో ఉన్నారు. వారితోపాటు దామోదర్‌రావు, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, హెటిరో సంస్థల అధినేత పార్థసారథిరెడ్డి పేర్లను కూడా సీఎం పరిశీలించినట్లు తెలిసింది. చివరకు వివిధ సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని కేకే, పొంగులేటి అభ్యర్థిత్వం వైపు కేసీఆర్ మొగ్గు చూపినట్లు తెలిసింది. అయితే అభ్యర్థిత్వం ఖరారైనట్లుగా ప్రచారంలో

మిగతా 2వ పేజీలో ▶

అసిస్టెంట్ లేబర్ కమిషనర్

కిడ్నాప్, హత్య

- ఈనెల 7న హన్మకొండ నుంచి ప్రదీప్‌రెడ్డితో భూపాలపల్లికి..
- 8న మిస్సింగ్ కేసు నమోదు
- ఇరువురి నడుమ రూ. 80 లక్షల మేర ఆర్థిక లావాదేవీలు
- మంగళవారం రాత్రి భూపాలపల్లి అడవుల్లో మృతదేహం గుర్తింపు
- పోలీసుల అదుపులో నిందితుల్లో ఒకరు -13లో



సేఫ్టీ షిలబస్

- 'పబ్లిక్ సేఫ్టీ క్లబ్'లకు నేడు శ్రీకారం
- కాలేజీ ప్రిన్సిపాళ్లతో నేడు నగరంలో భేటీ
- మహిళా, శిశు, రోడ్, ట్రాఫిక్, సాధారణ భద్రతపై అవగాహన పెంచనున్న క్లబ్‌లు
- ఏడాది కార్యాచరణ సిద్ధం చేసిన విమెన్ సేఫ్టీ వింగ్ - 3లో

వైరస్‌ల నియంత్రణకు శాశ్వత వార్డులు

- ఉమ్మడి జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో 20 ఐసొలేషన్ కేంద్రాలు, 10 ఐసీయూలు
- రూ.30 కోట్లతో ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం
- కోవిడ్, స్వైన్‌ఫ్లూ, నిపా వంటి వైరస్‌లు అన్నింటికీ చికిత్స

14 లో

ఆర్థికాభివృద్ధికి కేరాఫ్ రంగారెడ్డి, హైదరాబాద్

- జీడీడీపీ, తలసరి ఆదాయంలో రెండు జిల్లాల దూకుడు
- రూ.1,73,143 కోట్ల జీడీడీపీతో రంగారెడ్డి టాప్..
- 1,67,231 కోట్లతో రెండో స్థానంలో 'భాగ్యనగరం'
- తీవ్రంగా వెనకబడిపోయిన ఇతర జిల్లాలు - 2లో

నేడు అసెంబ్లీ సమావేశాలు పునఃప్రారంభం

- శాసనసభ, మండలిలో ప్రశ్నోత్తరాలు
- చర్చకు రానున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు

సాక్షి, హైదరాబాద్: రెండ్రోజుల క్రితం వాయిదా పడిన రాష్ట్ర శాసనసభ బుధవారం తిరిగి భేటీ అవుతోంది. ఈ నెల 6న ప్రారంభమైన శాసనసభ బడ్జెట్ సమావేశాలు వరుసగా మూడ్రోజుల పాటు జరిగి హోలీ పండుగ నేపథ్యంలో రెండ్రోజుల పాటు వాయిదా పడ్డాయి. బుధవారం నుంచి రాష్ట్ర వార్షిక బడ్జెట్ 2020-21 ప్రతిపాదనలపై చర్చ ప్రారంభం కానుండగా, సమావేశం ఆరంభంలో ప్రశ్నోత్తరాలు చేపట్టనున్నారు. ప్రశ్నోత్తరాల సందర్భంగా బుధవారం అసెంబ్లీలో నదులపై వంతెనలు, ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రో రైలు, కల్యాణలక్ష్మి, హైదరాబాద్ మెట్రో రైలు సేవల విస్తరణ వంటి అంశాలు ప్రస్తావనకు రానున్నాయి. వీటితో పాటు చేపల పెంపకానికి ప్రోత్సాహం, అల్ప సంఖ్యాక ఆశ్రమ పాఠశాలలు, దుబ్బాకలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమ, రెండో దశ గొర్రెల యూనిట్ల పంపిణీ, ఎల్‌బీ నగర్ నియోజకవర్గంలో భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ప్రశ్నలను సభ్యులు లేవనెత్తనున్నారు. శాసనమండలిలో తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య సూచిక, వరిసాగుకు నీటి వినియోగం, డయాలసిస్ కేంద్రాలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు గౌరవ వేతనం చెల్లింపు, ప్రభుత్వ పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది నియామకం, సౌర విద్యుత్, జంటనగరాల్లో వాహన రద్దీ వంటి అంశాలు ప్రస్తావనకు రానున్నాయి. సైబర్ నేరాల నియంత్రణ, టీఎస్ఆర్‌డీసీలో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన ప్రశ్నలు సభ్యులు లేవనెత్తనున్నారు.

ఒక్క నిమిషం ఆలస్యంపై పిల్

నేడు విచారించనున్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైతే పరీక్షలకు అనుమతించబోమని ఇంటర్ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. విద్యార్థులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేసే ఈ నిబంధనను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని పిల్ దాఖలు చేసిన న్యాయవాది రాపోలు భాస్కర్ హైకోర్టును అభ్యర్థించారు. భోజన విరామ సమయంలో పిల్‌ను అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. బుధవారం విచారణ జరుపుతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం స్పష్టం చేసింది. విద్యార్థులు కొద్ది నిమిషాలు ఆలస్యంగా పరీక్షకు హాజరైతే పరీక్షలు రాసేందుకు అనుమతించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులను మానసికంగా తీవ్ర ఆందోళనకు గురిచేసే ఈ నిబంధనను రద్దు చేయాలని, సమయ పాలనపై విద్యార్థులకు అవగాహన కల్పించాలేగానీ, ఇలాంటి షరతు విధించి ఏడాది చదువును పణంగా పెట్టేలా చేయడం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని ఆయన కోరారు.

హైకోర్టుకు చేరిన హాజీపూర్ కేసు

ఇరుపక్షాలకు ధర్మాసనం నోటీసులు

సాక్షి, హైదరాబాద్: హాజీపూర్‌లో బాలికల అత్యాచారం, హత్య కేసుల్లో మర్రి శ్రీనివాస్‌రెడ్డికి కింది కోర్టు విధించిన ఉరి శిక్ష ఖరారు వ్యాజ్యం హైకోర్టుకు చేరింది. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం హాజీపూర్‌లో ఇద్దరు బాలికల అత్యాచారం, హత్య కేసుల్లో శ్రీనివాస్‌రెడ్డికి నల్లగొండ జిల్లా మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఫిబ్రవరి 6న ఉరి శిక్ష విధించారు. మరో బాలిక హత్య కేసులో యావజ్జీవశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. సీఆర్‌పీసీలోని చట్టం 366 నిబంధన ప్రకారం కింది కోర్టు విధించిన ఉరి శిక్షను హైకోర్టు ఖరారు చేయాల్సి ఉంది. దీంతో దానికి సంబంధించిన పత్రాలు హైకోర్టుకు చేరాయి. ఇదే సమయంలో ఉరి శిక్షను సవాల్ చేస్తూ శ్రీనివాస్‌రెడ్డి కూడా హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశాడు. ఈ రెండు కేసులను కలిపి విచారిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది. శ్రీనివాస్‌రెడ్డి, పోలీసులకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

నేడు, రేపు పొడి వాతావరణం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధ, గురువారాల్లో పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరాఠ్వాడ పరిసర ప్రాంతాలలో 0.9 కి.మీ ఎత్తు వద్ద ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. మరాఠ్వాడ నుంచి ఇంటీరియర్ కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు 0.9 కి.మీ ఎత్తు వద్ద ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. మంగళవారం కుమరంభీం జిల్లాలోని బెజ్జూరులో 5 సెం.మీ, సిర్పూరులో 5 సెం.మీ, చింతలమానేపల్లిలో 3 సెం.మీ, ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో 3 సెం.మీ, వనపర్తి జిల్లా మదనాపూర్‌లో 2 సెం.మీ, జోగులాంబ గద్వాల జిల్లా ఐజ్వాలో 2 సెం.మీ, రంగారెడ్డి జిల్లా కేశంపేట్‌లో 2 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

వివిధ ప్రాంతాలలో నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	నమోదైన ఉష్ణోగ్రత (డిగ్రీ సెంటీగ్రేడులలో)
భద్రాచలం	35
మహబూబ్‌నగర్	34
రామగుండం	33
ఆదిలాబాద్	32
నిజామాబాద్	32
హకీంపేట్	31
హన్మకొండ	31
హైదరాబాద్	31
మెదక్	31
నల్లగొండ	31
దుండిగల్	30

పాత కోర్సుల రద్దుకు అనుమతించండి

కాలేజీ యాజమాన్యాల సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీల్లో తక్కువ మంది విద్యార్థులు ఉన్న కోర్సులను రద్దు చేసుకునేందుకు, ఆ విద్యార్థులను వారికి ఇష్టమైన కాలేజీలకు పంపించేందుకు అనుమతి ఇవ్వాలని ఉన్నత విద్యామండలికి వృత్తి కాలేజీ యాజమాన్యాల సంఘం ప్రతినిధి కేవీకే రావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డిని కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డాటా సైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మిషన్ లెర్నింగ్ వంటి కోర్సులను ప్రవేశపెట్టేందుకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. బీటెక్ 2, 3, 4వ సంవత్సరాల్లో వివిధ కోర్సుల్లో తక్కువ మంది విద్యార్థులు ఉంటే వారిని ఇతర కాలేజీల్లోకి షిఫ్ట్ చేయడం (వారు కోరుకున్న కాలేజీల్లోకి) ద్వారా వారికి నాణ్యమైన విద్య అందుతుందని, కొత్త కోర్సులు వస్తే కాలేజీలకు ప్రయోజనం ఉంటుందని వివరించారు. ఈ ప్రతిపాదన చాలా ఉపయోగకరమైందని, అయితే దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పాపిరెడ్డి వెల్లడించారన్నారు. తాము కూడా ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారని వివరించారు.

ప్రభుత్వ స్కూళ్లలో బడ్జెట్ పెంచాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సీపీఎం డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చదువుకుంటున్నందున, వారికి నాణ్యమైన విద్యతో పాటు స్కూళ్లలో కనీస సౌకర్యాలు కల్పించేలా బడ్జెట్‌లో కేటాయింపులు పెంచి విద్యారంగ బలోపేతానికి ఖర్చుచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఎం డిమాండ్‌చేసింది. రాష్ట్రంలో విద్యారంగ పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని, కొన్నిచోట్ల చేసిన సర్వే ప్రకారం చాలా చోట్ల మధ్యాహ్న భోజన పథకం అమలుకావడం లేదని ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో విద్యారంగ పురోగతి కోసం బడ్జెట్ కేటాయింపులు పెంచడంతో పాటు వాటిని పూర్తిగా ఖర్చు చేసే పద్ధతిలో అమలుచేసి, ప్రభుత్వ స్కూళ్లన్నింటిలో కనీస సౌకర్యాల కల్పన, ఖాళీ పోస్టుల భర్తీ చేయాలని సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్‌చేశారు.

కొత్తందాలు

యూఎస్ ఆర్థిక సాయంతో తారామతి, ప్రేమామతి సమాధుల సుందరీకరణ పనులు పూర్తి

అమెరికా రాయబారి చేతుల మీదుగా పర్యాటకులకు అంకితం



తారామతి, ప్రేమామతి సమాధుల వద్ద భారత్‌లోని యూఎస్ అంబాసిడర్ కెన్నెత్ ఐ జస్టర్

సాక్షి, హైదరాబాద్: తారామతి, ప్రేమామతి సమాధులు కొత్తందాలను సంతరించుకున్నాయి. పర్యాటకులను ఆకట్టుకునేందుకు జిగేల్‌మంటున్నాయి. లక్షా మూడు వేల యూఎస్ డాలర్లతో సుందరీకరించిన ఈ రెండు సమాధులను భారత్‌లోని యూఎస్ అంబాసిడర్ కెన్నెత్ ఐ జస్టర్ చేతుల మీదుగా మంగళవారం పర్యాటకులకు అంకితం చేశారు. ఈ సందర్భంగా జస్టర్ మాట్లాడుతూ.. ఆగాఖాన్ ట్రస్టు ఫర్ కల్చర్ ఆధ్వర్యంలో 17వ శతాబ్దపు కులీకుతుబ్‌షాహీ రాజుల సమాధుల సుందరీకరణ పనులకు తమ ప్రభుత్వం ఏటా నిధులు కేటాయిస్తోందన్నారు. ప్రపంచంలోని చారిత్రక కట్టడాలను వారసత్వ సంపదగా భావితరాలకు అందించడానికే ఈ సాయం చేస్తున్నామన్నారు. 'గతంలోనూ ఆగాఖాన్ ఫౌండేషన్‌కు లక్షా ఒక వేయి డాలర్లను ఇచ్చాం. సుందరీకరణ పనులు ఊహించిన దానికంటే గొప్పగా జరుగుతున్నాయి'అని ఆయన ప్రశంసించారు. కుతుబ్‌షాహీ సమాధుల సుందరీకరణ పనులు కూడా పూర్తయితే ఇక్కడ ప్రపంచస్థాయి పర్యాటక ప్రాంతం రూపుదిద్దుకుంటుందన్నారు. ఆయన వెంట తెలంగాణ రాష్ట్ర పురాతత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నారాయణ, ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ సీఈవో రితీష్ నంద, సైట్ అధికారి గణేష్‌రెడ్డి తదితరులున్నారు.

వెన్నెల రాత్రుల్లో అక్కాచెల్లెళ్ల నృత్యం

అక్కాచెల్లెళ్లయిన తారామతి, ప్రేమామతి.. చివరి కుతుబ్‌షాహీ సుల్తాన్ ఆస్థానంలో నృత్యకారిణులు. మంచి అభినయంతో, అందమైన గాత్రాలతో వినసొంపుగా పాడేవారు. ఇవి రాజులను మంత్రముగ్ధులను చేసేవి. వీరి ఆటపాటలకు వీలుగా తారామతి బారాదరిలో నృత్య వేదికలను నిర్మించారు. బారాదరి.. రెండంతస్తులతో, చదరపు ఆకారంలో అన్నివైపులా బలమైన తోరణాలతో, చక్కని శబ్దగ్రాహ్యతతో కూడిన విలక్షణమైన నిర్మాణం. గోల్కొండ కోటకు సమీపంలోనే ఇది ఉంది. నృత్య ప్రదర్శనల సందర్భంలో బారాదరి - గోల్కొండ కోటను కలుపుతూ తీగలను అనుసంధానించే వారు. వాటిపై తారామతి, ప్రేమామతి వెన్నెల రాత్రుల్లో నృత్యాలు చేసేవారని చరిత్రకారులు చెబుతారు. మరణానంతరం వీరిద్దరిని ఇబ్రహీంబాగ్‌లోని కుతుబ్‌షాహీల రాజ శ్మశానవాటికలో ఖననం చేశారు. ఈ రెండు సమాధులు పక్కపక్కనే ఉంటాయి. ప్రస్తుతం వీటినే సుందరీకరించి, పర్యాటకుల సందర్శనకు వీలుగా అంకితం చేశారు.

ఆర్థికాభివృద్ధికి కేరాఫ్ రంగారెడ్డి, హైదరాబాద్

- జీడీడీపీ, తలసరి ఆదాయంలో రెండు జిల్లాల దూకుడు
- రూ.1,73,143 కోట్ల జీడీడీపీతో రంగారెడ్డి జిల్లా టాప్..
- రూ.1,67,231 కోట్ల జీడీడీపీతో రెండో స్థానంలో 'భాగ్యనగరం'
- ఆర్థికాభివృద్ధిలో తీవ్రంగా వెనకబడిపోయిన ఇతర జిల్లాలు

సాక్షి, హైదరాబాద్: వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు కేంద్రమైన హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు.. వస్తు, సేవల ఉత్పత్తిలోనూ అగ్రగామిగా నిలుస్తున్నాయి. దేశ, రాష్ట్రాల ఆర్థికాభివృద్ధి రేటును దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ), రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ)గా మదిస్తారు. ఈ తరహాలోనే జిల్లాల ఆర్థికాభివృద్ధి రేటును జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ)గా మదిస్తారు. ఒక నిర్దిష్ట కాలవ్యవధిలో, సాధారణంగా ఒక ఏడాదిలో ఒక జిల్లాలోని భౌగోళిక సరిహద్దుల్లో ఉత్పత్తి అయిన అన్ని తుది వస్తువులు, సేవల మొత్తం ఆర్థిక విలువను జీడీడీపీగా పేర్కొంటారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రంగారెడ్డి జిల్లా రూ.1,73,143 కోట్ల జీడీడీపీతో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రూ.1,67,231 కోట్ల జీడీడీపీతో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. కేవలం ఈ రెండు జిల్లాలే రూ.లక్ష కోట్లపైగా జీడీడీపీని కలిగి ఉన్నాయి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి రేటును పరుగులు పెట్టించడంలో ఈ రెండు జిల్లాలదే ప్రధాన పాత్ర అని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రాష్ట్ర ఆర్థిక, సామాజిక సర్వే నివేదికలోని జీడీడీపీ గణాంకాలు పేర్కొంటున్నాయి. హైదరాబాద్ నగరం దేశానికే ఫార్మా రంగ రాజధానిగా పేరుగాంచింది. నగరంలో పెద్ద సంఖ్యలో ఐటీ కంపెనీలు, తయారీ, మైన్స్, మినరల్స్, టెక్స్‌టైల్స్ తదితర రంగాల పరిశ్రమలున్నాయి. వీటిల్లో అత్యధిక శాతం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కేంద్రీకృతమై ఉండడంతో ఇక్కడి నుంచి దేశ, విదేశాలకు ఏటా రూ.లక్షల కోట్లు విలువ చేసే వస్తు, సేవల ఉత్పత్తులు ఎగుమతి, రవాణా అవుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల జీడీడీపీ మాత్రమే రూ.లక్షన్నర కోట్ల గీటురాయిను దాటి రూ.2 లక్షల కోట్ల దిశగా దూసుకుపోవడానికి ఈ పరిశ్రమలే ప్రధాన తోడ్పాటు అందిస్తున్నాయి.

పెరుగుతున్న అసమానతలు..

జీడీడీపీతో పాటు తలసరి ఆదాయంలో సైతం ఈ రెండు జిల్లాలు రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలకు అందనంత దూరంలో ఉన్నాయి. రూ.5,78,978 తలసరి ఆదాయంతో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో నిలవగా, రూ.3,57,287తో హైదరాబాద్, రూ.2,21,025తో మేడ్చల్-మల్కాజ్‌గిరి ఆ తర్వాతి స్థానంలో నిలిచాయి. మిగిలిన జిల్లాల్లో ఏ ఒక్క జిల్లా రూ.2 లక్షల తలసరి ఆదాయాన్ని కలిగి ఉండగకపోవడం గమనార్హం. పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధిలో రాష్ట్రంలోని జిల్లాల మధ్య నెలకొన్న అసమానతలను ఈ గణాంకాలు అద్దంపడుతున్నాయి. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి. జీడీడీపీ, తలసరి ఆదాయంలో తీవ్రంగా వెనుకబడిన జిల్లాల అభివృద్ధి, స్థానికంగా పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు అమలు చేయాల్సిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు, రాయితీ, ప్రోత్సాహకాల విధానాల రూపకల్పనకు ఈ గణాంకాలు కీలకం కానున్నాయి.

జిల్లాల వారీగా జీడీడీపీ గణాంకాలు...

జిల్లా	జీడీడీపీ(రూ.కోట్లలో)		
రంగారెడ్డి	1,73,143	వికారాబాద్	15,661
హైదరాబాద్	1,67,231	కామారెడ్డి	14,032
మేడ్చల్-మల్కాజ్‌గిరి	66,156	ఆదిలాబాద్	13,427
సంగారెడ్డి	31,733	జగిత్యాల	13,140
నల్లగొండ	28,708	నిర్మల్	12,723
నిజామాబాద్	24,793	మంచిర్యాల	12,419
ఖమ్మం	23,917	మహబూబాబాద్	12,260
మహబూబ్‌నగర్	21,380	నాగర్‌కర్నూల్	12,131
సిద్దిపేట	20,598	వరంగల్ రూరల్	11,361
భద్రాద్రి కొత్తగూడెం	20,438	జోగులాంబ గద్వాల	9,567
కరీంనగర్	19,898	కుమ్రంభీం ఆసిఫాబాద్	8,855
సూర్యాపేట	18,118	జనగామ	8,239
మెదక్	17,185	రాజన్న సిరిసిల్ల	8,191
యాదాద్రి భువనగిరి	20,438	వనపర్తి	8,069
వరంగల్ అర్బన్	16,033	జయశంకర్ భూపాలపల్లి	7,145
పెద్దపల్లి	15,792	నారాయణ్‌పేట	6,628
		ములుగు	5,934

బాబోయ్ 111 జీవో!

సామాన్యులకు రూ.16 వేల కోట్ల నష్టం

ఓ లేఅవుట్‌లో ధ్వంసం చేసిన రోడ్డు

డోకూరి వెంకటేశ్వరరెడ్డి

హైదరాబాద్ శివార్లలోని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల పరిరక్షణ కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జారీ అయిన 111 జీవో... జంట జలాశయాల పరిధిలోని ప్రాంతాల్లో ప్లాట్లు కొనుగోలు చేసిన సామాన్యుల పుట్టి ముంచుతోంది. జలాశయాలకు 10 కి.మీ. పరిధిలోకి వచ్చే 7 మండలాల్లోని 84 గ్రామాల్లో 90 శాతం భూమిని వ్యవసాయ అవసరాలకే వినియోగించాలని, కేవలం 10 శాతం భూమినే నిర్మాణాలకు వాడుకోవచ్చని, పరిశ్రమల స్థాపనకు ఎట్టిపరిస్థితుల్లోనూ అవకాశం లేదనేది ఆ జీవో సారాంశం. అయితే పార్టీల హామీతో ఆయా గ్రామాల్లో రియల్టర్లు వెంచర్లు వేసి ప్లాట్లుగా అమ్ముకునప్పుడు చోద్యం చూసిన పంచాయతీరాజ్ అధికారులు ఇప్పుడు జీవో పేరు చెప్పి లేఅవుట్లను కూల్చేస్తున్నారు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు. ఇప్పటివరకు అధికారులు కూల్చిన లేఅవుట్లలో మధ్యతరగతి ప్రజలు నష్టపోయిన మొత్తం రూ. 16 వేల కోట్లపైనే.

కనిష్టంగా గజానికి రూ. 20 వేలు..

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్, శంషాబాద్, షాబాద్, కొత్తూర్, శంకర్‌పల్లి, చేవెళ్ల, పూర్వ రాజేంద్రనగర్ మండలాలు 111 జీవో పరిధిలోకి వస్తాయి. ఈ మండలాల పరిధిలో గత 10-15 ఏళ్లలో అంతర్జాతీయ విమానాశ్రయం సహా ఐటీ కంపెనీల ఏర్పాటుతో ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోయాయి. దీంతో ఇక్కడి భూములు ధరలు గజం రూ. 40-60 వేల వరకు చేరాయి. 111 జీవో వచ్చిన తొలినాళ్లలో ఇక్కడ భూముల కొనుగోలుకు పెద్దగా ఎవరూ ఆసక్తి చూపకున్నా 2009లో స్థానికుల నుంచి జీవో ఎత్తేయాలనే డిమాండ్ వచ్చింది. ఆందోళనలు కూడా జరగడంతో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు 111 జీవోను ఎత్తేస్తామని హామీలిచ్చాయి. పార్టీల వాగ్దానాలతో ప్రజల్లోనూ మార్పు వచ్చింది. అదే సమయంలో జీవో రద్దవుతుందనే ధీమాతో వేల ఎకరాల్లో వెంచర్లు వెలిశాయి. ఇప్పుడు ఆ వెంచర్లనే పంచాయతీరాజ్ అధికారులు కూల్చేస్తున్నారు. ఇప్పటివరకు అధికారిక లెక్కల ప్రకారం శంషాబాద్, మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల మండలాల పరిధిలోని 47 గ్రామాల్లో 2,991 ఎకరాల విస్తీర్ణంలో వెలసిన 303 లేఅవుట్లను ధ్వంసం చేశారు. 2,991 ఎకరాలను గజాల లెక్కన లెక్కించి నిబంధనలకు అనుగుణంగా 40% మౌలిక సదుపాయాలకు ఉంచాల్సిన భూమిని తీసేస్తే కనీసం ఈ లెక్క 80,75,700 గజాలుగా తేలుతోంది. సగటున గజానికి రూ. 20 వేల చొప్పున లెక్కగట్టినా అధికారులు ధ్వంసం చేసిన స్థలాల విలువ రూ. 16,150 కోట్లపైనే. ఆ మేరకు సామాన్యులు నష్టపోగా కూల్చివేతలు ముమ్మరం చేస్తే మరింత మంది మునగనున్నారు.

వెంచర్ కూల్చేశారు...

తమిళనాడు నుంచి 20 ఏళ్ల క్రితం ఇక్కడికి వలసవచ్చిన నేను సొంత ప్లాట్ ఉండాలనే ఆలోచనతో రూ. 25 లక్షలు పెట్టి మొయినాబాద్ సమీపంలో ప్లాటు కొన్నా. 111 జీవో పరిధిలో వెంచర్ అంటూ అధికారులు వెంచర్‌ను కూల్చివేశారు. ఇప్పుడేం చేయాలో అర్థం కావట్లేదు.

– రాంచందర్, ప్లాటు కొనుగోలుదారుడు

జీవో 111 పరిధిలోకి వచ్చే గ్రామాల కింద ఇప్పటివరకు కూల్చేసిన లేఅవుట్ల వివరాలు

మండలం	జీపీల సంఖ్య	కూల్చిన లేఅవుట్లు	విస్తీర్ణం (ఎకరాల్లో)
మొయినాబాద్	24	193	2,275.32
శంషాబాద్	19	105	692.34
శంకర్‌పల్లి	2	3	14.2
షాబాద్	1	1	6
చేవెళ్ల	1	1	2
మొత్తం	47	303	2,991.06

సరిదిద్దాల్సింది పార్టీలు, ప్రభుత్వమే...

సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని తెలిసినా పార్టీలు జీవో రద్దుపై హామీలివ్వడం తప్పు. ఇప్పుడు ఆ తప్పును సరిచేయాల్సింది పార్టీలు, ప్రభుత్వమే. జీవోను ఎత్తేయడం రాష్ట్ర పరిధిలోని అంశమే అయినా అందులో న్యాయపరమైన చిక్కులున్నాయి. కానీ ప్రభుత్వం తలుచుకుంటే కొంతైనా సడలింపు వస్తుంది.

– రెవెన్యూ వ్యవహారాల్లో తలపండిన ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి

సహేతుక కారణాలు చూపితే

పర్యావరణ కాముకుల వ్యతిరేకత, సుప్రీంకోర్టులో న్యాయపరంగా ఉన్న అవాంతరాలను పరిగణనలోకి తీసుకుంటూనే స్థానికులు, భూములు కొన్న ప్రజలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి. జీవో 111 పరిధిలోకి వచ్చే దిగువ ప్రాంతంలోని గ్రామాలకైనా సడలింపు ఇవ్వాలి. ఎగువ ప్రాంతంలోనూ 90% కాకుండా కనీసం 50% మేరకైనా వ్యవసాయ భూములుండాలన్న నిబంధనను సవరించాలి. లేదంటే జీవోను పూర్తిగా ఎత్తేసేలా చర్యలు తీసుకోవాలి. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటికి ఇబ్బంది అనే సమస్య రాకుండా కృష్ణా, గోదావరి నుంచి నీటిని తీసుకొని జంట జలాశయాలను నింపాలనే ప్రభుత్వ ప్రతిపాదనను ముందుపెట్టి గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టుకు సహేతుక కారణాలు చూపితే జీవో ఎత్తివేత కష్టమేమీ కాదు.

– న్యాయ నిపుణుల అభిప్రాయం

నిరాశే మిగిలింది...

ఆర్మీలో పనిచేసి 2018లో రిటైరయ్యాక రూ. 23 లక్షలు పెట్టి చిలుకూరు రెవెన్యూ పరిధిలో హైదరాబాద్-బీజాపూర్ రహదారి పక్కన వెంచర్‌లో 208 గజాల ప్లాటు కొన్నా. అక్రమ వెంచర్ అంటూ అధికారులు కూల్చేశారు. ఇప్పుడు నా ప్లాటు ఎక్కడుందో కూడా తెలియట్లేదు. నా కుటుంబానికి ఈ ప్లాటు ఉపయోగపడుతుందని ఆశించిన నాకు నిరాశే మిగిలింది.

– లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి, పెద్దమంగళారం

టీఆర్ఎస్ నుంచి రాజ్యసభకు కేకే, పొంగులేటి!

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్న నేతలు మాత్రం తమకు పార్టీ నుంచి సమాచారం అందలేదని మంగళవారం రాత్రి ధ్రువీకరించారు. ఈ నెల 13న రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల నామినేషన్‌కు తుది గడువు ఉండటంతో రాజ్యసభ అభ్యర్థుల పేర్లను బుధవారం ప్రకటించే అవకాశం ఉంది. మరోవైపు శాసనమండలి నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా అభ్యర్థిగా అసెంబ్లీ మాజీ స్పీకర్ సురేశ్‌రెడ్డి, గవర్నర్ కోటా అభ్యర్థిగా సీఎం కార్యాలయ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ పేర్లను సైతం సీఎం ఖరారు చేసినట్లు సమాచారం. ఈ నెల 12న మండలి నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా స్థానానికి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది.

ఆ డీలర్ల బ్యాంకు గ్యారెంటీని ఎందుకు తగ్గించారు?

సాక్షి, హైదరాబాద్: వేగ నియంత్రణ పరికరాల (స్పీడ్ గవర్నర్లు) డీలర్ల బ్యాంకు గ్యారెంటీ రూ.కోటి నుంచి రూ.5 లక్షలకు తగ్గించడానికి కారణాలు తెలపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. గ్యారెంటీ రుసుము తగ్గిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ డీలర్లు హైకోర్టులో రిట్ దాఖలుచేశారు. వ్యాజ్యాన్ని విచారించిన న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ మంగళవారం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసి, విచారణను 2 వారాలకు వాయిదావేశారు. పరికరం రేటు రూ.2 వేలుంటే రూ.6 వేలకు అమ్ముతున్నారని, మూడున్నర వాణిజ్య వాహనాల లెక్కల ప్రకారం రూ.140 కోట్ల వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ప్రభుత్వం వాదించింది.

గిరిజన రిజర్వేషన్లు 10 శాతానికి పెంచండి

- ఈ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు పెట్టండి
- సీఎం కేసీఆర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గిరిజనుల రిజర్వేషన్లు పెంచేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ, మాజీమంత్రి టి.జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గిరిజనుల రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానంపై కేంద్రం నుంచి ఎలాంటి సమాధానం రాలేదని, ఆ వర్గానికి పెంచిన రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని కారణంగా గత ఆరేళ్లుగా వారు నష్టపోతున్నారంటూ ఆయన మంగళవారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. ఇంద్రసహానీ కేసులో 50% రిజర్వేషన్లు పెంచొద్దని చెప్పిన సుప్రీంకోర్టు సహేతుక కారణాలు, గణాంకాలు చూపించి ఆర్టికల్ 15,16 ప్రకారం రిజర్వేషన్లను 50శాతం కన్నా పెంచుకునే వెసులుబాటు ఉందని, రాష్ట్ర ప్రభుత్వాలను ఈ విషయంలో నిలువరించలేమని చెప్పిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆ లేఖలో జీవన్‌రెడ్డి కోరారు. ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వం కూడా సామాజిక, ఆర్థిక వెనుకబాటు కారణంతో అక్కడి మరాఠా వర్గాలకు ప్రస్తుతమున్న 52 శాతానికి అదనంగా మరో 12% రిజర్వేషన్లు కల్పించిందని తెలిపారు. ఈ విషయంలో ముంబై హైకోర్టు కానీ, సుప్రీంకోర్టు కానీ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వెంటనే రాష్ట్రంలోని గిరిజన ప్రజానీకానికి 10% రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు పెట్టి ఆమోదింపచేయాలని కోరారు.

సేఫ్టీ షిలబస్

రాష్ట్రవ్యాప్తంగా 'పబ్లిక్ సేఫ్టీ క్లబ్'లకు నేడు శ్రీకారం

- 2,200 మంది డిగ్రీ, పీజీ కాలేజీ ప్రిన్సిపాల్‌లతో నగరంలో నేడు భారీ సమావేశం
- మహిళా, శిశు, రోడ్, ట్రాఫిక్, సాధారణ భద్రతపై అవగాహన పెంచనున్న క్లబ్‌లు
- రవాణా, విద్యా, స్త్రీ శిశు సంక్షేమ శాఖలతో సమన్వయం ఏడాది కార్యాచరణ సిద్ధం చేసిన విమెన్‌సేఫ్టీ వింగ్

సాక్షి, హైదరాబాద్: మహిళా భద్రతే లక్ష్యంగా ముందుకు సాగుతున్న విమెన్ సేఫ్టీ వింగ్ మరో బృహత్తర కార్యాచరణ సిద్ధం చేసింది. ఇటీవల హైదరాబాద్‌లోని ఐదు డిగ్రీ కాలేజీల్లో ప్రయోగాత్మకంగా విద్యార్థుల నేతృత్వంలో నడిచే పబ్లిక్ సేఫ్టీ క్లబ్‌లను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఇవి మంచి ఫలితాలివ్వడంతో బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిగ్రీ, పీజీ కాలేజీల్లో పబ్లిక్ సేఫ్టీ క్లబ్‌లను ప్రారంభించనున్నారు. దీనికోసం 33 జిల్లాల నుంచి 2,200 కాలేజీల ప్రిన్సిపాల్‌లను నగరానికి విమెన్ సేఫ్టీ వింగ్ ఆహ్వానించింది. వీరందరితో బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపంలో భారీ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీజీపీ మహేందర్‌రెడ్డి, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి చిత్ర రామచంద్రన్ తదితరులు హాజరవనున్నారు.

స్కూలు, జిల్లా, రాష్ట్రస్థాయి క్లబ్‌లు..

విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో జరిగిన అన్ని కార్యక్రమాల్లో ఇదే అతిపెద్ద కార్యక్రమం కావడం గమనార్హం. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలు చేసి తీరాలని విమెన్ సేఫ్టీ వింగ్ ఐజీ స్వాతిలక్రా నిర్ణయించారు. దీనికోసం స్కూలు, మండల, జిల్లా స్థాయిల్లో క్లబ్‌లను ఏర్పాటు చేస్తారు. ఇందులో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, రవాణా, విద్యాశాఖ అధికారులు ప్రాతినిధ్యం వహిస్తారు. వీరు ఈ క్లబ్‌లకు మార్గదర్శకంగా ఉంటారు. దీని కోసం రవాణా, విద్య, స్త్రీశిశు సంక్షేమ శాఖలతో పోలీసు శాఖ ముందుగానే సమన్వయం చేసుకుంది.

ఏడాది కార్యాచరణ సిద్ధం!

డిగ్రీ, పీజీ విద్యార్థుల విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని ఆగస్టు నుంచి జూన్ వరకు ఏయే కార్యక్రమాలు ఎప్పుడు నిర్వహించాలో విమెన్ సేఫ్టీ వింగ్ ప్రత్యేక సిలబస్ రూపొందించింది. విద్యార్థుల నేతృత్వంలో నడిచే పబ్లిక్ సేఫ్టీ క్లబ్‌లకు వర్తించేలా ఈ సిలబస్ ఉండటం విశేషం.

ఏమేం చేస్తారు?

- విద్యార్థులకు ఆత్మస్థైర్యం, సంకల్ప బలం పెంచే కార్యక్రమాల నిర్వహణ
- ఆపదలో ఎలా వ్యవహరించాలి.. ఎవరిని సంప్రదించాలి.. అన్న విషయాల్లో శిక్షణ
- సామాజిక, మహిళా, శిశు, రోడ్డు భద్రతల్లో వినూత్న ఆవిష్కరణలకు వ్యాసాలు, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు
- వేధింపులు, సైబర్ నేరాలు, వర కట్నం, గృహ హింసలపై చైతన్యం చేయడం పోలీస్‌స్టేషన్ల, భరోసా కేంద్రాల సందర్శన చిన్నారుల్లో గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

స్కూలు/ కాలేజీ స్థాయి సేఫ్టీ క్లబ్..

ఇందులో ముగ్గురు పేరెంట్స్, 10 మంది విద్యార్థులు, ఒక లా అండ్ ఆర్డర్ మహిళా పోలీస్, ఒక ట్రాఫిక్ పోలీస్, గ్రామానికి చెందిన ఒక రాజకీయ నాయకురాలు సభ్యులుగా ఉంటారు. వీరంతా తొలుత విద్యార్థులకు, తల్లిదండ్రులకు, సమాజానికి రక్షణ, రోడ్డు భద్రత, డయల్ 100, ట్రాఫిక్ రూల్స్, హాక్ ఐ, షీటీమ్‌ల పనితీరు, వారిని ఎలా సంప్రదించాలి తదితర వివరాలపై సమగ్ర అవగాహన కల్పిస్తారు. స్థానిక పోలీస్ స్టేషన్ అధికారులు కూడా వీరు నిర్వహించే కార్యక్రమాల్లో పాలుపంచుకుంటారు.

జిల్లా సేఫ్టీ క్లబ్

స్కూలు/కాలేజీ స్థాయి సేఫ్టీ క్లబ్‌ల పనితీరును మదింపు చేసేందుకు జిల్లా సేఫ్టీ క్లబ్‌లు ఉంటాయి. ఇందులో జిల్లా విద్యాశాఖాధికారి, ఇద్దరు మహిళా ప్రముఖులు, అడిషనల్ ఎస్పీ ర్యాంకు ఆఫీసర్, ఐదు పాఠశాలల నుంచి ప్రతినిధులు, ఆర్టీఏ నుంచి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, జిల్లా క్రీడా/యువజన అధికారి, స్వయం సహాయక బృంద నాయకురాలు ఉంటారు.

రాష్ట్ర స్థాయి క్లబ్‌లు

జిల్లా స్థాయి సేఫ్టీ క్లబ్‌ల పనితీరును మదింపు చేసేందుకు రాష్ట్ర సేఫ్టీ క్లబ్‌లు ఉంటాయి. ప్రిన్సిపల్ సెక్రటరీ/విద్యాశాఖ కమిషనర్ నామినేట్ చేసిన రీజనల్ జాయింట్ డైరెక్టర్, పాఠశాల విద్య కమిషనర్ నామినేట్ చేసిన మహిళా ప్రతినిధి, అడిషనల్ డైరెక్టర్ జనరల్ లేదా ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ర్యాంకు అధికారి, రవాణా శాఖ, రాష్ట్రస్థాయి యువజన క్రీడా ప్రతినిధి, మెప్మా నుంచి ఓ అధికారి ఉంటారు.

రేవంత్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ పూర్తి

తీర్పు నేటికి వాయిదా

హైదరాబాద్: అనుమతులు లేకుండా డ్రోన్ కెమెరాలను వినియోగించిన కేసులో అరెస్టయ్యి చర్లపల్లి జైలులో ఉన్న మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై మంగళవారం కూకట్‌పల్లి 9వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరిగింది. ఉప్పరపల్లి 14వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ సెలవులో ఉండటంతో ఇన్‌చార్జ్ మెజిస్ట్రేట్‌గా వ్యవహరిస్తున్న కూకట్‌పల్లి 9వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ శ్రీదేవి కేసు విచారణను చేపట్టారు. రేవంత్ తరపున న్యాయవాది పాండురంగారెడ్డి వాదనలు వినిపించగా, నార్సింగి పోలీసుల తరపున పీపీ రఘు వాదనలు వినిపించారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి శ్రీదేవి తీర్పును బుధవారానికి వాయిదా వేశారు. అనంతరం కోర్టు వెలుపల న్యాయవాది పాండు రంగారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. నార్సింగి పోలీసులు రేవంత్‌రెడ్డిపై అక్రమంగా కేసులు బనాయించారని, కనీసం సీఆర్‌పీసీ 41 ప్రకారం నోటీసులు కూడా ఇవ్వకుండా అదుపులోకి తీసుకున్న విషయాన్ని న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు.

ఒక్కో మొక్కకు రూ.5,000

- 'చెట్ల దత్తత'పేరిట వినూత్న కార్యక్రమం
- శ్రీకారం చుట్టిన అటవీ అభివృద్ధి సంస్థ

సాక్షి, హైదరాబాద్: 'చెట్ల దత్తత' పేరిట ఓ వినూత్న కార్యక్రమానికి తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఒక్కో పెద్ద మొక్క/చెట్టును రూ.5 వేలు చెల్లించి దత్తత తీసుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. ప్రస్తుతం నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్కులోని ఏనుగులు మొదలుకుని చిన్న జంతువుల వరకు కార్పొరేట్ కంపెనీలు జంతు ప్రేమికులు, దత్తత తీసుకునే వెసులుబాటు ఉంది. ఇందులో భాగంగా ఆయా జంతువులను ఏడాది పాటే దత్తత తీసుకునే వీలుంది. దీనికి భిన్నంగా చెట్లను దత్తత తీసుకునే వారి పేరిట ఒక పెద్ద మొక్కను నాటి, అది పెరిగి పెద్దదయ్యే వరకు సంరక్షించే బాధ్యతను ఈ సంస్థ తీసుకుంటుంది. ఆ చెట్టుకు వారి పేరు పెట్టి, ఎప్పుడైనా సందర్శించి దానిని చూసుకునే వీలు కల్పిస్తోంది. ఈ మొక్కలను దత్తత ప్రక్రియ పూర్తయ్యాక తమ నర్సరీల్లో 12 నుంచి 15 అడుగుల ఎత్తున్న పెద్ద మొక్కలను నాటుతారు. మర్రి, రావి, జువ్వి చెట్లతోపాటు పక్షులు ఆవాసాన్ని ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా వివిధ పండ్ల చెట్లను దత్తతకు ఇచ్చేందుకు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం కింద కొత్తగూడలోని పాలపిట్ట సైక్లింగ్ పార్కు, కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటి, సంరక్షించే కార్యక్రమాన్ని ఈ సంస్థ కొనసాగిస్తోంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో (సీఎస్ఆర్) భాగంగా కార్పొరేట్, ఐటీ సంస్థలు, పర్యావరణ పరిరక్షణను ఇష్టపడేవారు ఎవరైనా ఈ చెట్లను దత్తత తీసుకునే అవకాశాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలోని కెనరా బ్యాంక్ మాసబ్‌ట్యాంక్ బ్రాంచ్ 200 పెద్ద మొక్కలను దత్తత తీసుకుంది. ఈ మొక్కల నిర్వహణ, పరిరక్షణ కోసం రూ.5 లక్షలు విడుదల చేసింది. ఐటీ రంగానికి చెందిన పలువురు ఈ మొక్కలను దత్తత తీసుకునేందుకు ఈ సంస్థకు హామీ పత్రాలిచ్చినట్లు అధికారులు తెలిపారు.

దత్తతకు 3,500 మొక్కలు అందుబాటులో..

ప్రస్తుతం 3,500 పెద్ద మొక్కలు దత్తత తీసుకునేందుకు అందుబాటులో ఉన్నాయి. దత్తత తీసుకున్న మొక్కలను ఎంపిక చేసిన పార్కుల్లో నాటుతాం. దత్తత తీసుకున్న వారు అప్పుడప్పుడు లేదా పిల్లల పుట్టిన రోజులు, పెళ్లిరోజులు, ఇతర ముఖ్యమైన తేదీల్లో వచ్చి చూసుకోవచ్చు. 12 నుంచి 15 అడుగుల ఎత్తున పెద్ద మొక్కలు నాటుతున్నం దున త్వరగా అవి పెరగడంతో పాటు మంచి ఫలితాలొచ్చే అవకాశాలున్నాయి.

- 'సాక్షి'తో అటవీ అభివృద్ధి సంస్థ వీసీ, ఎండీ పి.రఘువీర్

విదేశాలకు వెళ్లే విద్యార్థులకు నాలుగేళ్ల డిగ్రీ హానర్స్

బీఎస్సీ డేటా సైన్స్, బీకామ్ అనలిటిక్స్‌లో నాలుగేళ్ల హానర్స్ కోర్సు

ఓయూ మాజీ వీసీ రాంచంద్రం నేతృత్వంలో సిలబస్ కమిటీ

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ విద్యకు ధీటుగా సాధారణ డిగ్రీ కాలేజీల్లోనూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశ పెట్టేందుకు ఉన్నత విద్యా మండలి సిద్ధమైంది. దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా విద్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్న కోర్సులకు ప్రాధాన్యం ఇస్తున్న ఉన్నత విద్యా మండలి డిగ్రీలో బీఎస్సీ డాటా సైన్స్, బీకాం అనలిటిక్స్ కోర్సును ప్రవేశ పెట్టేందుకు ఇదివరకే నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి కోసం వెళ్లేవారికోసం, విదేశాల్లో చదువుకోవాలనుకునే వారి కోసం బీటెక్ తరహాలోనే నాలుగేళ్ల డిగ్రీ హానర్స్ కోర్సులను ప్రవేశ పెట్టాలని నిర్ణయానికి వచ్చింది. బీఎస్సీ డాటా సైన్స్ హానర్స్ (నాలుగేళ్ల కోర్సు), బీకాం అనలిటిక్స్ హానర్స్ (నాలుగేళ్ల కోర్సు) డిగ్రీలను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలకు బీటెక్ తరహాలో నాలుగేళ్ల డిగ్రీ చదివి ఉండాలన్న నిబంధన నేపథ్యంలో ఈ

నిర్ణయానికి వచ్చింది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలోని యూనివర్సిటీల బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో ఈ కోర్సులు అనుమతి పొందిలేవు. ఈ నేపథ్యంలో ఈ కోర్సులకు సిలబస్‌ను రూపొందించి, యూనివర్సిటీల బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో ఆమోదం తీసుకుని ప్రవేశ పెట్టేలా కసరత్తు చేస్తోంది. ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఆర్.రామచంద్రం నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. ఈనెల 14వ తేదీన కమిటీ సమావేశం జరగనుందని, అందులో సిలబస్, ఇతరత్రా విధివిధానాలను ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు. మరోవైపు ఈ సిలబస్‌కు సంబంధించి, డిగ్రీ కాలేజీల్లో ఈ సిలబస్‌ను బోధించే అధ్యాపకులకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు టీసీఎస్ ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 21వ తేదీన టీసీఎస్‌తో తాము ఒప్పందం చేసుకోబోతున్నట్లు వివరించారు. ఈ కోర్సులను రాష్ట్రంలోని 50 వరకున్న అటానమస్ కాలేజీలతోపాటు, పలు ప్రభుత్వ కాలేజీలు, నాణ్యత ప్రమాణాలు పాటించే ప్రైవేటు కాలేజీల్లో ప్రవేశ పెట్టేందుకు అనుమతిస్తామని వెల్లడించారు. ఇందుకు దరఖాస్తు చేసుకునేందుకు ఇప్పటికే అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. విద్యార్థులు మూడేళ్ల డిగ్రీ లేదా నాలుగేళ్ల హానర్స్ డిగ్రీలో తాము కోరుకున్న కోర్సును చదువుకునే వెసులుబాటు కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

వేలానికి స్వగృహ ఇళ్లు

- ఎట్టకేలకు అమ్మకానికి చర్యలు
- ధర నిర్ధారణ, ఇతర ఏర్పాట్ల పర్యవేక్షణకు ఐఏఎస్ అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీ ఏర్పాటు
- ఇళ్లపై ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థల కళ్లు

సాక్షి, హైదరాబాద్: అమ్ముడుపోకుండా ఏళ్లుగా పాడుబడ్డ గూళ్ల తరహాలో ఉండిపోయిన రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలంలో అమ్మేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం విధివిధానాలను ఖరారు చేసేందుకు ప్రభుత్వ కార్యదర్శులతో ఉన్నతస్థాయి త్రిసభ్య కమిటీని నియమించింది. గృహనిర్మాణ శాఖను పర్యవేక్షిస్తున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్‌లు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. 'ఉన్నవి ఉన్నట్టుగా'బండ్లగూడ, పోచారంలలో ఉన్న గృహ సముదాయాలను వేలం ద్వారా అమ్మేయనున్నారు. ఇందుకోసం ఆ ఇళ్లకు ఏ ధర నిర్ణయించాలో తేల్చేందుకు రియల్ ఎస్టేట్ రంగంలో మంచి అనుభవం ఉన్న సంస్థను కన్సల్టెంటుగా నియమించనున్నారు. ఈ మొత్తం ప్రక్రియను ఈ త్రిసభ్య కమిటీ పర్యవేక్షిస్తుంది.

ఏళ్లుగా పాడుబడుతూ..

మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలకే మెరుగైన ఇళ్లు అందించాలన్న ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఎంతో దూరదృష్టితో రాజీవ్ స్వగృహను ఏర్పాటు చేశారు. ఆయన హయాంలో మంచి వేగంతో పనులు జరిగాయి. ముందుగా కొన్ని ఇళ్లను సిద్ధం చేసి అమ్మాలనుకుని పనులు పరుగెత్తించే సమయంలో ఆయన మృతి చెందారు. ఆ తర్వాత ఒక్కసారిగా అది గాడితప్పింది. కొందరు నేతలు నిధులు స్వాహా చేయడం, ఆ నెపాన్ని అధికారులపైకి నెట్టడం, తర్వాత తమకు అనుకూలంగా ఉండే అధికారులను తెచ్చిపెట్టి ఏకంగా ప్రాజెక్టు మొత్తాన్ని పాడుబెట్టేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 32 చోట్ల 46,565 ఇళ్లను రూ. 8,504 కోట్లతో నిర్మించాలని తొలుత లక్ష్యంగా పెట్టుకున్నారు. నేతల తీరుతో ప్రాజెక్టు పాడుబడ్డాక, బెయిలవుట్ ప్యాకేజీతో పునరుద్ధరించే ప్రయత్నం జరిగింది. ఈ పేరుతో రూ. 1,071 కోట్లు ఖర్చవడం తప్ప ప్రాజెక్టుకు ఒరిగిందేమీ లేకుండా పోయింది. తర్వాత ఆ ఇళ్ల విషయంలో వెంటనే నిర్ణయం తీసుకోకపోవటం, సరైన యంత్రాంగం లేక, ఇళ్లు కొనేందుకు జనం ముందుకొచ్చినా అమ్మే పరిస్థితి లేకపోవటం, పర్యవేక్షణ సరిగా లేక ఇళ్లు అలాగే ఉండిపోయాయి. తెలంగాణ వచ్చిన తర్వాత వెంటనే ఏ నిర్ణయం తీసుకోక అదే పరిస్థితి కొనసాగింది. ఆ తర్వాత తమకు తక్కువ ధరకు కేటాయించాలంటూ ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. కానీ సంఘాలు తక్కువ రేటుకు అడగటంతో ప్రభుత్వం అంగీకరించలేదు. కనీసం కొంత ధర పెంచయినా ఇవ్వాలని కోరినా ఆ తర్వాత అది కూడా అమలు కాలేదు. ఇలా చూస్తుండగానే ఏళ్లు గడిచిపోయాయి. ఈలోపు దొంగలు ఆ ఇళ్ల తలుపులు, కిటికీలు ఎత్తుకుపోయారు. ప్రభుత్వానికి ఇప్పుడు నిధుల అవసరం రావడంతో ఆ ఇళ్లను వేలం ద్వారా అమ్మాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో తీర్మానం జరిగింది. ఇప్పుడు ఆ మేరకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వు జారీ చేసింది. అయితే ఇప్పటికే కొన్ని ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థలు ఆ ఇళ్లను గుండుగుత్తగా కొనేందుకు ఏర్పాటు చేసుకుంటున్నట్టు సమాచారం. బండ్లగూడ, పోచారంలో దాదాపు నాలుగువేల ఇళ్లతో కూడిన సముదాయాలు సిద్ధంగా ఉన్నాయి. గాజుల రామారం, జవహర్ నగర్‌లలో అసంపూర్తి నిర్మాణాలు ఉన్నా, వాటి విషయంలో త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

కంచికి చేరని ఆర్టీసీ కథ..!

- మళ్లీ మొదటికొచ్చిన ఆర్థిక సమస్యలు
- 2 నెలలుగా అద్దె బస్సులకు చెల్లించని బిల్లులు
- బస్సులు ఆపేస్తామంటున్న యజమానులు
- నిధులు లేక చేతులెత్తేసిన అధికారులు
- చార్జీల పెంపుతో ప్రభుత్వ సాయం నిలిపివేత

సాక్షి, హైదరాబాద్: అదిగో చార్జీలు పెరిగాయి.. ఇదిగో లాభాలు వస్తాయి.. అంటూ ఊరించిన పరిస్థితులు ఆదిలోనే ఉసూరుమనిపించాయి. ఆర్టీసీని మళ్లీ ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. చేతిలో డబ్బులేక గత 2 నెలలుగా అద్దె బస్సులకు చెల్లింపులు చేయక బకాయిలు పేరుకుపోయాయి. ఫిబ్రవరికి సంబంధించిన వేతనాలు చెల్లించేందుకు డబ్బులు లేక మార్చి 6 వరకు ఉద్యోగులు ఎదురుచూడాల్సి వచ్చింది. ఇలా జీతాలకే డబ్బుల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఉన్న తరుణంలో, అద్దె బస్సులకు బిల్లులు చెల్లించలేక ఆర్టీసీ చేతులెత్తేసింది. ఈనెల కూడా అందకపోతే బస్సులు ఆపేందుకు అద్దె బస్సుల యజమానులు సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఆర్టీసీలో దాదాపు 3 వేల అద్దె బస్సులు నడుస్తున్నాయి. ఆర్టీసీ సొంత బస్సుల సంఖ్య తగ్గిపోవటంతో ప్రస్తుతం అద్దె బస్సులే కీలకంగా మారాయి. గతంలో ఉన్న 2,100 బస్సులకు అదనంగా, ఇటీవల మళ్లీ దాదాపు 3 వేల అద్దె బస్సులు తీసుకున్నారు. దశలవారీగా అవి వచ్చి చేరుతున్నాయి. ఇప్పుడు బిల్లుల సమస్య తలెత్తితే ఆ బస్సులు నిలిచిపోతే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంది.

ఎందుకీ సమస్య?

ఆర్టీసీలో కొన్నేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న సంగతి తెలిసిందే. వస్తున్న ఆదాయం కంటే నిర్వహణ ఖర్చులు ఎక్కువగా ఉండటంతో నష్టాలకు కారణమవుతోంది. ఫలితంగా నిధుల్లేకుండా, అప్పులు కుప్పలుగా పేరుకుపోయాయి. ఈ పరిస్థితిలో కొత్త బస్సులు కొనటం సంస్థకు భారంగా మారింది. దీనికితోడు ఉద్యోగుల జీతాలు కూడా భారీగా పెరగడంతో ప్రతి బస్సుకు రెండు షిఫ్టులు కలిపి ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు కండక్టర్లను నియమించాల్సి వస్తోంది. ఇది నిర్వహణ ఖర్చును పెంచుతోంది. దీంతో సొంత బస్సుల కంటే అద్దె బస్సులే ఉత్తమమని నిర్ణయించిన ఆర్టీసీ రెండు మూడేళ్లుగా అద్దె బస్సుల సంఖ్య పెంచుతూ వచ్చింది. ప్రతి కిలోమీటరుకు నిర్ధారిత మొత్తాన్ని అద్దె బస్సు యజమానులకు చెల్లిస్తే సరిపోతుంది. ఆర్టీసీ ఒక్క కండక్టర్ ఖర్చు భరిస్తే సరిపోతుంది. డ్రైవర్లను వాటి యజమానులే నియమించుకోవాలి. దీంతో సొంతంగా బస్సులు కొనకుండా అద్దె బస్సులతోనే నెట్టుకురావాలని ఆర్టీసీ నిర్ణయించింది. సమ్మె వరకు ఆర్టీసీలో 2,100 అద్దె బస్సులుండేవి. ఆ తర్వాత రెండుసార్లు టెండర్లు పిలిచి కొత్తగా 3 వేలకుపైగా బస్సులు ఎంపిక చేశారు. కొత్త వాటిల్లో ఇప్పటికే కొన్ని బస్సులు చేరాయి. సమ్మెకు పూర్వం కొన్ని నెలల పాటు ఆర్టీసీ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది. రంఝన్‌గా 1వ తేదీన జీతాలు పడే పరిస్థితి కాస్తా వారం పది రోజులు ఆలస్యంగా చెల్లించాల్సిన దుస్థితి వచ్చింది. సొంత నిధులు లేకపోవటంతో ప్రతి నెలా ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాల్సి వచ్చేది. ఆర్టీసీకి చెల్లించాల్సిన బస్‌పాస్‌ల రాయితీ రీయింబర్స్‌మెంట్ బకాయిల్లో కొంత మొత్తం, మరికొంత సాయం కలిపి ప్రతినెలా సగటున రూ.70 కోట్ల వరకు చెల్లిస్తూ వచ్చేది. వాటితో జీతాలు చెల్లించేవారు. సమ్మె ముగిసిన తర్వాత కిలోమీటరుకు 20 పైసలు చొప్పున చార్జీలు పెంచారు. దీనివల్ల ఆర్టీసీకి క్రమంగా ఆదాయం పెరుగుతూ వచ్చింది. నిత్యం దాదాపు రూ.కోటిన్నరకు పైగా అదనపు ఆదాయం సమకూరుతోంది. ఎలాగూ ఆదాయం పెరిగిందన్న ఉద్దేశంతో ప్రభుత్వం జీతాల సమయంలో ఇచ్చే నిధుల విడుదలను ఆపేసింది. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. వచ్చే ఆదాయం ఖర్చులకే సరిపోకపోతుండటంతో రెండు నెలలుగా అద్దె బస్సుల యజమానులకు బిల్లులు చెల్లించట్లేదు. ఒక్కో బస్సుకు దాదాపు రూ.లక్ష వరకు చెల్లించాల్సి ఉంటుంది. అద్దె బస్సుల్లో సింహభాగం యజమానులు బ్యాంకుల నుంచి లోన్లు తీసుకుని బస్సులు కొన్నారని, సకాలంలో బిల్లులు రాక బ్యాంకులకు కిస్తీలు చెల్లించలేకపోతున్నట్లు అద్దె బస్సు యజమానుల సంఘం పేర్కొంటోంది. డ్రైవర్లకు సకాలంలో జీతాలు చెల్లించలేని వారు కూడా కొందరున్నారని, 2 నెలలుగా జీతాలు అందక డ్రైవర్లు రావట్లేదని పేర్కొంటోంది. పరిస్థితి ఇలాగే ఉంటే ఇక బస్సులను నిలిపేస్తామంటూ తాజాగా ఆర్టీసీకి అల్టిమేటం ఇచ్చారు.

బడ్జెట్ ఆశలు గల్లంతు

ఆర్టీసీకి తాజా బడ్జెట్‌లో అదనంగా నిధులు కేటాయిస్తారని అధికారులు ఆశించారు. ప్రతిసారి కేటాయించే మొత్తానికి అదనంగా రూ.వెయ్యి కోట్లు వస్తాయని భావించారు. కానీ మొత్తంగా రూ.వెయ్యి కోట్లతోనే ప్రభుత్వం సరిపెట్టింది. దీంతో బడ్జెట్ ఆశలు కూడా లేకపోవటంతో ప్రతినెలా అద్దె బస్సులకు బిల్లులు ఎలా చెల్లించాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. త్వరలో మరిన్ని అద్దె బస్సులు కూడా వచ్చి చేరనుండటంతో ఈ బిల్లుల భారం మరింత పెరగబోతోంది. అప్పుడు సమస్య మరింత తీవ్రమవుతుందని పేర్కొంటున్నారు.

టీజేఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న కోదండరాం

నిరుద్యోగంపై కేసీఆర్ తీరు దారుణం

టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం

సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగ సమస్యపై సీఎం కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడిన తీరు బాధ కలిగించిందని, అలా మాట్లాడటం దారుణమని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో అనేక పోస్టులు ఖాళీ అయ్యాయని, 2014లోనే లక్ష పోస్టులు ఉన్నాయని సీఎం స్వయంగా చెప్పారని పేర్కొన్నారు. ఇప్పటివరకు 35 వేల పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయని తెలిపారు. 40 లక్షల మంది నిరుద్యోగులు టీఎస్‌పీఎస్సీలో రిజిస్టర్ చేసుకున్నారని, అశోక్‌నగర్‌లో వేల మంది నిరుద్యోగులు కష్టాలు పడుతున్నారని వాపోయారు. రాష్ట్రంలో యువత అంధకారంలో ఉందని, వెంటనే ప్రభుత్వం ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ చూస్తే ప్రజలపై మరింత భారం పడేలా ఉందన్నారు. విద్యపై మనం చేసే ఖర్చు చాలా రాష్ట్రాల కంటే తక్కువగా ఉందన్నారు. ప్రభుత్వ స్కూళ్లు కొత్తవి పెట్టడం లేదని, ఉన్నవి మూసివేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ స్కూళ్ల ఫీజులను ప్రభుత్వం నియంత్రించలేకపోయిందని విమర్శించారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాడతామని వెల్లడించారు. దీనికి సంబంధించి త్వరలోనే తమ కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అరెస్టును ఖండిస్తున్నామని తెలిపారు. ఆయనపై కావాలనే నాన్ బెయిలబుల్ కేసు పెట్టారని, వెంటనే రేవంత్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్ పెంచి.. విద్యకు నిధులు తగ్గిస్తారా?

రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోంది..: షబ్బీర్ అలీ

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు విద్య అందకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ఆరోపించారు. 2020-21 ఆర్థిక సంవత్సరానికిగాను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌ను గత ఏడాదికన్నా రూ.40 వేల కోట్లకు పైగా పెంచి.. విద్యారంగానికి మాత్రం రూ. 1,270 కోట్లు తగ్గిస్తారా అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. సంవత్సరాల వారీగా పరిశీలిస్తే 2014-15లో మొత్తం బడ్జెట్‌లో విద్యకు 10.88 శాతం కేటాయిస్తే ఆ తర్వాతి సంవత్సరాల్లో వరుసగా 9.69, 8.23, 8.49, 7.61, 6.75 శాతం చొప్పున తగ్గిస్తూ వచ్చిందని, ప్రస్తుత బడ్జెట్‌లో దాన్ని 6.64 శాతానికి తగ్గించిందని తెలిపారు. ఇలా తగ్గించుకుంటూ పోవడం ద్వారా పేద, బడుగు విద్యార్థులను విద్యకు దూరం చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా అర్థమవుతోందని, దీన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని వెల్లడించారు. వెంటనే విద్యారంగానికి బడ్జెట్ అంచనాలను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉస్మానియాలోనూ 'కోవిడ్' పరీక్షలు

- కేంద్రం అనుమతిచ్చిందన్న వైద్య ఆరోగ్యమంత్రి ఈటల
- విమానాశ్రయంలో మరో రెండు థర్మల్ స్క్రీనింగ్ యంత్రాలు
- కోవిడ్ బాధిత సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు నెగెటివ్ వచ్చిందన్న మంత్రి
- అధికారులందరూ కలిసి సమన్వయంతో పనిచేస్తున్నారని వ్యాఖ్య
- మరోవైపు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించిన సీఎస్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కాలేజీకి అనుబంధంగా కోవిడ్ వైరస్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు కేంద్రం అనుమతినిచ్చిందని, అందుకు అవసరమైన పరికరాలు, కిట్లను పంపుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. మంగళవారం సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. అంతకుముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు మరో సమావేశం నిర్వహించారు. ఆయా సమావేశ వివరాలన్నింటినీ మంత్రి ఈటల రాజేందర్ మంగళవారం రాత్రి మీడియాకు వివరించారు. మంత్రి ఈటల మాట్లాడుతూ, గాంధీ వైరాలజీ ల్యాబ్‌కు అదనంగా ఉస్మానియాలో ఏర్పాటు చేయబోయే కోవిడ్ నిర్ధారణ కేంద్రం పనిజేస్తుందన్నారు. ఎంతమంది వచ్చినా పరీక్షలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, పుణేకు పంపకుండా ఇక్కడే పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అలాగే హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)లోనూ కోవిడ్ పరీక్షా నిర్ధారణ కేంద్రానికి అనుమతి కోరామన్నారు. కోవిడ్ పాజిటివ్ వచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు తాజాగా పరీక్షలు నిర్వహించామని, ఆయనకు నెగెటివ్ వచ్చిందన్నారు. మరోమారు పరీక్ష చేసి, నాలుగైదు రోజుల్లో అతన్ని డిశ్చార్జి చేస్తామన్నారు. అంటే ఈ క్షణానికి తెలంగాణలో ఒక్క మనిషికి కూడా కోవిడ్ వైరస్ లేదని మంత్రి సగర్వంగా ప్రకటించారు. పక్క రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు పెరగడంతో మరింత అప్రమత్తంగా ఉన్నామన్నారు. విమానాశ్రయంలో 24 గంటలూ స్క్రీనింగ్ చేయడానికి ఏర్పాటు చేశామన్నారు.

రెండు స్టాండింగ్ థర్మల్ స్క్రీనింగ్ యంత్రాల కొనుగోలు...

రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి స్టాండింగ్ థర్మల్ స్క్రీనింగ్ యంత్రాలు ఇవ్వాలంటూ కేంద్రాన్ని కోరామని ఈటల తెలిపారు. అయితే అందుకు కేంద్రం సహకరించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వాటిని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పేర్కొంటూ, రెండు థర్మల్ స్క్రీనింగ్ యంత్రాలకు ఆర్డర్ ఇచ్చామన్నారు. ప్రస్తుతం విమానాశ్రయంలో నాలుగు థర్మల్ స్క్రీనింగ్ యంత్రాలు ఉన్నాయన్నారు. అవన్నీ మంచిగానే పనిచేస్తున్నాయన్నారు. తాను కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి హర్షవర్ధన్‌తో మంగళవారం మాట్లాడానన్నారు. అన్ని విమానాశ్రయాల్లోనూ కోవిడ్ స్క్రీనింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరానన్నారు. అందుకు వారు అంగీకరించారన్నారు. మన విమానాశ్రయంలో ఏడు ఏరో బ్రిడ్జీలు ఉన్నాయని, ప్రస్తుతం ఉన్న వైద్య సిబ్బంది సరిపోవడం లేదని, ఈ నేపథ్యంలో నాలుగు రెట్లు పెంచి 200 మందితో 24 గంటలు స్క్రీనింగ్ చేస్తామన్నారు. వివిధ రాష్ట్రాల్లో పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో మన దగ్గర ఒకవేళ కోవిడ్ కేసులు వస్తే ఏం చేయాలన్నదానిపై తదుపరి చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉన్న సౌకర్యాలపై చర్చించామన్నారు. కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయిలో సర్వసన్నద్ధంగా ఉన్నామన్నారు. కేంద్ర వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి రాష్ట్రంలో పని జేసే సిబ్బంది తక్కువగా ఉంటారని, వారితో కొంత గ్యాప్ ఉందన్న మాట వాస్తవమేనన్నారు. ఇప్పటివరకు హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 41,102 మందికి థర్మల్ స్క్రీనింగ్ చేశామని, అందులో 277 మందికి అనుమానిత లక్షణాలున్న కారణంతో పరీక్షలు చేయగా, వారందరికీ నెగిటివ్ వచ్చిందని మంత్రి ప్రకటించారు. విదేశాల నుంచి వచ్చే ప్రయాణీకుల డేటా అంతా సేకరిస్తున్నామని, వాళ్ల ఇళ్ల దగ్గర ఐసోలేషన్ చేస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కోవిడ్ అలెర్ట్ ప్రకటించామన్నారు. కేరళ రాష్ట్రంలో పర్యటించిన వైద్య బృందం నివేదిక ఇచ్చిందన్నారు. ఆ రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతానికి మన రాష్ట్రంలో పెద్దగా వ్యాప్తి చెందనందున ఆ స్థాయిలో వార్డులు అవసరం లేదనీ, కానీ జిల్లాస్థాయిలో ఐసోలేషన్ వార్డులను సిద్ధంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి గ్రామపంచాయతీ వరకు కోవిడ్ వైరస్‌పై సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. కమాండ్ కంట్రోల్ రూం కోసం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి అధికారులంతా కలిసి సమన్వయంతో పనిచేస్తున్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ సూచన...

చైనా, హాంకాంగ్, దక్షిణ కొరియా, జపాన్, ఇటలీ, థాయ్‌లాండ్, సింగపూర్, మలేసియా, ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ దేశాల నుంచి భారతదేశంలోకి వచ్చే ప్రయాణికులంతా స్వతహాగా 14 రోజులు హోమ్ ఐసోలేషన్‌లో ఉండాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది.

మఖ్దూంభవన్‌లో మాట్లాడుతున్న చాడ. చిత్రంలో నారాయణ

ప్రభుత్వ భూములు బేరం పెడితే అడ్డుకుంటాం: సీపీఐ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ భూముల వేలం ద్వారా నిధులు సమీకరించి ద్రవ్యలోటును పూడ్చుకోవాలన్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సరికాదని సీపీఐ అభిప్రాయపడింది. ఇప్పటికే ప్రభుత్వ భూములు చాలా మటుకు ఆక్రమణలకు గురికాగా, మిగిలిన భూములను సైతం బేరం పెడతామంటే తమ పార్టీ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని ఆ పార్టీ కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి హెచ్చరించారు. గతంలోని ప్రభుత్వాలు కూడా ఇలాగే భూములు అమ్ముకుని ఉంటే ఇప్పుడు అసలు ప్రభుత్వ భూములనేవి ఉండేవా? అని ప్రశ్నించారు. మంగళవారం మఖ్దూంభవన్‌లో పార్టీ నాయకులు కె.నారాయణ, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లోని లొసుగులను తొలగించేందుకు సర్వే నెంబర్ల వారీగా సమగ్ర భూసర్వే నిర్వహించాలని డిమాండ్‌చేశారు. మధ్యప్రదేశ్ రాజకీయాల్లో బీజేపీ అనైతిక, రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని నారాయణ విమర్శించారు. సీఏఏ, ఎన్‌పీఆర్, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా ఈ నెల 23న షహీద్ భగత్ సింగ్ వర్ధంతి వరకు దేశవ్యాప్త ప్రచార, నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

'డిండి' దారెటు?

- ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే అలైన్‌మెంట్‌కు దక్కని మోక్షం
- ఇంకా ప్రభుత్వ పరిశీలనలోనే ప్రతిపాదనలు..
- ప్రాజెక్టుల కింద 16 వేల ఎకరాల మేర భూసేకరణలో పూర్తయింది సగమే..
- 'మల్లన్నసాగర్' పరిహారం కోరుతుండటంతో చాలా చోట్ల నిలిచిన పనులు

సాక్షి, హైదరాబాద్: ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు రక్షిత మంచి నీటిని అందించే ఉద్దేశంతో చేపట్టిన డిండి ఎత్తిపోతల పథకానికి మార్గదర్శనం కరువైంది. ఈ ప్రాజెక్టుకు నీటిని తీసుకునే అలైన్‌మెంట్‌ను ఐదేళ్ల సుదీర్ఘ కాలం తర్వాత ఖరారు చేసినా, దీనికి ఇంతవరకూ ప్రభుత్వ ఆమోదం దక్కలేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని నార్లాపూర్ నుంచి కాకుండా ఏదుల (వీరాంజనేయ) రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకునేందుకు ఇప్పటికే నీటి పారుదల శాఖ ఓకే చెప్పినా, ప్రభుత్వం ఇంకా నాన్చుతుండటంతో ఎటూ తేలడం లేదు. ఇక ఇప్పటికే మొదలైన రిజర్వాయర్ల పరిధిలోనూ భూసేకరణ, సహాయ పునరావాస పనుల్లో అవాంతరాలున్నా వాటిని పట్టించుకొని పరిష్కరించేవారే కరువయ్యారు.

కొలిక్కి వచ్చినా ముందుకు సాగలే...

శ్రీశైలం నుంచి 30 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగిస్తూ, నాగర్ కర్నూల్, నల్లగొండ, యాదాద్రి, రంగారెడ్డి జిల్లాల్లోని 7 నియోజకవర్గాలు, 21 మండలాల పరిధిలోని 3.61 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించేలా రూ.6,190 కోట్లతో డిండి ప్రాజెక్టును చేపట్టారు. ఈ ప్రాజెక్టుకు 2015 జూన్ 11న సీఎం కె.చంద్రశేఖర్‌రావు శంకుస్థాపన చేశారు. అయితే మొదట ఈ ప్రాజెక్టుకు పాలమూరు ఎత్తిపోతల్లోని రెండో రిజర్వాయర్ ఏదుల నుంచి రోజుకు 0.5 టీఎంసీ నీటిని 60 రోజుల పాటు 30 టీఎంసీల నీటిని తరలించేలా ప్రభుత్వం పరిపాలనా అనుమతులు సైతం ఇచ్చింది. అనంతరం తిరిగి పాలమూరు ప్రాజెక్టులోని మొదటి రిజర్వాయర్ నార్లాపూర్ నుంచే తీసుకునేలా ప్రణాళిక రూపొందించింది. అయితే ఈ ప్రతిపాదనలతో భూసేకరణ అవసరాలు ఎక్కువగా ఉండటం, అటవీ భూముల ముంపు సైతం ఉండటంతో తిరిగి ఏదుల నుంచే తీసుకోవాలని ఇటీవలే తుది నిర్ణయం తీసుకున్నారు. ఏదుల నుంచి 800 మీటర్ల మేర అప్రోచ్ చానల్, తర్వాత 2.52 కిలోమీటర్ల మేర ఓపెన్ చానల్, అటునుంచి తిరిగి 16 కిలోమీటర్ల మేర టన్నెల్ ద్వారా నీరు ప్రవహిస్తుంది. తర్వాత మళ్లీ 3 కిలోమీటర్ల మేర ఓపెన్ చానల్‌లో ప్రవహించి, సహజ సిద్ధ వాగులో కలసి, కొత్తగా ప్రతిపాదించిన ఉల్పర రిజర్వాయర్‌కు నీరు చేరుతుంది. అటునుంచి డిండికి నీటిని చేరుస్తారు. ఈ ప్రతిపాదనకు రూ.1,293.55 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఈ ప్రతిపాదనలను జనవరిలోనే ప్రభుత్వ అనుమతికై పంపినా ఇంతవరకు అనుమతులివ్వలేదు. దీంతో ఈ ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. ముఖ్యమంత్రి స్థాయిలో దీన్ని సమీక్షించి ఓకే చెబితే కానీ దీనికి అనుమతులు వచ్చేలా కనిపించడం లేదు. అనుమతులు వస్తే కానీ టెంటర్లు పిలిచి పనులు చేపట్టడం సాధ్యం కాదు.

భూసేకరణ నిధులకూ తంటాలు...

ఏదుల నుంచి డిండికి నీటిని తీసుకునే అలైన్‌మెంట్ ఖరారు కానుందున, అంతలోగా నల్లగొండ జిల్లాలో ఖరారైన సింగరాజుపల్లి (0.8 టీఎంసీ), గొట్టిముక్కల (1.8 టీఎంసీ), చింతపల్లి (0.99 టీఎంసీ), కిష్టరాంపల్లి(5.68 టీఎంసీ), శివన్నగూడెం (11.96 టీఎంసీ) రిజర్వాయర్లు వాటికి అనుబంధంగా మెయిన్ కెనాల్ పనులను ప్రభుత్వం రూ.3,929 కోట్లతో చేపట్టింది. ఈ పనుల్లో మెజార్టీ పనులే ఇప్పటికే ఆరంభమయ్యాయి. ఈ రిజర్వాయర్ల కింద 16,135 ఎకరాల మేర భూసేకరణ చేయాల్సి ఉండగా, 8 వేల ఎకరాల మేర పూర్తి చేశారు. మరో 8 వేల ఎకరాలు ఎక్కడికక్కడే ఉంది. ఇక్కడ సేకరించిన భూములకు సంబంధించి రూ.181 కోట్ల మేర ఇంతవరకూ చెల్లించలేదు. దీంతో కొత్తగా భూములు ఇచ్చేందుకు రైతులు నిరాకరిస్తున్నారు. అదీగాక కాళేశ్వరంలోని మల్లన్నసాగర్ రైతులకు ఇచ్చిన మాదిరే పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా కిష్టరాంపల్లి, చింతపల్లి రిజర్వాయర్ పరిధిలోని ముంపు గ్రామాలు ప్రభుత్వం ప్రకటించిన దానికన్నా ఎక్

• ఆపరేషన్ కమల్‌నాథ్

కాంగ్రెస్‌కు సింధియా బైబై

- పార్టీకి 22 మంది ఎమ్మెల్యేల రాజీనామా
- మధ్యప్రదేశ్‌లో మైనార్టీలో కాంగ్రెస్ సర్కారు
- 15 ఏళ్ల తరువాత ఏర్పాటై 15 నెలలకే పతనం దిశగా కమల్‌నాథ్ ప్రభుత్వం

తమ రాజీనామా లేఖలను బెంగళూరులోని రిసార్ట్‌లో మీడియాకు చూపిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ/భోపాల్: దేశమంతా హోలీ వేడుకల్లో ఉన్న వేళ కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తరువాత మధ్యప్రదేశ్‌లో ఏర్పాటైన 15 నెలల కాంగ్రెస్ సర్కారు పతనం అంచున చేరింది. గ్వాలియర్ రాజ కుటుంబానికి చెందిన యువనేత జ్యోతిరాదిత్య సింధియా మంగళవారం కాంగ్రెస్‌ను వీడటం.. ఆ వెంటనే ఆయనకు మద్దతుగా 22 మంది శాసన సభ్యులు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు స్పీకర్‌కు లేఖలు పంపడంతో సీఎం కమల్‌నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏ క్షణమైనా కుప్పకూలే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. రాజీనామాలు చేసిన వారిలో ఆరుగురు మంత్రులు కూడా ఉన్నారు. రాజీనామాలు ఆమోదం పొందితే కాంగ్రెస్ ప్రభుత్వం 92 మంది సొంత ఎమ్మెల్యేలతో మైనార్టీలో పడుతుంది. కాంగ్రెస్‌కు ప్రస్తుతం మద్దతిస్తున్న ఏడుగురు ఇతర సభ్యుల మద్దతు కీలకం కానుంది. తాజా పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ శాసన సభా పక్ష సమావేశాలను నిర్వహించి తమ ఎమ్మెల్యేలను రహస్య ప్రాంతానికి తరలించాలని నిర్ణయించాయి.

అమిత్ షాతో భేటీ అనంతరం ప్రధాని వద్దకు..

సింధియా ఉదయం తొలుత కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. అనంతరం వారిద్దరూ కలసి ఢిల్లీలోని 7 లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని మోదీ నివాసానికి చేరుకుని ఆయనతో దాదాపు గంటపాటు చర్చించారు. అనంతరం కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు పార్టీ అధ్యక్షురాలు సోనియాకు సింధియా లేఖ పంపారు. **'18 ఏళ్లుగా కాంగ్రెస్ సభ్యుడిగా ఉన్నా. ఇక ముందుకు వెళ్లాల్సిన సమయం ఆసన్నమైంది. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నా. ప్రస్తుత పరిస్థితిల్లో ఇంకా పార్టీలో కొనసాగితే దేశ, రాష్ట్ర ప్రజలకు సేవ చేయలేనని అనిపిస్తోంది. నా ప్రజలు, కార్యకర్తల కోసం కొత్త ప్రయాణాన్ని ప్రారంభించడం మెరుగని భావిస్తున్నా. ఇన్నాళ్లు దేశానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నా'** అని లేఖలో సింధియా పేర్కొన్నారు. కాంగ్రెస్ నుంచి సింధియా బహిష్కరణను సోనియా ఆమోదించినట్లు ఏఐసీసీ తెలిపింది.

రాజ్యసభకు జ్యోతిరాదిత్య!

జ్యోతిరాదిత్య నేడో రేపో బీజేపీలో చేరవచ్చని, ఆయనకు రాజ్యసభ సభ్యత్వంతోపాటు కేంద్ర మంత్రి పదవి దక్కే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాజ్యసభ నామినేషన్ల దాఖలుకు ఈనెల 13తో గడువు ముగుస్తున్నందున ఈలోపే ఆయన కచ్చితంగా బీజేపీలో చేరతారనే ప్రచారం జరుగుతోంది. సింధియా నిర్ణయాన్ని 'ఘర్ వాపసీ'గా ఆయన మేనత్త, బీజేపీ ఎమ్మెల్యే యశోధరా రాజే అభివర్ణించారు. తన తండ్రి, దివంగత కాంగ్రెస్ నేత మాధవరావు సింధియా 75వ జయంతి రోజే జ్యోతిరాదిత్య పార్టీతో బంధాన్ని తెంచుకోవడం గమనార్హం.

స్వతంత్రులు, ఇతరులు కీలకం..

ప్రస్తుతం 228 మంది ఎమ్మెల్యేలున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీలో తిరుగుబాటుకు ముందు కాంగ్రెస్‌కు 114 మంది ఎమ్మెల్యేలు ఉండగా తాజా రాజీనామాలతో సొంత బలం 92కి పడిపోయింది. సభలో బల నిరూపణకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 104 కాగా బీజేపీకి ఇప్పటికే 107 మంది సభ్యులున్నారు. నలుగురు స్వతంత్రులతోపాటు ఇద్దరు బీఎస్పీ సభ్యులు, సమాజ్‌వాదీ పార్టీకి ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇప్పటివరకు మద్దతిస్తున్నారు. తాజాగా బీఎస్పీ ఎమ్మెల్యే సంజీవ్ సింగ్ కుశావహ, సమాజ్‌వాదీ శాసన సభ్యుడు రాజేశ్ శుక్లా మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశం కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

స్పీకర్‌కు లేఖలు అందించిన బీజేపీ నేతల బృందం

కాంగ్రెస్‌ను వీడుతున్నట్లు ప్రకటించిన 19 మంది ఎమ్మెల్యేల రాజీనామాలను బీజేపీ నేతల బృందం మధ్యప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ ఎన్‌పీ ప్రజాపతికి అందచేసింది. రాజీనామా లేఖలు అందాయని, నియమ నిబంధనలను అనుసరించి దీనిపై నిర్ణయం తీసుకుంటానని స్పీకర్ తెలిపారు. ఈ ఎమ్మెల్యేలంతా ప్రస్తుతం బెంగళూరులో ఉన్నారు. సీనియర్ బీజేపీ నేత భూపేంద్రసింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామా లేఖలతో ప్రత్యేక విమానంలో భోపాల్ చేరుకున్నట్లు పార్టీ ఎమ్మెల్యే విశ్వాస్ సారంగ్ తెలిపారు. మరో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నేరుగా రాజీనామాలు అందించారు. ప్రతిపక్ష నేత గోపాల్ భార్గవ, భూపేంద్రసింగ్, నరోత్తమ్ మిశ్రా, సారంగ్‌తో కూడిన బృందం స్పీకర్ నివాసానికి చేరుకుని కాంగ్రెస్ సభ్యుల రాజీనామాలను అందచేసింది. ఒకవైపు ఈ ఉత్కంఠ కొనసాగుతుండగా మరోవైపు కాంగ్రెస్ రాజీనామా చేసిన ఆరుగురు మంత్రులను తక్షణమే తొలగించాలని కోరుతూ కమల్‌నాథ్ గవర్నర్‌కు లేఖ రాశారు.

పోలీస్ రక్షణ కోరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

తమకు పోలీస్ రక్షణ కల్పించాలని కోరుతూ బెంగళూరు చేరుకున్న 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కర్ణాటక డీజీపీకి లేఖ రాశారు. ఓ అత్యవసర పని నిమిత్తం తాము కర్ణాటకకు స్వచ్ఛందంగా వచ్చినట్లు అందులో పేర్కొన్నారు. బెంగళూరు పరిసరాల్లో తాము స్వేచ్ఛగా సంచరించేందుకు వీలుగా భద్రత కల్పించాలని ఈనెల 9వ తేదీతో ఉన్న లేఖలో కోరారు. వీరిలో ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలున్నారు.

కాంగ్రెస్ విశ్వ ప్రయత్నాలు

సంక్షోభం ముదరటంతో సింధియాను బుజ్జగించి రాజీనామా చేసిన పార్టీ ఎమ్మెల్యేలను వెనక్కి రప్పించి ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు యత్నిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. సింధియాను బుజ్జగించేందుకు రాజస్తాన్ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్‌ను దూతగా పంపినా ఆయన అందుబాటులోకి రాకపోవడంతో ఆ యత్నాలు ఫలించలేదని తెలిపాయి. 'మధ్యప్రదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభం త్వరలోనే పరిష్కారమై నేతల మధ్య తలెత్తిన విబేధాలు ముగుస్తాయని భావిస్తున్నా. ప్రజలకు చేసిన వాగ్దానాలను నెరవేర్చేందుకు రాష్ట్రానికి స్థిరమైన సర్కారు అవసరం'అని సచిన్ పైలట్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. నిజమైన కాంగ్రెస్ నేతలెవరూ పార్టీని ఇలాంటి పరిస్థితుల్లో వదిలి వెళ్లరని మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. మరోవైపు మంగళవారం జ్యోతిరాదిత్య తండ్రి మాధవ్‌రావ్ సింధియా జయంతి సందర్భంగా ఆయన రాజకీయ చాణక్యుడని ప్రశంసిస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ ట్వీట్ చేసింది. మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ కూడా ట్వీట్ చేసిన వారిలో ఉన్నారు.

ఎగసిన అసంతృప్తి: మధ్యప్రదేశ్ రాజకీయాల్లో పాత తరానికి చెందిన సీఎం కమల్‌నాథ్‌తో సింధియాకు దీర్ఘకాలంగా విభేదాలు నెలకొన్నాయి. ఎన్నికల అనంతరం స్వల్ప మెజార్టీతో కమల్‌నాథ్ పగ్గాలు చేపట్టారు. ప్రభుత్వంలో సింధియా మద్దతుదారులను పక్కనబెట్టడం, రాష్ట్ర కాంగ్రెస్ సారథ్య బాధ్యతలు కూడా దక్కకపోవడంతో ఆయన శిబిరంలో అసంతృప్తి రాజుకుంది. కాంగ్రెస్ అగ్ర నాయకత్వం కూడా ఈ విషయాలను పట్టించుకోకపోవడంతో తిరుగుబాటు జెండా ఎగురవేశారు. తాజా పరిణామాలతో పార్టీ నేతలను ఏకతాటిపై నడపటంలో కాంగ్రెస్ నాయకత్వ లేమి మరోసారి బయటపడిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

లక్నో హోలీ వేడుకల్లో గవర్నర్ లాల్జీ

రాష్ట్ర రాజకీయ పరిణామాలను గమనిస్తున్నామని, ఏ నిర్ణయమైనా రాజ్‌భవన్ చేరుకున్నాక తీసుకుంటానని లక్నోలో హోలీ వేడుకల్లో పాల్గొన్న మధ్యప్రదేశ్ గవర్నర్ లాల్జీ టాండన్ పేర్కొన్నారు. 'ప్రస్తుతం నేను ప్రేక్షకుడిని మాత్రమే. అక్కడకు (భోపాల్) చేరుకున్నాక అన్నీ గమనించాక స్పందిస్తా'అని చెప్పారు.

సర్కార్‌కు ముప్పులేదు: సీఎం కమల్

''నా ప్రభుత్వానికి ఎలాంటి ముప్పు లేదు. తిరుగుబాటు ఎమ్మెల్యేలతో చర్చిస్తున్నా. వారిని బందీలుగా ఉంచారు. లేదంటే ఎమ్మెల్యేలు బెంగళూరులో ఎందుకు ఉంటారు?'అని సీఎం కమల్‌నాథ్ మంగళవారం రాత్రి పేర్కొన్నారు.

సింధియా టైమ్స్

సహనం కోల్పోయిన జ్యోతిరాదిత్య • ఆపరేషన్ కమల్‌కి ఆకర్షితులయ్యారిలా..!

న్యూఢిల్లీ: అది 2018 డిసెంబర్ 13.. మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేజిక్కించుకున్నాక ముఖ్యమంత్రి పీఠం ఎవరికి దక్కుతుందా అని జోరుగా చర్చలు జరుగుతున్న వేళ. ఆ టైమ్‌లో రాహుల్‌గాంధీ కుడిచేత్తో జ్యోతిరాదిత్య సింధియాని, ఎడమ చేత్తో కమల్‌నాథ్ చేయి పట్టుకొని ఉన్న ఫొటోతో పాటు టాల్‌స్టాయ్ ప్రముఖ కొటేషన్ 'అత్యంత శక్తిమంతమైన పోరాటయోధులు ఇద్దరే. ఒకరు సహనం, మరొకరు సమయం'' అని షేర్ చేశారు. అది జరిగిన సరిగ్గా 15 నెలలు తర్వాత సింధియాలో సహనం నశించింది. పార్టీని వీడాల్సిన టైమ్ కూడా వచ్చిందని అర్థమైంది. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన దగ్గర్నుంచి సింధియా చాలా అసంతృప్తితో ఉన్నారు. పార్టీలో ఏకాకిగా మారిపోయారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు కొత్త జవసత్వాలు కల్పించడానికి ఎనలేని కృషి చేసి పార్టీకి ఒక జ్యోతిగా మారిన సింధియా సీఎం పదవిని ఆశించారు. కమల్‌నాథ్, దిగ్విజయ్ సింగ్ చేసిన జుగల్‌బందీ రాజకీయాలతో ఆయన ఆశించిన పదవి దక్కలేదు. సింధియాకు అనుభవం లేదన్న ఒకే ఒక్క కారణంతో సీనియర్ నేత కమల్‌నాథ్‌కు సీఎం పీఠం అప్పగించారు. సోనియాగాంధీ. పీసీసీ అధ్యక్ష పదవిని కూడా పార్టీలో ఏకాభిప్రాయం లేదన్న కారణంతో తిరస్కరించారు. సీఎం కమల్‌నాథ్ ఆయనతో ఎప్పుడూ కలిసి నడవలేదు. పార్టీపైన కూడా కమల్‌నాథ్ ఆధిపత్యమే కొనసాగింది. ఆ తర్వాత జ్యోతిరాదిత్యని పశ్చిమ ఉత్తరప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇది ఒక రకంగా పనిష్మెంట్ అనే చెప్పాలి. కాంగ్రెస్ పార్టీకి ఉనికి కూడా లేని ప్రాంతానికి ఇన్‌చార్జ్‌గా నియమాకం జ్యోతిరాదిత్యకు మింగుడుపడలేదు. ఆ తర్వాత రాజ్యసభ ఎంపీగా ప్రయత్నాలు చేశారు. కానీ అధిష్టానం నుంచి ఎలాంటి సంకేతాలు రాలేదు. అలాంటి సమయంలోనే బీజేపీ ఆయనతో సంప్రదింపులు జరిపింది. అప్పటికే కమల్‌నాథ్, దిగ్విజయ్ సింగ్ చేస్తున్న రాజకీయాలతో పార్టీలో తనకెలాంటి భవిష్యత్ ఉండదని భావించిన జ్యోతిరాదిత్య సింధియా ఆపరేషన్ కమల్‌కి ఆకర్షితులైనట్టు పేరు వెల్లడించడానికి ఇష్టపడని బీజేపీ నాయకుడు ఒకరు చెప్పారు. సింధియాని రాజ్యసభకు పంపించి ఎన్డీయే కేబినెట్‌లో మంత్రి పదవి ఇస్తారని, చౌహాన్ నేతృత్వంలో మధ్యప్రదేశ్‌లో సర్కార్ ఏర్పడితే సింధియా వెంట వచ్చే ఎమ్మెల్యేలకు రాష్ట్రంలో మంత్రి పదవులివ్వడానికి బీజేపీ అధిష్టానం అంగీకరించినట్టు సమాచారం.

ఏడాదిగా సంకేతాలు

జ్యోతిరాదిత్య పార్టీ వీడి కాషాయం గూటికి చేరుతారని ఏడాదిగా సంకేతాలు వెలువడుతూనే ఉన్నాయి. 2019 జనవరిలో ఆయన బీజేపీ నేత శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలుసుకున్నారు. ఆ తర్వాత అది మర్యాదపూర్వక సమావేశమనేనని ఇరువురు నేతలు చెప్పుకున్నారు. 2019 నవంబర్‌లో ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల అకౌంట్లలో తన బయోడేటా నుంచి కాంగ్రెస్ పార్టీ పేరుని, ప్రధాన కార్యదర్శి అన్న హోదాను తొలగించి సామాజికవేత్త, క్రికెట్ ప్రేమికుడు అని రాసుకున్నారు. ఇక సోనియా, రాహుల్ నిర్ణయాలు, వివిధ అంశాల్లో పార్టీ వైఖరి కూడా జ్యోతిరాదిత్యకు మింగుడుపడలేదు. కశ్మీర్ ఆర్టికల్ 370 రద్దుపై కూడా ఆయన బహిరంగంగానే తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇలా చాలా కాలంగా జ్యోతిరాదిత్య పార్టీని ఏ క్షణంలోనైనా వీడుతారన్న ప్రచారమైతే జరుగుతోంది.

మధ్యప్రదేశ్ గ్వాలియర్ రాజకుటుంబానికి చెందిన జ్యోతిరాదిత్య సింధియా మాధవరావు సింధియా దంపతులకు 1971, జనవరి 1న బొంబాయిలో జన్మించారు. డెహ్రాడూన్ డూన్ స్కూల్లో ప్రాథమిక విద్య అభ్యసించారు. హార్వర్డ్ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్రంలో గ్రాడ్యుయేషన్ చేశారు. స్టాన్‌ఫర్డ్ బిజినెస్ స్కూలు నుంచి ఎంబీఏ చేశారు.2001లో హెలికాప్టర్ ప్రమాదంలో తండ్రి మాధవరావు మరణించిన తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. ఉప ఎన్నికల్లో తండ్రి మృతితో ఖాళీ అయిన గుణ స్థానం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఇదే స్థానం నుంచి మూడు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. మన్మోహన్ సింగ్ కేబినెట్‌లో కమ్యూనికేషన్లు, ఐటీ శాఖ సహాయమంత్రిగా కూడా పని చేశారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మోదీ మ్యాజిక్‌ను తట్టుకొని లోక్‌సభకు ఎన్నికైన అతి కొద్ది నాయకుల్లో జ్యోతిరాదిత్య ఒకరు.

నాడు మోదీ మ్యాజిక్‌ను తట్టుకుని

నంబర్ గేమ్

- మధ్యప్రదేశ్ అసెంబ్లీలో సభ్యులు: 228(230)
- రాజీనామా చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు = 22
- రాజీనామాలు ఆమోదం పొందితే సభలో సభ్యుల సంఖ్య = 206
- మ్యాజిక్ ఫిగర్ (బల నిరూపణకు అవసరమైన సభ్యుల సంఖ్య) = 104
- రాజీనామాలు ఆమోదం పొందితే కాంగ్రెస్ సొంత బలం = 92
- స్వతంత్రులు + బీఎస్పీ + ఎస్‌పీ = 7
- బీజేపీ సభ్యుల బలం = 107

(ఇద్దరు సభ్యులు చనిపోవడంతో రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి.)

సీఎల్పీ భేటీకి 100 మంది హాజరు?

మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా సమావేశానికి నలుగురు స్వతంత్ర సభ్యులతో సహా మొత్తం 100 మంది హాజరైనట్లు ఓ మంత్రి తెలిపారు. సీఎం నాయకత్వంపై వారంతా విశ్వాసాన్ని వ్యక్తం చేసినట్లు చెప్పారు. ఇద్దరు బీఎస్పీ సభ్యులతోపాటు సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే దీనికి హాజరు కాలేదని వివరించారు. పార్టీకి రాజీనామా చేసిన ఎమ్మెల్యేలెవరూ దీనికి హాజరు కాలేదు.

బీజేపీలో సింధియాలు.. సింధియాలో బీజేపీ

తొలి నుంచి బీజేపీలో సింధియాలున్నారు. ఇటు సింధియాల్లోనూ బీజేపీ రక్తముందన్నది సత్యం. అంతేకాదు ఇటు దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్‌లోనూ, భారత రాజకీయాల్లో ప్రత్యర్థుల ఉనికిని ప్రశ్నార్థకంగా మారుస్తోన్న బీజేపీలోనూ సింధియా కుటుంబం జాడలున్నాయి. బీజేపీ తీర్థం పుచ్చుకోవడం నానమ్మ కలనిజం చేసేందుకేనా అన్న ప్రశ్న సర్వత్రా వినిపిస్తోంది.

ఎవరీ విజయ రాజే?

గ్వాలియర్ రాజమాతగా ప్రసిద్ధి చెందిన విజయరాజే సింధియా, మధ్యప్రదేశ్‌లోని గుణ లోక్‌సభ స్థానం నుంచి 1957లో గెలుపొందడంతో ఆమె రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. తర్వాత 1962, 1989, 1991, 1996, 1998లో విజయరాజే తన విజయ పరంపర కొనసాగించారు. 1967 నుంచి 1971 వరకు అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించిన విజయరాజే ఏనాడూ ఓటమిని ఎరుగరు. 1967 వరకు ఆమె కాంగ్రెస్‌లో ఉన్నారు. తర్వాత కాంగ్రెస్‌కి రాజీనామా చేసి, జనసంఘ్‌లో చేరారు. ఎమర్జెన్సీ కాలంలో కొన్ని రోజులు జైలుజీవితం గడిపారు. 1980లో బీజేపీ ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో బీజేపీ పాదుకొల్పుకోవడానికి విజయ కృషి చేశారు. 1971లో ఇందిరాగాంధీ సుడిగాలిని తట్టుకొని బిండ్ నుంచి విజయరాజే, గ్వాలియర్ నుంచి వాజ్‌పేయి, విజయరాజే కొడుకు మాధవరావు సింధియా గుణ స్థానం నుంచి గెలిచారు. మాధవరావు 26 ఏళ్ళకే ఎంపీ అయ్యారు. మాధవరావు సింధియాకి కాషాయ జెండాపై ఉన్న కాంక్ష ఎంతో కాలం నిలవలేదు. ఎమర్జెన్సీ అనంతరం 1980లో కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకొని గుణ స్థానం నుంచి ముచ్చటగా మూడోసారి గెలుపుగుర్రం ఎక్కారు. కాంగ్రెస్ హయాంలో కేంద్ర మంత్రిగా పని చేశారు. అనంతరం జ్యోతిరాదిత్య తండ్రి వారసత్వాన్ని కొనసాగించారు.

బీజేపీలో విజయరాజే వారసులు

అదే సమయంలో విజయరాజే కుమార్తెలు వసుంధర రాజే, యశోధర రాజేలు రాజకీయరంగ ప్రవేశం చేశారు. వసుంధర రాజే 1984లో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎంపికయ్యారు. రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో ధోల్‌పుర నుంచి ఎన్నికయ్యారు. వసుంధర కుమారుడు దుశ్యంత్ సైతం రాజస్తాన్‌లోని ఝుల్వార్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ ఎంపీగా ఎన్నికయ్యారు.



విజయ రాజే

మాధవరావు

యశోధరాగమనం

యశోధర మాత్రం 1977లో డాక్టర్ సిద్ధార్థ బన్సాలీని పెళ్ళి చేసుకొని అమెరికా వెళ్ళిపోయారు. ఆమె ముగ్గురు పిల్లల్లో ఒక్కరు కూడా రాజకీయాల్లోకి అడుగుపెట్టలేదు. 1994లో అమెరికా నుంచి తిరిగి వచ్చిన యశోధర 1998 ఎన్నికల్లో బీజేపీ లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేశారు. శివరాజ్ సింఘ్ చౌహాన్ ప్రభుత్వంలో మంత్రిగా కూడా పనిచేశారు.

కాంగ్రెస్‌లోనే కొనసాగిన జ్యోతిరాదిత్య

జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్‌లోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్నారు. జ్యోతిరాదిత్య తండ్రి మాధవరావు సింధియా 2001లో విమాన ప్రమాదంలో మరణించడంతో గుణ లోక్‌సభ స్థానం ఖాళీ అయ్యింది. 2002లో జరిగిన ఉప ఎన్నికల్లో పోటీచేసిన జ్యోతిరాదిత్య 4.5 లక్షల ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. ఆ తరువాత వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందారు. 2018లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ విజయంలో కీలకపాత్ర వహించిన జ్యోతిరాదిత్యకి ముఖ్యమంత్రి పదవి వచ్చినట్టే వచ్చి చేజారిపోయింది. అనుభవజ్ఞుడైన కారణంగా కమల్‌నాథ్‌కి దక్కింది. లోక్‌సభ సభ్యుడిగా 2019లో ఓటమి చవిచూడడంతో పార్టీ జ్యోతిరాదిత్యని పక్కన పెట్టేసింది.

ఎవరేమన్నారంటే..?

కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బెంగళూరుకు తరలించేందుకు బీజేపీ చార్టర్డ్ విమానాలను సిద్ధం చేసింది. కాంగ్రెస్‌కున్న బలమేంటో తెలియాలంటే కాస్త ఆగండి. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యాపమ్, ఈ-టెండరింగ్, మద్యం కుంభకోణాలను వెలికితీస్తోంది. వలపు వల కేసులో బీజేపీ వారు కూడా ఉన్నట్లు తేలింది.

-దిగ్విజయ్ సింగ్, కాంగ్రెస్ సీనియర్ నేత

దేశ ప్రజాస్వామ్య పద్ధతులను బీజేపీ నాశనం చేస్తున్న వేళ ఆపార్టీతోనే కలవడం.. వ్యక్తిగత రాజకీయ స్వార్థం కోసమే.

– రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్

కొన్నేళ్లుగా పార్టీ సింధియాను పెంచి పోషించగా ఇప్పుడు ఆయన విడిచి వెళ్లడం విచారకరం. ముఖ్యమైన పనుల కోసం పార్టీ అతన్ని నమ్మింది. పార్టీ మారడమే సమంజసమని ఇప్పుడు ఆయన భావిస్తున్నారు.

– అధిర్ రంజన్ చౌధరి, కాంగ్రెస్ ఎంపీ

జాతీయ క్షేమాన్ని ఉద్దేశించి సింధియా ఈ నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్‌ను వీడటాన్ని నేను స్వాగతిస్తున్నాను.

– యశోధరా రాజే, రాజస్తాన్ మాజీ సీఎం

ఇది ఈ విధంగా ముగియడం బాధగా ఉంది. మా తండ్రి తీసుకున్న నిర్ణయానికి నేను గర్వపడుతున్నాను. ఇలాంటి నిర్ణయం తీసుకోవడానికి ధైర్యం కావాలి. మా కుటుంబం అధికార దాహం కలిగింది కాదని చెప్పడానికి మా చరిత్రే సాక్ష్యంగా నిలుస్తుంది. ముందే చెప్పినట్లు మధ్యప్రదేశ్‌లో, దేశంలో గణనీయమైన మార్పు తీసుకొస్తాం.

– మహానార్యమన్, జ్యోతిరాదిత్య కొడుకు

స్పీకర్ నిర్ణయమే కీలకం

ప్రజాపతి

రాజకీయ సంక్షోభ సమయాన మధ్యప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ పాత్ర కీలకంగా మారనుంది. ప్రస్తుత స్పీకర్ ఎన్‌పీ ప్రజాపతిపైనే అందరి దృష్టీ కేంద్రీకృతమై ఉంది. చట్ట ప్రకారం శాసనసభ్యులు తమ రాజీనామా పత్రాలను సభాపతికి పంపించాల్సి ఉంటుంది. అయితే రాజీనామా పత్రాలు స్పీకర్‌కి సమర్పించినంత మాత్రాన సరిపోదు. వాటిని స్పీకర్ ఆమోదించినప్పుడే ఆ రాజీనామాలను అధికారికంగా గుర్తిస్తారు.

- రాజ్యాంగంలోని ఆర్టికల్ 190 ఒక శాసనసభ్యుడు ఎలా రాజీనామా చేయొచ్చు అనే విషయాన్ని చర్చిస్తుంది. ఎమ్మెల్యేలు తమ రాజీనామా పత్రాలను స్పీకర్‌ని ఉద్దేశించి రాయాల్సి ఉంటుంది. దాన్ని కేవలం స్పీకరే మాత్రమే ఆమోదించాల్సి ఉంటుంది. (గవర్నర్ కాదు).
- శాసనసభ్యులు సమర్పించిన రాజీనామాలు ఎవరి ఒత్తిడి వల్ల చేసినవి కావనీ, అవి వారి వారి ఇష్టపూర్వకంగా చేసినవేనని స్పీకర్ భావించాలి. స్పీకర్‌కి విశ్వాసం కలగకపోతే దానిపైన స్వతంత్రంగా విచారణ జరిపే అధికారాన్ని కూడా ఈ ఆర్టికల్ స్పీకర్‌కి ఇచ్చింది.
- ఒకవేళ రాజీనామా స్వతంత్రంగా చేసింది కాదనీ, ఎవరి ఒత్తిడితోనైనా చేసిన రాజీనామా అని స్పీకర్ నమ్మినట్టయితే రాజీనామాని ఆమోదించకుండా ఉండే అవకాశం కూడా సభాపతికి ఉంటుంది.
- శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించడం కూడా స్పీకర్‌పైనే ఆధారపడి ఉంటుంది. కర్ణాటకలో సైతం ఇలాంటి ఘటనే జరిగింది. ఎమ్మెల్యేల అనర్హత వేటుపై స్పీకర్ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు సమ్మతించింది.
- స్పీకర్ ఆమోదముద్ర వేయకుండానే ఎమ్మెల్యేలంతా బీజేపీలో చేరిపోతే వారు పార్టీ ఫిరాయింపు చట్ట పరిధిలోకి వస్తారు.

తర్వాత లక్ష్యం రాజస్తానేనా?

సచిన్ పైలట్

న్యూఢిల్లీ: నిన్న కర్ణాటక, ఇవాళ మధ్యప్రదేశ్.. మరి రేపు? బీజేపీ ఆపరేషన్ కమల్ జాబితాలో తర్వాత రాష్ట్రం రాజస్తానేనా.. ఇదీ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చ. ఎందుకంటే రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం స్వల్ప మెజార్టీతో నెట్టుకొస్తోంది. ఆ రాష్ట్రంలో కూడా ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్, ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ మధ్య వ్యవహారం ఉప్పు, నిప్పుగానే ఉంది. రాజస్తాన్‌లోని కోటాలో చిన్నారుల మృతి దగ్గర్నుంచి ఎన్నో అంశాల్లో సచిన్ పైలట్ బహిరంగంగానే తిరుగుబాటు జెండా ఎగురవేస్తున్నారు. ప్రముఖ వజ్రాల వ్యాపారి రాజీవ్ అరోరాను రాజ్యసభకు పంపాలన్న గహ్లోత్ ప్రతిపాదనను సచిన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మధ్యప్రదేశ్ తరహాలోనే సచిన్ పైలట్‌పై ఆపరేషన్ కమల్‌ను ప్రయోగిస్తే, ఆ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు తీవ్రమైన నష్టం జరుగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాజస్తాన్ అసెంబ్లీలో మొత్తం సభ్యుల బలం 200 కాగా కాంగ్రెస్‌కు 112 మంది సభ్యుల మద్దతు ఉంది. వీరిలో సీపీఎం నుంచి ముగ్గురు, ఆర్ఎల్‌డీ నుంచి ఇద్దరు ఉన్నారు. ఇక బీజేపీకి 80 మంది సభ్యులున్నారు. ఒక 20 మందిని తమ వైపుకి లాక్కుంటే రాజస్తాన్ కూడా బీజేపీ పరమవుతుంది.

ఇరాన్ నుంచి స్వదేశానికి

న్యూఢిల్లీ: ప్రాణాంతక కోవిడ్-19 బారిన పడిన వారి సంఖ్య భారత్‌లో 60కి చేరుకుంది. మూడేళ్ల చిన్నారితోపాటు సుమారు 44 మంది ఈ వ్యాధి బారిన పడినట్లు సోమవారం నిర్ధారణ కాగా.. తాజాగా కేరళలో మరో 8 కేసులు, కర్ణాటకలో 3, పుణేలో 5 కేసులు నమోదైనట్లు తెలియడంతో ఈ వ్యాధి బారిన పడ్డ వారి సంఖ్య 60కి చేరింది. వైరస్ నియంత్రణ చర్యల్లో భాగంగా మణిపూర్ మయన్మార్ సరిహద్దులను మూసివేశారు. వైర

సాక్షి
బుధవారం, మార్చి, 11

కాంగ్రెస్ స్వయంకృతం

కాంగ్రెస్‌కు సాక్షాత్తూ అధిష్టానమే సమస్యగా మారిన వేళ మధ్యప్రదేశ్‌లోని ఆ పార్టీ విభాగంలో ఉన్నట్టుండి ముసలం బయల్దేరి, అక్కడి రాష్ట్ర ప్రభుత్వం పుట్టి మునగడం ఎవరికీ ఆశ్చర్యం కలిగించదు. అక్కడేం జరుగుతోందో, ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో అర్థంకాని అయోమయంలో సారథులు కూరుకుపోయివుండగానే, కమల్‌నాథ్ కేబినెట్‌లోని ఆరుగురు మంత్రులతోసహా 17 మంది ఎమ్మెల్యేలు బెంగళూరుకు ఎగిరిపోయారు. ఈ సంఖ్య చూస్తుండగానే 21కి చేరింది. వారంతా శాసనసభ్యత్వానికి రాజీనామా చేస్తామంటున్నారు. ఈ డ్రామాకు కథానాయకుడైన జ్యోతిరాదిత్య సింధియా మంగళవారం కాంగ్రెస్‌కు చెల్లుచీటీ ఇచ్చి బీజేపీవైపు అడుగులేస్తున్నారు. ఆ పార్టీ టికెట్‌పై రాజ్యసభకు ఎన్నిక కావడం సింధియాకు ఇక రోజుల్లో పని. రాజీనామా సంగతి తెలిశాక, ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు ఒక ప్రకటన చేసి పరువు కాపాడుకునే ప్రయత్నం చేసింది కాంగ్రెస్ నాయకత్వం! ఏమైతేనేం 230మంది సభ్యులుండే అసెంబ్లీలో 114మంది ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ బలం 93కి పడిపోయింది. మరో 30మంది కాషాయ తీర్థం తీసుకోవడానికి సంసిద్ధులవుతున్నారని బీజేపీ నేతలు చెప్పే మాటల్లో నిజమెంతోగానీ... ఈ దశలో స్పీకర్‌ది కీలకపాత్ర. మధ్యప్రదేశ్ డ్రామా ఎన్నాళ్లు కొనసాగాలో ఆయన చర్యలే నిర్దేశిస్తాయి. ఆ తర్వాతే బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందా లేక అర్ధాంతరంగా ఎన్నికలొస్తాయా అన్నది తేలుతుంది.

ఇదంతా బీజేపీ కుట్రని ఎంపీ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్ ఆరోపిస్తున్నారు. కానీ ఈ పరిణామాలకు బీజేపీని నిందించి ప్రయోజనం లేదు. ఏమీ లేని గోవాలోనే పావులు కదిపి అధికారం చేజిక్కించుకోగలిగిన బీజేపీ... అధికారం అంచుల వరకూ వెళ్లి ఆగిపోయిన మధ్యప్రదేశ్‌లో మౌనంగా ఉంటుందనుకోవడం తెలివితక్కువతనం. గతవారం ఎనిమిదిమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అర్ధరాత్రి గురుగ్రామ్‌లోని హోటల్‌కు తరలించిన ఉదంతంలో ఎలా గోలా కాంగ్రెస్ పరువు కాపాడుకోగలిగింది. వారందరినీ వెనక్కు తీసుకు రాగలిగింది. ఈసారి మాత్రం పరిస్థితి చేయి దాటిపోయింది. మధ్యప్రదేశ్‌లో పార్టీ కమల్‌నాథ్, జ్యోతిరాదిత్య, దిగ్విజయ్ సింగ్ వర్గాలుగా చీలిపోయిందని, ఆ ఇద్దరూ ఏకమై జ్యోతిరాదిత్యను ఇరకాటంలోకి నెట్టారని పార్టీ సారథులకు తెలియందేమీ కాదు. కేబినెట్‌లో కీలక పదవులన్నీ కమల్‌నాథ్, దిగ్విజయ్ అనుచర ఎమ్మెల్యేలకే దక్కాయి. పర్యవసానంగా జ్యోతిరాదిత్యలో ఏర్పడ్డ అసంతృప్తిని పారదోలడానికి, ఆయన వర్గానికి కూడా తగిన అవకాశాలివ్వడానికి పార్టీ పెద్దలు ప్రయత్నించలేదు. పైపెచ్చు సోనియా, రాహుల్‌గాంధీలను కలిసి తన గోడు వెళ్లబోసుకుందామని సింధియా చేసిన ప్రయత్నం ఫలించలేదు. పార్టీలో తాను సంతృప్తిగా లేనని సింధియా కొద్దికాలంనుంచి పరోక్షంగా చెబుతూనేవున్నారు. కేంద్ర ప్రభుత్వం 370 అధికరణను రద్దు చేసి కశ్మీర్ పత్రిపత్తిని మార్చినప్పుడు పార్టీ వైఖరికి భిన్నంగా వ్యాఖ్యానించి ఆయన కలకలం సృష్టించారు. ఆ తర్వాత కూడా ఆయన పార్టీకి దూరంగానే వుంటున్నారు.

మధ్యప్రదేశ్‌లోనే కాదు... అధికారం ఉందా లేదా అన్న తేడా లేకుండా అన్ని రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ ఇలా అంతఃకలహాలతో సతమతమవుతోంది. వాస్తవానికిది కాంగ్రెస్ పార్టీలో పాతుకుపోయిన పాత తరం నేతలకూ, పార్టీ కోసం శ్రమిస్తూ అందులో తమ భవిష్యత్తును వెదుక్కుంటున్న యువతరానికీ మధ్య సాగుతున్న సంకుల సమరం. చుట్టూ చేరిన వందిమాగధుల బృందగానం తప్ప మరేమీ వినడానికి ఇచ్చగించని అధినేత్రి సోనియాగాంధీకి ఈ యువతరమంటే మొదటినుంచీ అనేకానేక శంకలు. సొంతంగా ఆలోచించేవారన్నా, స్వతంత్రంగా ఎదుగుతారనుకున్నా వారిని దూరం పెట్టడం ఆమె ఒక విధానంగా మార్చుకున్నారు. పార్టీలో యువతరానికి ప్రాధాన్యమిస్తానని, వారసత్వాన్ని పక్కనబెట్టి పనిచేయడం ఒక్కటే ప్రాతిపదికగా తీసుకుంటామని చెప్పిన రాహుల్ గాంధీ పార్టీలో తన మాట చెల్లుబాటు కాకపోవడం, అడుగడుగునా తల్లి జోక్యం పెరగడం చూశాక చాన్నాళ్లక్రితమే కాడి పారేశారు. అడపా దడపా మీడియానుద్దేశించి మాట్లాడటం తప్ప పార్టీలో జరిగే ఏ విషయాలు తనకు పట్టనట్టు ఆయన వ్యవహరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన వర్గంగా ముద్రపడి, కేవలం అందువల్లనే నిరాదరణకు గురవుతున్న నేతలకు వేరే ప్రత్యామ్నాయం ఏముంటుంది?

ఎన్నికలకు ముందు జ్యోతిరాదిత్యకు పార్టీ ప్రచార బాధ్యతలు అప్పగించి, ఫలితాల తర్వాత ఆయనకే పట్టం గడతామన్న అభిప్రాయం కలిగించిన కాంగ్రెస్...అటుపై ఆ యువ నాయకుడిని పక్కకు నెట్టి కమల్‌నాథ్‌ని పీఠం ఎక్కించింది. మధ్యప్రదేశ్‌నుంచి ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఎన్నికయ్యే అవకాశం వుండగా, ఖచ్చితంగా వస్తుందనుకున్న ఒక్క సీటుకూ దిగ్విజయ్‌సింగ్ కాచుక్కూర్చున్నారు. ఆయనకు అది దక్కకుండా చేయడానికి ప్రియాంకగాంధీ పోటీ చేయాలన్న డిమాండు ఈమధ్యే బయల్దేరింది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయిన జ్యోతిరాదిత్య ప్రస్తుత పరిస్థితుల్లో తనకు రాజ్యసభ అవకాశం రావడం అసాధ్యమని గ్రహించివుంటారు. ఈ పార్టీలో తనకు రాజకీయంగా భవిష్యత్తు లేదన్న నిర్ణయానికొచ్చివుంటారు. రాజస్థాన్‌లోనూ సచిన్ పైలెట్‌కు ఇలాంటి పరిస్థితే వుంది. అధికారం లేకుండా బతకలేనని జ్యోతిరాదిత్య నిరూపించారని, అలాంటి నేతలు ఎవరైనా పార్టీని వదిలిపోవచ్చని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ చేసిన వ్యాఖ్యానం ఎవరినుద్దేశించి చేసిందో సచిన్ పైలెట్ గ్రహించకపోరు. మధ్యప్రదేశ్ డ్రామా పూర్తయ్యాక రాజస్థాన్‌లో అది మొదలైనా ఆశ్చర్యం లేదు. కనీసం ఈ దశలోనైనా కాంగ్రెస్ అధినాయకత్వం మేల్కొనకపోతే, జనంలో పలుకుబడివున్న నేతలకు పార్టీ పగ్గాలు అప్పగించి దానికి జవసత్వాలు కలిగించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించకపోతే పార్టీ కనుమరుగు కావడం ఖాయం.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి బ.విదియ రా.7.16 వరకు తదుపరి తదియ, నక్షత్రం హస్త రా.10.50 వరకు తదుపరి చిత్త, వర్జ్యం ఉ.8.18 నుంచి 9.46 వరకు దుర్ముహూర్తం ప.11.45 నుంచి 12.31 వరకు అమృతఘడియలు... సా.5.13 నుంచి 6.44 వరకు.

సూర్యోదయం : 6.16
సూర్యాస్తమయం: 6.04
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

రాజ్యాంగబద్ధతే 'రిజర్వేషన్ల'కు రక్షణ

విశ్లేషణ

ఆర్. కృష్ణయ్య

దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక రాజకీయ విధానాలతో చరిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. కానీ రిజర్వేషన్ల గరిష్ట పరిమితిపై ప్రతిసారి న్యాయపరమైన అవరోధాలు ఎదురవుతున్నాయి. కోర్టులు అడ్డుకుంటున్నాయి. దీనికి శాశ్వత పరిష్కారం చూడవలసిన బాధ్యత అన్ని పార్టీలపై ఉంది. రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. తాజాగా టీడీపీ నేత పిటిషన్ కారణంగా రిజర్వేషన్లను హైకోర్టు మళ్లీ తగ్గించినప్పటికీ వైఎస్ జగన్ స్థానిక ఎన్నికల్లో తన పార్టీ పరంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పాటించాలని ఆదేశించారు. ఏపీలో ప్రతిపక్ష పార్టీ టీడీపీతోపాటు ఇతర పార్టీలైన, కాంగ్రెస్, బీజేపీ, జనసేన పార్టీలు కూడా బీసీలకు 34% రిజర్వేషన్లు పాటించి బీసీలపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికలలో ఎస్సీ/ఎస్టీ/బీసీల రిజర్వేషన్లు 50 శాతం మించరాదని తీర్పు చెప్పడంతో రిజర్వేషన్ల సమస్య మరోసారి చర్చకు వచ్చింది. ఎన్నికలలో లబ్ధి పొందాలనే ఆశతో తెలుగుదేశం–ఇతర ప్రతిపక్షాలు చూస్తున్నాయే తప్ప ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఆలోచించకుండా రాజకీయంగా ఎలా వాడుకుందామని కుట్రలు చేస్తున్నాయి. కానీ ఈ తీర్పు కొత్తదేమీ కాదు. 1993 మండల్ కేసు – ఇందిరా సహానీ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసు నుంచి కూడా ఇప్పటివరకు దాదాపు 26 కేసులలో ఇదే తీర్పులు వచ్చాయి. సుప్రీం కోర్టు 2010లో కృష్ణమూర్తి వర్సెస్ కర్ణాటక స్టేట్ కేసులో ఇచ్చిన తీర్పు తర్వాత 2010 నుంచి దాదాపు అన్ని రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్లు 50 శాతంకు తగ్గించాయి. తెలంగాణ ప్రభుత్వం 2019 ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతంకు తగ్గించి ఎన్నికలు జరిపింది. కానీ ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ, ఇతర రాష్ట్రాలు తగ్గించినప్పటికీ ఈ వర్గాలకు రిజర్వేషన్లు తగ్గరాదనే ఆలోచనతో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేశారు. దీనికనుగుణంగా 2019 డిసెంబర్ 28న జీవో నం.176 జారీ చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ ప్రతాప్ రెడ్డి అనే టీడీపీ నేత సుప్రీంకోర్టులో కేసు వేశారు. సుప్రీంకోర్టు సలహా మేరకు దీన్ని విచారించిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సీ/ఎస్టీ/బీసీ రిజర్వేషన్లను 50 శాతంకు కుదించాలని తీర్పు చెప్పింది.

టీడీపీ నాయకుడు ప్రతాప్ రెడ్డి సవాల్ చేయకుండా ఆ పార్టీ అధినేత చంద్రబాబు అరికట్టగలిగి ఉంటే ఈ పాటికి ఏపీలో 34% రిజర్వేషన్‌లతో ఎన్నికలు జరిగేవి. కానీ చంద్రబాబు అలా చేయకుండా ఈరోజు వైఎస్ జగన్‌పై దుష్ప్రచారం చేయడాన్ని బీసీలు అసహ్యించుకుంటున్నారు. కాగా, ఈ అంశంపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేయాలని చంద్రబాబు చేస్తున్న వాదనలో పసలేదు, ఉపయోగం లేదు. ఇంతకు పూర్వం గత ప్రభుత్వాలు చాలాసార్లు స్పెషల్ లీవ్ పిటిషన్ వేశాయి. కానీ ప్రతి కేసులో కూడా సుప్రీంకోర్టు 50 శాతంకి మించి రిజర్వేషన్లు ఉండరాదని తీర్పు చెప్పింది. అలాంటప్పుడు మరలా సుప్రీం కోర్టుకు వెళితే ఈ తీర్పు పునరావృతం అవుతుంది. కాలయాపన తప్ప బీసీలకు ఒరిగేదేమీ ఉండదు.

సామాజిక న్యాయం పట్టదా?

సుప్రీంకోర్టు, హైకోర్టులు మొదటినుంచి ఎస్సీ/ఎస్టీ/బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పులు ఇస్తున్నాయి. ఇలా కోర్టులు తీర్పులు ప్రకటించిన ప్రతిసారీ రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టి ఎస్సీ/ఎస్టీ/బీసీ రిజర్వేషన్లకు రక్షణ కల్పిస్తూ వస్తున్నారు. మొట్టమొదట రాజ్యాంగం అమలులోకి వచ్చిన వెంటనే 1951లో తమిళనాడుకు చెందిన చంపకం దొరై రిజర్వేషన్ల కేసులో సుప్రీంకోర్టు ఈ వర్గాలకు వ్యతిరేకంగా తీర్పు చెప్పింది. దీంతో 1951లో మొదటి రాజ్యాంగ సవరణ ప్రారంభమయింది. ఆ తర్వాత పలు రాష్ట్రాల్లో సాగిన సామాజిక న్యాయం కేసుల విషయంలో సుప్రీంకోర్టు సరైన విధంగా స్పందించడం లేదని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వంపై ఒక కఠినమైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

2010 సుప్రీంకోర్టు తీర్పు రాగానే దేశంలోని స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు అమలులో ఉన్న 25 రాష్ట్రాలలో 24 రాష్ట్రాలలో వెంటనే బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి తగ్గించారు. బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్న కర్ణాటక, బిహార్, యూపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ 2013–2014 మధ్యలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 18–22 శాతం వరకు తగ్గించారు తప్ప బీసీ రిజర్వేషన్లను యథాతథంగా కొనసాగించడానికి ఎలాంటి చట్టాలను తయారు చేయలేదు. కానీ వైఎస్ జగన్ తనకున్న అధికారాలను వినియోగించుకొని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికి బీసీ రిజర్వేషన్లను యథాతథంగా అమలు చేయడానికి మరోసారి జీవో నం.176ను జారీ చేశారు. కానీ టీడీపీ నేత చర్య కారణంగా అంతిమంగా ఏపీ హైకోర్టు కూడా ఈ జీవోకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది.

రాజ్యాంగంలో ఏముంది...?

కేంద్ర ప్రభుత్వం 73–74వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయత్ రాజ్ మున్సిపల్ చట్టం తెచ్చింది. ఈ రాజ్యాంగ సవరణలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(D–6), 243 (T–6) ఆర్టికల్స్ పొందుపరిచి బీసీలకు కూడా జనాభా ప్రకారం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు పెట్టాలని, అందుకోసం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో చట్టాలు చేయాలని ఆదేశించింది. బీసీలకు ఎంత శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఖరారు చేసే అధికారం రాష్ట్ర శాసనసభకు ఇచ్చారు. దీని ప్రకారం 1993లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ బీసీలకు 34 శాతం ఖరారు చేసింది. ఈ శాతమే ఇంతవరకు అమలు చేస్తూ వచ్చారు. 1980 నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగిన పలు ఉద్యమాల ప్రభావంతో 1992లో వచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు ఆధారంగా నాటి సీఎం విజయభాస్కర్ రెడ్డి మున్సిపల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 34 శాతానికి పెంచారు. కొత్తగా గ్రామ పంచాయతీలకు 34% రిజర్వేషన్‌లు పెట్టారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లను నిర్ణయించే అధికారం రాష్ట్ర శాసనసభలకు వదిలిపెట్టడం తప్పితే స్పష్టంగా రాజ్యాంగంలోనే జనాభా ప్రకారం పెట్టాలని పేర్కొనక పోవడంతో ప్రతిసారి న్యాయపరమైన సమస్యలు ఎదురవుతున్నాయి.

దేశంలో ఇంతవరకు ఏ సీఎం కూడా చేయని విధంగా వైఎస్ జగన్ బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక రాజకీయ విధానాలతో చరిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. బీసీలు, దళితులు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాలలో కూడా ఇలాంటి విధాన నిర్ణయాలు తీసుకోవడం లేదు. జగనన్న వసతి దీవెన–విద్యా దీవెన– అమ్మ ఒడి పథకాలు ఎస్సీ/ఎస్టీ/బీసీలలో చదువుల విప్లవం తీసుకొస్తాయి. దీర్ఘకాలంలో ఈ పథకాల వలన ఎస్సీ/ఎస్టీ/బీసీల మౌలిక జీవన విధానంలో విప్లవాత్మకమైన మార్పు వస్తుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎస్సీ/ఎస్టీ/బీసీల సమగ్ర అభివృద్ధికి, సాధికారతకు అనేక స్కీములు పెట్టారు. ముఖ్యంగా నామినేటెడ్ పదవులలో 50 శాతం కోటా కల్పిస్తూ అసెంబ్లీలో చట్టం చేశారు. అలాగే కాంట్రాక్ట్ వర్క్‌లలో 50 శాతం కోటా, పారిశ్రామిక పాలసీలో 50 శాతం కోటా కల్పించి, ఎస్సీ/ఎస్టీ/బీసీల ఆర్థిక అభివృద్ధికి బాటలు వేశారు. ఇదొక గొప్ప మలుపు. అలాగే గత ఏడాది మార్చి నెలలో వైఎస్ జగన్ ఆదేశాల మేరకు వైఎస్సార్ – పార్టీ చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని, పార్లమెంట్‌లో బిల్లు పెట్టడం చరిత్రలో నిలిచిపోతుంది. దేశంలోని 70 కోట్ల మంది బీసీలు ఇప్పుడు వైఎస్ జగన్ అభిమానులుగా మారిపోయారు.

పరిష్కారం ఏమిటి?

రిజర్వేషన్ల గరిష్ట పరిమితిపై ప్రతిసారి న్యాయపరమైన అవరోధాలు ఎదురవుతున్నాయి. కోర్టులు అడ్డుకుంటున్నాయి. దీనికి శాశ్వత పరిష్కారం చూడవలసిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉంది. దీంట్లో భాగంగా రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. తమిళనాడు ప్రభుత్వం గతంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 69 శాతం రిజర్వేషన్లు అమలు చేసే విధంగా రాజ్యాంగాన్ని సవరించి రాజ్యాంగంలో 9వ షెడ్యూల్ రిజర్వేషన్లను పెట్టింది. అదే విధంగా ఇప్పుడు అన్ని పార్టీలు చొరవ తీసుకుని రాజ్యాంగ సవరణ చేయాలి. అలాగే రాజ్యాంగ సవరణ ప్రక్రియకు సమయం తీసుకుంటుంది కాబట్టి తాత్కాలిక పరిష్కారంగా అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయంతో బీసీల జనాభా ప్రకారం జనరల్ సీట్లలో బీసీలకు సీట్లు ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకోవాలి. గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ ప్రతిపాదనను అన్ని రాజకీయ పార్టీల ముందు పెట్టారు. మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ఇతర ప్రతిపక్షాలు బీసీల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఆచరణలో ఈ ప్రతిపాదనను అంగీకరించాలి. జనరల్ సీట్లలో బీసీలకు కేటాయించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. హైకోర్టు రిజర్వేషన్లు తగ్గించినప్పటికీ ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీ పరంగా 34 శాతం రిజర్వేషన్లు పాటించాలని ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ఏపీలోని ప్రతిపక్ష పార్టీ టీడీపీతోపాటు ఇతర పార్టీలైన, కాంగ్రెస్, బీజేపీ, జనసేన పార్టీలు కూడా 34% రిజర్వేషన్లు పాటించి బీసీలపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

వ్యాసకర్త అధ్యక్షులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం
మొబైల్ : 90000 09164

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మతోన్మాదులు

"ఓరిదేవుడా... జ్యోతిరాదిత్య సింధియా సహా కాంగ్రెస్ పార్టీలోని 19 మంది రాజకీయ నాయకులు హిందూ మతోన్మాదులేనా? ముఖాలు చూస్తుంటే ఏడుపొకటే తక్కువ. అరే భాయ్, దేశంలోనే పురాతనమైన ఆ పార్టీలో ఇంకా ఎంతమంది హిందూ నాజీలున్నారో? చేతులు ముడుచుకుని, ఆలోచిస్తున్నట్టు రోజూ ఏం షాక్ అవుతారుగానీ, ఒక్కసారి లెక్కతేల్చేయండి. మధ్యేవాదులను, ఉదారవాదులను పార్టీ నుంచి బహిష్కరించి కమ్యూనిస్ట్ పార్టీలో కాంగ్రెస్ కలిసిపోవాల్సిన సమయం వచ్చింది. భారత రాజకీయాల్లో సైద్ధాంతిక విధానాలు మరింత రాటుదేలాయి. కాంగ్రెస్ ఆ పరిస్థితిని స్వాగతించి, స్వీకరిస్తే మంచిది"

– ఆర్తి టికూ సింగ్, జర్నలిస్ట్

హోలీ

"హ్యాపీ హోలీ. అందరూ క్షేమంగా పండుగ జరుపుకోండి. కరోనా బారిన పడినవారికోసం, వారి కుటుంబాల కోసం ప్రార్థించండి. సంబరాలు జరుపుకునే సందర్భంలో కూడా వాటిని జరుపుకోలేని స్థితిలో ఉన్నవారి గురించి నేను ఆలోచిస్తూ ఉంటా. మనందరినీ దేవుడు చల్లగా చూడాలని కోరుకుందాం"

– షెహ్లా రషీద్, జర్నలిస్ట్

భ్రమలు

"నన్ను పరివార్ సభ్యురాలని, మూర్ఖురాలని పిలవాలనుకుంటే అలాగే పిలవండి. కానీ, నేనొక విషయం మీకు స్పష్టంగా చెప్పదలుచుకున్నా. పుల్వామా దాడిపై స్పందన, బాలాకోట్ వైమానిక దాడులు, 370 అధికరణ రద్దు, అయోధ్య వ్యవహారాలు వగైరాలపై స్పందించిన తీరు చూసిన తరువాత నాకు కాంగ్రెస్ పార్టీపై భ్రమలు తొలగిపోయాయి"

– సధావి ఖోస్లా, రచయిత్రి

మాఫియా

"జ్యోతిరాదిత్య సింధియా తండ్రి మాధవరావు సింధియా విమాన ప్రమాదంలో అనుమానాస్పదంగా మరణించారు. ఆయన మరణంతో ఎవరు లబ్ధి పొందారో మనకు తెలుసు. ఆయన బతికి వుంటే ఏదో ఒక రోజు ప్రధాని అయ్యేవారు. ఇవాళ ఆయన కొడుకు కాంగ్రెస్‌ను వీడాడు. ఆయన ప్రాణానికి కూడా ప్రమాదం పొంచి ఉండొచ్చు. ఇటాలియన్ మాఫియాను నమ్మలేం"

– మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

చరిత్ర

"నా తండ్రి జ్యోతిరాదిత్య తనకు తానుగా తీసుకున్న నిర్ణయానికి నేను గర్వపడుతున్నా. వారసత్వం నుంచి తప్పుకోవాలంటే చాలా ధైర్యం కావాలి. మా కుటుంబం ఎప్పుడూ అధికారం కోసం అర్రులు సాచలేదన్న సంగతి చరిత్ర తెలిసినవారికెవరికైనా అర్థమవుతుంది. మన భవిష్యత్‌తో ముడిపడి వున్న మన దేశంలోనూ, మధ్యప్రదేశ్‌లోనూ కీలకమైన మార్పులు తీసుకొచ్చి, హామీని నిలబెట్టుకుంటాం"

– ఎం. సింధియా, కుమారుడు

స్టార్టప్

"జ్యోతిరాదిత్య సింధియా రాజీనామా చేసిన తరువాత ఆయనను పార్టీ నుంచి బహిష్కరించామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడం ఎలా ఉందంటే, అప్పటికే కాలేజీ వదిలిపెట్టేసి, సొంత స్టార్టప్ మొదలుపెట్టిన విద్యార్థికి ఇంజనీరింగ్ కాలేజీ వారు డిగ్రీ ఇచ్చేది లేదని చెప్పినట్టు ఉంది"

– దీపికా నారాయణ్ భరద్వాజ, జర్నలిస్ట్

ఇన్‌బాక్స్

ప్రకృతిపై గొడ్డలి వేటు

సుందరమైన విశాఖలో జీవీఎంసీ పరిధిలో ఏళ్ల వయసున్న పచ్చని వృక్ష సంపద నేలకొరుగుతోంది. రెండు శాఖల మధ్య సమన్వయ లోపంతో ఈ వ్యవహారం బయటపడింది. విద్యుత్ విభాగంలో ఈపీడీసీఎల్‌కు, జీవీఎంసీ విభాగంలోని హార్టికల్చర్ విభాగంతో సమన్వయంలేక నిత్యం వేలల్లో వృక్షాలు నేలకొరుగుతున్నాయని, కోట్లాది రూపాయలు వృథా కావడమే కాదు, ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి తీరని నష్టం జరుగుతోందని ప్రజలు వాపోతున్నారు. ఇలాంటి నష్టాలు ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, ఇతర రాష్ట్రాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది..

దశాబ్దాలుగా నీడనిస్తున్న చెట్లను నరకవద్దని స్థానికులు, ప్రకృతి ప్రేమికులు, మేధావులు వారిస్తున్నా ఒక విధానం, ప్రణాళిక లేకుండా విద్యుత్, టెలికం, ఆర్ అండ్‌బీ సిబ్బంది చెట్లను అడ్డగోలుగా నరికేస్తున్నారు. కొమ్మలు తీగలను తాకితే ప్రమాదాలు సంభవిస్తాయని, విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందనే నెపంతో ఏటా మూడు, నాలుగు సార్లు అధికారులు కాంట్రాక్టర్ల సహాయంతో నరికేస్తున్నారు. వాస్తవంగా కరెంటుతీగలకు 6 నుంచి 10 అడుగుల దిగువ వరకు కొమ్మలను నరకాలి. కానీ నేల నుంచి 3–5 అడుగుల వరకు ఉంచి.. మిగిలిన కొమ్మలన్నింటినీ నరికేస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు ఎంతో కృషి చేస్తుండగా.. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూడకుండా, ప్రజాధనాన్ని కాంట్రాక్టర్లకు చెల్లించి ప్రజారోగ్యాన్ని నాశనం చేయడం ఎంతవరకు సబబని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వైర్లకు చెట్లు తాకే ప్రాంతంలో రబ్బరు ట్యూబులను ఇన్సులేషన్‌గా వాడితే సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు. కాంట్రాక్టర్లకు వెచ్చించే డబ్బుల కంటే.. దీనికి అయ్యే ఖర్చు తక్కువగా ఉంటుందని చెబుతున్నా, అధికారులు పరిశీలించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

యాతం వీరాస్వామి,
విశాఖపట్నం | 95816 76918

ఇళ్లలోనే ఇటాలియన్లు

సాధారణంగా దక్షిణాది ఇటాలియన్లు పనులను వెతుక్కుంటూ ఉత్తర ఇటలీకి వెళ్తుంటారు. అందుకే సంప్రదాయంగా దక్షిణాదీయుల మీద ఉత్తరాదివారికి కొంచెం చిన్నచూపు ఉండటం కద్దు. కానీ కరోనా వైరస్ ముందుగా ఇటలీ ఉత్తర ప్రాంతంలో వ్యాపించింది. దీంతో దక్షిణాదివారు ఉత్తర ప్రాంతాలను అంటరానివిగా పరిగణించడం విషాద సందర్భపు ఒక విచిత్రం. దీనికితోడు ఉత్తరాదివారు సురక్షితం అనుకుంటున్న దక్షిణాదివైపు తరలివెళ్తుండటం వైరస్ వ్యాప్తిని నియంత్రించడంలో ఇటలీ ప్రభుత్వానికి ఎదురవుతున్న ఇబ్బందుల్లో ఒకటి.

ఇప్పటివరకు ఇటలీలో 9,000 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనాయి. 463 మంది ప్రాణాలు కోల్పోయారు. దేశ ప్రధాని జూసెపే కాంటి దీన్ని ఒక చీకటి కాలంగా అభివర్ణించారు. అయితే, వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ తీసుకుంటోంది. మొదట్లో రెండు చిన

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 11-3-2020

జల కల్పన

ఆమె ఓ ఆర్కిటెక్ట్. లక్షల రూపాయలు ఆర్జించే అవకాశం ఉన్న తన కెరీర్‌కే పరిమితమై పోకుండా భావితరాలకు విలువైన నీటి బొట్టును ఒడిసిపట్టి అందించేందుకు జలయజ్ఞానికి శ్రీకారం చుట్టారు. తరిగిపోతున్న జల సంపదను పది కాలాల పాటు నిల్వ చేసేందుకు వినూత్న డిజైన్లు రూపొందించి దేశ ప్రధాని నరేంద్ర మోడీ మన్ననలు పొందారు. ప్రధాని సోషల్ మీడియా అకౌంట్ల నిర్వహణకు అర్హత సాధించిన ఏడుగురిలో ఒకరిగా దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు. ఆమే కల్పనా రమేశ్.

కల్పనా రమేశ్ : జల సంరక్షణపై ప్రసంగం

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నివాసం ఉంటున్నారు కల్పనా రమేష్. సాహె (సొసైటీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ ఎండీవర్) సంస్థను స్థాపించి దశాబ్దకాలంగా వర్షపునీటి సంరక్షణకు విశేషంగా కృషి చేస్తున్నారు. ఆ వివరాలను సాక్షితో పంచుకున్నారు.

ప్రధాని దృష్టి

నేను రూపొందించిన వర్షపు నీటి సంరక్షణ డిజైన్లు, చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై సోషల్ మీడియా వేదికగా కొన్ని గ్రూపులకు చెందినవారు దేశవ్యాప్తంగా ఆయా గ్రూపుల్లో పోస్ట్ చేయడంతోపాటు ప్రధానమంత్రి నరేంద్రమోడీని ట్యాగ్‌చేశారు. దీంతో ప్రధానమంత్రి కార్యాలయ 'మై గౌ' సైట్ సీఈఓ మార్చి 6న నాకు ఫోన్‌చేసి పీఎం సోషల్ మీడియా అకౌంట్ల నిర్వహణకు మీరు అర్హత సాధించారని చెప్పడంతో సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాను. ఈ గుర్తింపు నా బాధ్యతను మరింత పెంచింది. నేరుగా ప్రధాని నరేంద్ర మోడీకి సంబంధించిన ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సైట్లలో నేను సమాచారాన్ని పొందుపరిచే అవకాశం ఉండదు. మైగౌ సైట్ సీఈఓకు సమాచారం చేరవేస్తే వారు నేను అందించే సమాచారాన్ని పరిశీలించి నా తరపున ఆయా సైట్లలో నేను కోరిన సమాచారాన్ని పోస్ట్‌చేస్తారు. ఈ విధానంలో నా ఆలోచనలు, డిజైన్లు కోట్లాదిమందికి చేరతాయని సంతోషంగా ఉంది.

విస్తృత అవగాహన

గత మూడేళ్లుగా వర్షపునీటి సంరక్షణపై 150కి పైగా అవగాహన కార్యక్రమాలు, 50 ప్రత్యేక చర్చాగోష్ఠులు నిర్వహించాం. తాజాగా హైదరాబాద్‌లోని సిల్వర్‌ఓక్ విద్యాసంస్థలో 6-8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వాననీటి సంరక్షణపై రెండునెలలు క్లాస్‌రూమ్‌లో, మరో రెండు నెలలు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాం. వాళ్లు వెళ్లి ఇళ్లు, కాలనీల్లోనూ అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవలే మజీద్ బండ (కొండాపూర్) ప్రాంతంలో కొడికుంట చెరువును మా సాహె సంస్థ దత్తతకు తీసుకుంది. ఈ చెరువులోకి వర్షపునీరు చేరే ఇన్‌ఫ్లో ఛానల్స్‌ను ప్రక్షాళన చేస్తోంది. ఈ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. ఇళ్లు, కార్యాలయాల విస్తీర్ణం, నిర్మాణ డిజైన్లను బట్టి వాననీటి సంరక్షణ పిట్స్‌ను మేము డిజైన్ చేస్తున్నాం. నా స్వస్థలం బెంగళూరు. ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ చేశాను. విద్యాభ్యాసం అక్కడే సాగింది. కానీ గత 20 ఏళ్లుగా హైదరాబాద్ నగరంలో ఉంటున్నాం. ఇప్పుడు ఇదే నా ఓన్‌సిటీ. ఇక్కడే వర్షపునీటి సంరక్షణపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాను. నా భర్త రమేష్ లోకనాథన్‌ది సాఫ్ట్‌వేర్ రంగం. ఆయన సహాయ సహకారాలు కూడా నాకెంతగానో ఉన్నాయి.

భవిష్యత్ లక్ష్యం

'చినుకు.. చినుకు ఒడిసిపట్టు.. భావితరాలకు దాచిపెట్టు' అన్న నినాదంతో వర్షపునీటిని ఒడిసిపట్టే కృషిలో నిర్విరామంగా పనిచేస్తున్నాను. భవిష్యత్‌లో నా సేవలు, డిజైన్లు ప్రధాని సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా కోట్లాదిమందికి చేరనున్నాయి. ఈ జలయజ్ఞంలో ప్రతీ భారతీయుడు భాగస్వామి కావాలన్నదే నా లక్ష్యం.. నా స్వప్నం. కాంక్రీట్ మహారణ్యంలా మారిన నగరాల్లో వర్షపు నీటిలో 80 శాతం వృథా అవుతోంది. ఇందులో 50 శాతం ఒడిసిపట్టినా నీటి కరువు ఉండదన్నదే నా నిశ్చిభిప్రాయం''అని ముగించారు కల్పన.

– ఏసిరెడ్డి రంగారెడ్డి,
సాక్షి, హైదరాబాద్

నీటి బ్యాంకు!

ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో తక్కువ ఖర్చుతో వర్షపునీటిని సంరక్షించుకోవచ్చు. ఇంటి పైకప్పుపై కురిసిన వర్షపునీటిని నేరుగా కింద ఉన్న నీటి సంపులో నింపుకోవాలి. ఇలా ఇంటి విస్తీర్ణాన్ని బట్టి 30 వేల నుంచి లక్ష లీటర్ల వరకు నిల్వచేయవచ్చు. ఇది నిండిన తరవాత ఓవర్‌ఫ్లో అయ్యే నీటిని ఎండిన బోరుబావిలోకి మళ్లిస్తే మీకు ఏడాదికి సరిపడా జలబ్యాంక్ అందుబాటులో ఉంటుంది. ట్యాంకర్ కష్టాలు లేకుండా చూసుకోవచ్చు. ఏడాదికి సుమారు 35-45 రోజుల పాటు వర్షం తప్పక కురుస్తుంది. ఇందుకోసం ఒకసారి రూ.15-రూ.25 వేల వరకు ఖర్చు చేస్తే సరిపోతుంది. ఉదా.. వెయ్యి చదరపు అడుగుల భవనం రూఫ్‌టాప్‌పై పడిన వర్షపు నీటిని ఒడిసిపడితే 70 వేల లీటర్ల జలబ్యాంక్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ నీరు ఐదుగురు సభ్యులున్న కుటుంబానికి వందరోజుల పాటు సరిపోతాయి. ఇక 2000 చదరపు అడుగుల భవనానికి 1.40 లక్షల లీటర్లు, 3000 చదరపు అడుగుల భవనంపై కురిసిన నీటి ద్వారా 2.10 లక్షల లీటర్లు, 4000 చదరపు అడుగుల భవనానికి 2.80 లక్షల లీటర్ల జలబ్యాంక్ ఏర్పాటు చేసుకోవచ్చు.

- కల్పన

వర్షపు నీటి నిల్వపై క్షేత్రస్థాయిలో పిల్లలకు అవగాహన

గెలుపు

ఏ సీమల ఏమైతివో

గెలవలేక పోయినప్పుడు భూమి మీద మనమొక్కరిమే ఏకాకిలా మిగిలి పోయినట్లు అనిపిస్తుంది.. సృష్టి ప్రారంభపు ఏకకణ జీవిలా! చేజారిన గెలుపుతో పాటే అన్నీ మనల్ని వదిలేసి పోయినట్లూ ఉంటుంది. చూసుకోంగానీ, ఒకరు మాత్రం ఆ క్షణంలో మన చెయ్యి పట్టుకునే ఉంటారు. ఓటమి! మరి ఒంటరివాళ్లం ఎలా అవుతాం?

● మాధవ్ శింగరాజు

ఎగరేస్తున్న గాలిపటం తెగిపోతే హటాత్తుగా ఏకాకులై పోతారు చిన్నపిల్లలు. ఇంట్లో వదిలేసి అమ్మ ఊరెళ్లిపోయినా కూడా.. 'ఏ సీమల ఏమైతివో.. ఏకాకినీ నా ప్రియా..' అని కృష్ణశాస్త్రిలా విలపిస్తారు. ఆయన్ది కవిత్వం. వీళ్లవి కన్నీళ్లు. అంతే తేడా. ఫైనల్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయాక చిన్నమ్మాయ్ షఫాలీ వర్మ దుఃఖానికి అంతేలేకుండా పోయింది. చిన్నమ్మాయే. ప్రపంచ కప్ ఫైనల్స్‌లో ఆడిన అతి చిన్నవయసు అమ్మాయి. పుట్టిన పదహారేళ్ల నలభై రోజులకే పోటీలోకి వచ్చేసింది.

'షఫాలీని కన్నీళ్లతో చూడలేకపోతున్నా' అన్నాడు బ్రెట్ లీ. తనకొస్తున్న కన్నీళ్లతో షఫాలీని చూడలేకపోయాడా, కన్నీళ్లతో ఉన్న షఫాలీని చూడలేకపోయాడా! షఫాలీ తనొక్కటే ఏడ్వడం కాదు. క్రీడాదిగ్గజాలకు, ఉద్ధండులకూ ఏడుపులాంటి ఫీలింగ్‌ని తెప్పించింది. ఒకప్పటి ఆస్ట్రేలియన్ ఫాస్ట్ బౌలర్ బ్రెట్ లీ. క్యాచ్ మిస్ అయితే ఎలా ఉంటుందో అతడికి తెలియని బాధ కాదు. క్యాచ్ మిస్ అయిందన్నది టీమ్ పడే బాధ అయితే.. 'క్యాచ్‌ని మిస్ చేశానే' అన్నది ఆ క్యాచ్ పట్టలేక పోయిన వారి బాధ. ఫైనల్స్‌లో కీలకమైన

> 'షఫాలీని కన్నీళ్లతో చూడలేకపోతున్నా' అన్నాడు బ్రెట్ లీ. తనకొస్తున్న కన్నీళ్లతో షఫాలీని చూడలేక పోయాడా, కన్నీళ్లతో ఉన్న షెఫాలీని చూడలేక పోయాడా! షెఫాలీ తనొక్కటే ఏడ్వడం కాదు. క్రీడా దిగ్గజాలకు, ఉద్ధండులకూ ఏడుపులాంటి ఫీలింగ్‌ని తెప్పించింది.

షఫాలీ వర్మ | టి 20
వరల్డ్ కప్ ఫైనల్స్‌లో అవుట్ అయిన క్షణాలు

అలీసా హీలీ క్యాచ్‌ని మిస్ చేసింది షఫాలీ. అప్పట్నుంచే ఏకాకి అయిపోయింది. తను జారవిడిచింది క్యాచ్‌ని కాదు, కప్పుని.

ఆటకు కనికరం ఉండదు. బ్రెట్‌లీలా 'ఓ మై షఫాలీ' అని సానుభూతి పడదు. కన్నీళ్లు పెట్టుకుంటే వెంటనే పెద్ద వర్షాన్ని కురిపించి, ఆ వర్షం నీళ్లలో కన్నీళ్లను కనబడనీయకుండా చేయదు. తన పనిలో తను ఉంటుంది. వెంటనే గెలిచినవాళ్ల దగ్గరకు వెళ్లిపోయి మెరుస్తున్న కప్పులో తన ముఖం చూసుకుని జుట్టు సవరించుకుంటుంది.. తన జట్టేదో గెలిచినట్లు, తనే గెలిపించినట్లు! అలాంటిది.. ఓడిపోయిన జట్టులోని షఫాలీ కన్నీళ్లను ఎందుకు పట్టించుకుంటుంది? 'చిన్న పిల్లవు కదా, నెక్స్ట్ టైమ్ బెటర్ లక్' అంటూ ముంగురుల్ని వేళ్లతో అలా అలా అనేసి ఎందుకు వెళుతుంది?

ఆశలు పెట్టుకుంది షఫాలీ.. అందుకొచ్చిన ఏడుపు అది. 'ఆశలు రాలి ధూళిపడినప్పుడు.. గుండెలు చీల్చు వేదనావేశము బ్రేల్చినప్పుడు.. వివేకము గోల్పడి సల్పినట్టి ఆక్రోశపు రక్త బిందువులతో..' మేఘసందేశాన్ని రచియించాడు కృష్ణశాస్త్రి. ఈ అమ్మాయి కళ్లు మేఘాలై, ఓటమి వేదనను వర్షించాయి. అనుకుంటాం.. మన ఒంట్లో ఊపిరనేది ఒకటి ఉంటుందని, అందుకని జీవించి ఉంటాం అని. ఊపిరి కాదు ఉండేది. ఆశ. ఆశే ఊపిరికైనా ఆయువు. ఫైనల్స్‌లో తొలి ఓవర్‌లోనే రెండు పరుగులకే షఫాలీ ఔట్ అయింది! ఆయువు అవిరై కళ్లల్లోకి ఉబికి వచ్చేసింది. పిచ్, టీమ్, మెల్‌బోర్న్ మైదానం.. ఏవీ కనిపించడం లేదు. అంతా అలికేసినట్లున్న ఒకటే బ్లర్ పిక్చర్. ఓటమి! షఫాలీ మీద హోప్స్ పెట్టుకుంది భారత జట్టు. షఫాలీ ఉందని హోప్స్ వదులుకుంది ఆస్ట్రేలియా జట్టు. కప్పు కోసం పోటీ పడుతున్న రెండు జట్లకూ షెఫాలీ ముఖ్యం.

షఫాలీని నిలబెట్టుకోవడం కోసం టీమ్ ఇండియా, షఫాలీని పడగొట్టడం కోసం టీమ్ ఆస్ట్రేలియా. గెలిస్తే ప్రపంచ కప్పులో భారత మహిళల తొలి విజయం. భారత్‌ను ఓడిస్తే ప్రపంచ కప్పులో ఆస్ట్రేలియాకు ఐదవ విజయం. అసలు ఫైనల్స్‌కు ముందే ఆస్ట్రేలియా జట్టుకు టార్గెట్ అయింది షెఫాలీ. 'ఐ జస్ట్ హేట్ ప్లేయింగ్ ఇండియా.. దే హ్యావ్ గాట్ ద ఉడ్ ఓవర్ మి' అని అంది మెగాన్ షూట్. ఆస్ట్రేలియా జట్టులో ఫాస్ట్ బౌలర్ తను. 'గాడ్ ద ఉడ్' అనే మాట పూర్తిగా ఆస్ట్రేలియా వాళ్లది. 'ఎక్కడం' అని అర్థం. ట్రై సీరీస్‌లో షఫాలీ తన సిక్సర్‌తో ఆమెను ఎక్కేసిందట. అది గుర్తుంచుకుంది షూట్. బలమైనవాళ్లు కూడా గుర్తుపెట్టుకునేంత షాట్ కొట్టిందన్న మాట షఫాలీ!

క్రీడాకారులలో, చిన్నపిల్లల్లో ప్రతీకారేచ్ఛ ఎక్కువగా ఉంటుంది. పైగా షఫాలీ క్రీడాకారిణి అయిన చిన్నపిల్ల. ఫైనల్స్‌లో మళ్లీ సిక్సర్‌లు కొట్టి షూట్ నోటిని 'ఆ..' అని తెరిపించాలని కూడా ఆమె అనుకుని ఉండొచ్చు. అది సాధ్యం కాలేదు. తన జట్టును గెలిపించాలని తపించి ఉండొచ్చు. అది సాధ్యం కాలేదు. తొమ్మిదేళ్ల వయసులో.. అబ్బాయిలు మాత్రమే ఆడే అకాడమీలో తనను చేర్పించడానికి అబ్బాయిలా తనకు క్రాఫ్ చేయించి సీటు సంపాదించిన తండ్రికి.. హర్యానా నుంచి ఆస్ట్రేలియా వచ్చే ముందు.. 'నాన్నా.. కప్పుతో కనిపిస్తాం, చూస్తుండు' అని షఫాలీ చెప్పే ఉండొచ్చు. అదీ సాధ్యం కాలేదు.

సాధ్యం కాలేదూ అంటే ప్రయత్నలోపం కాదని తెలుసుకోడానికి షెఫాలీ మరికొన్ని ఆటలు ఆడాలి. దక్కని గెలుపు మిగిల్చి వెళ్లిన ఒంటరితనాన్ని పోగొట్టి అక్కున చేర్చుకునే మైదానాలు, వాటిలో ఆడవలసిన ఆటలు ఇంకా ఎన్నిలేవు ఈ చిన్నమ్మాయ్‌కి. ●



దీక్షాయణి

జీవితంలో స్థిరత్వాన్ని సాధించిన తర్వాత 'సమాజానికి తిరిగి ఇవ్వడం' అనే యజ్ఞాన్ని దీక్షగా నిర్వహిస్తున్నారు దాక్షాయణి. ప్రభుత్వం చట్టం చేయడానికంటే ముందే స్వచ్ఛందంగా ఆ బాధ్యతను తలకెత్తుకున్నారామె. రామ్‌కీ ఫౌండేషన్ స్థాపించి దేశవ్యాప్తంగా వేలాది మంది జీవన స్థితిగతులను మెరుగుపరుస్తున్నారు.

దాక్షాయణిరెడ్డి ఆళ్ల,
మేనేజింగ్ ట్రస్టీ, రామ్‌కీ ఫౌండేషన్

జీవితం వడ్డించిన విస్తరిలా ఉండేది కొందరికే. ఆ కొందరిలో ఒకరు దాక్షాయణి రెడ్డి ఆళ్ల. ఆమెకు జీవితంలో ఎటువంటి కష్టమూ ఎదురు కాలేదు. కానీ బతకడం కోసం కష్టపడే వాళ్ల 'కష్టం' విలువ తెలుసు. కష్టం చేసుకుని బతుకును గాడిలో పెట్టుకోవాలనే వాళ్ల ఆకాంక్షను అర్థం చేసుకున్నారు. ఆకు ఆకు పేర్చి విస్తరి కుట్టుకుని పదార్థాలు వండి వడ్డించుకోవాలనే వాళ్ల గుండె లోతుల్లో ఉండే ఆర్ద్రతను తెలుసుకోగలిగారు. విస్తరాకులు చేయడం వచ్చిన వాళ్లకు ఆ పని లోనే ఉపాధి కల్పించారు. వండడం వచ్చిన వాళ్లకు అందులోనే నాలుగు డబ్బులు సంపాదించుకునే మార్గాన్ని చూపించారు. సకాలంలో వర్షాలు లేక పంటలు పరిహసించినప్పుడు ఆ కుటుంబాన్ని 'పాడి' ఆదుకుంటుందని కుటుంబానికి రెండు గేదెలిచ్చి మరీ నిరూపించారు. ఇవేవీ చేయడం కుదరని చోట మహిళలను సంఘటిత పరిచి దుస్తులు కుట్టడం నేర్పించారు. వర్క్ ఆర్డర్‌లు తెచ్చి ఆ మహిళలకు నిరంతరాయంగా పని కల్పించడానికి ఆమె సొంతంగా ఒక నెట్‌వర్క్‌నే అభివృద్ధి చేశారు. గృహిణిగా ఉన్న ఆమెను ఇవన్నీ చేయడానికి ప్రేరేపించింది గొప్ప స్ఫూర్తి ప్రదాతలు, ప్రముఖ దార్శనికులు కాదు. పల్నాడులో రాజ్యమేలిన పేదరికమే తనను 'సమాజం మనిషి'గా మార్చిందన్నారు దాక్షాయణి. ఆమె రామ్‌కీ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ చట్టాన్ని ప్రభుత్వం 2013లో తెచ్చింది. కానీ తమ సంస్థ పాతికేళ్ల కిందటే సమాజానికి తిరిగి ఇవ్వడం అనే బృహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు దాక్షాయణి. 1996 నుంచి తమ గ్రామాలకు వెళ్లినప్పుడు అక్కడి వాళ్లు అడిగిన అవసరాలను తీరుస్తూ వచ్చామని, 2006 ఆగస్టు 12వ తేదీ నుంచి ఈ సర్వీస్‌ను వ్యవస్థీకృతంగా మొదలు పెట్టామని చెప్పారామె.

కనకమ్మవ్వ హాస్టల్

''గ్రామాల్లో దిగువ మధ్య తరగతి, అల్పాదాయ వర్గాలకు ఆడపిల్లను కాలేజ్‌లో చదివించడం అనేది ఇప్పటికీ శక్తికి మించిన పనిగానే ఉంటోంది. ముఖ్యంగా గ్రామాల నుంచి పట్టణాలకు పంపించడానికి రవాణా సరిగ్గా ఉండదు. హాస్టల్‌లో పెట్టి చదివించడానికి ఖర్చులు భరించలేక బాగా చదివే అమ్మాయిలను కూడా చదువు మాన్పిస్తున్నారు. అలాంటి వాళ్ల కోసం నర్సరావు పేటలో హాస్టల్ పెట్టాం. ఆ హాస్టల్ పేరు కనకమ్మవ్వ హాస్టల్. అది మా వారి (ఆళ్ల అయోధ్య రామిరెడ్డి) నానమ్మ పేరు. ఆయనకు వాళ్ల నానమ్మ అంటే చాలా ఇష్టం. ఆమె పేరు చిరస్థాయిగా ఉండిపోవాలని కోరిక. అందుకే హాస్టల్‌కి ఆ అవ్వ పేరు పెట్టాను. ఏటా నలభై ఐదు మంది విద్యార్థినులకు ప్రవేశం ఉంటుంది. ఆ హాస్టల్ నుంచి ఇప్పటి వరకు ఐదు వందల యాభై మంది చదువు పూర్తి చేసుకున్నారు. మా రామ్‌కీ ఫౌండేషన్ ద్వారా పర్యావరణ పరిరక్షణ, చిన్న పరిశ్రమల స్థాపన, ఆరోగ్య చైతన్య సదస్సులు, ఆదివాసీల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల నిర్వహణ వంటివి 20 రాష్ట్రాల్లో, 125 గ్రామాల్లో చేస్తున్నాం. ఆరు వందల మంది మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్‌లో ట్రైనింగ్, రెండు వందల నలభై మందికి పాడి గేదెలు, మరో నాలుగు వందల మందికి బ్యూటీషియన్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇప్పించాం. కానీ అన్నింటిలోనూ నాకు వ్యక్తిగతంగా సంతృప్తినిస్తున్న సర్వీస్ ఆడపిల్లలను చదివించడమే. వాళ్లు చదువుకున్న సర్టిఫికేట్‌లు, జాబ్ ఆర్డర్‌లు చూపించి 'నేను ఇంజనీరింగ్ పాసయ్యాను మేడమ్, పీజీ పూర్తయింది మేడమ్, ఉద్యోగం వచ్చింది మేడమ్' అని చెబుతుంటే చాలా సంతోషంగా ఉంటుంది'' అని చెప్పారు దాక్షాయణి రెడ్డి ఆళ్ల.

– వాకా మంజులారెడ్డి
ఫొటో: అమర్

నాన్న బాధ్యత రామ్‌కీ వాళ్లు తీసుకున్నారు

మాది ప్రకాశం జిల్లా, మారెళ్ల పంచాయితీలోని గంగన్నపాలెం గ్రామం. అద్దంకికి పద్నాలుగు కిలోమీటర్లు. మా ఊరికి బస్సు లేదు. రెండు కిలోమీటర్ల దూరానున్న మారెళ్లకు నడిచి వెళ్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుకున్నాను. ఇంటర్‌కి అద్దంకి వెళ్లాల్సిందే. అద్దంకిలో జూనియర్ కాలేజ్‌కి వెళ్లాలంటే మారెళ్లకు నడిచి వెళ్లి, అక్కడ బస్సెక్కాలి. తిరిగి వచ్చేటప్పుడు అలాగే మారెళ్ల వరకు బస్సులో వచ్చి, రెండు కిలోమీటర్లు నడిస్తే ఊరు చేరతాం. మా దగ్గర ఆడపిల్లలకు కాలేజ్ చదువు అందని ద్రాక్షగా అవడానికి ఇదే ప్రధాన కారణం. అలాంటి చోట నేను ఇంటర్ వరకు చదవగలిగాను. మెడిసిన్‌లో సీటు వచ్చింది. మా ఊర్లో పెద్దాయన యలమందారెడ్డి తాతగారు నన్ను పిలిపించి మాట్లాడి, రామ్‌కీ ఫౌండేషన్ వాళ్లకు చెప్పారు. వాళ్లు నాలుగేళ్ల పాటు ఏటా లక్ష రూపాయల వరకు ఆర్థిక సహాయం చేశారు. ఈ ఫౌండేషన్ నుంచి వందలమంది సహాయం పొందుతున్నారు. ఈ నెల 27వ తేదీన నేను ఎంబీబీఎస్ పట్టా అందుకోబోతున్నాను. నేను సంపాదించడం మొదలుపెట్టిన తర్వాత నా వంతుగా ఒక స్టూడెంట్‌కి సహాయం చేస్తాను.

– పోతిరెడ్డి నాగలక్ష్మి, వైద్య విద్యార్థిని

ప్రయాణం

సగం ఉచితం

మహిళలకు కానుకలు ఇవ్వడానికి మహిళా దినోత్సవం ఒక మంచి సందర్భం. ఇవ్వడానికే కాదు, ఇస్తామని ప్రకటించడానికి కూడా. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి పంజాబ్ ఆర్టీసీలో మహిళా ప్రయాణీకుల బస్సు చార్జీలను సగానికి సగం తగ్గిస్తున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ ప్రకటించారు. ఉదా.. టిక్కెట్ ధర ఇరవై రూపాయలు ఉంటే మహిళలు పది రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. ఈ తగ్గింపు సిటీ బస్సులకే కాదు. రాష్ట్రమంతటా వర్తిస్తుంది.



అందమైన ప్రేమకథ

● నాగచైతన్య, సాయి పల్లవి

నాగచైతన్య, సాయి పల్లవి జంటగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఎమిగోస్ క్రియేషన్స్, సోనాలి నారంగ్ సమర్పణలో నారాయణ్ దాస్ కె. నారంగ్, పి. రామ్మోహన్ రావు నిర్మించిన చిత్రం 'లవ్‌స్టోరీ'. హోలీ సందర్భంగా ఈ చిత్రం కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ చిత్రంలోని 'ఏయ్ పిల్లా..' అంటూ సాగే మొదటి పాట పూర్తి లిరికల్ వీడియోను నేడు విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ– ''శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తోన్న ఈ అందమైన ప్రేమకథ అక్కినేని అభిమానుల్లో, ప్రేక్షకుల్లో ఆసక్తి రేపింది. హోలీ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్‌కి మంచి స్పందన వస్తోంది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ సినిమాకి సహ నిర్మాత : భాస్కర్ కటకంశెట్టి, సంగీతం: పవన్ సి.హెచ్.

యూరప్ పోదాం.. స్టెప్పులేద్దాం

నల్లగొండ బుధవారం 11-3-2020

● ప్రభాస్

'హ'లో... ఓ మై డియర్. చలో యూరప్' అంటున్నారు ప్రభాస్. రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'ఓ డియర్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని గోపీకృష్ణా మూవీస్, యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో మొదలైన ఈ సినిమా షెడ్యూల్ ముగిసింది. ఓ ప్రముఖ స్టూడియోలో వేసిన సెట్స్‌లో హీరో హీరోయిన్లపై కొన్ని కీలక సన్నివేశాలతో పాటు ఓ చేజింగ్ ఫైట్ సీక్వెన్స్‌ను కూడా షూట్ చేశారు. ఈ సినిమా తర్వాతి షెడ్యూల్ యూరప్‌లో ప్రారంభం అవుతుంది. అక్కడ కొన్ని రొమాంటిక్ సన్నివేశాలతో పాటుగా పాటల చిత్రీకరణను ప్లాన్ చేస్తున్నారు చిత్రబృందం. ఈ పీరియాడికల్ లవ్‌స్టోరీకి అమిత్ త్రివేది సంగీతం అందిస్తున్నారు.

హోలీని భార్య లక్ష్మీ ప్రణతి, కుమారులు అభయ్ రామ్, భార్గవ్‌రామ్‌లతో జరుపుకున్నారు ఎన్టీఆర్. రంగులు పూసుకుని ఫొటోలు దిగారు. అలా దిగిన ఫొటోల్లో ఓ సెల్ఫీ ఇది.

నట్టింట్లోకి నెట్టుకొస్తున్న సినిమా

భవిష్యత్ అంతా 'ఓటీటీ'దేనా?

పరిస్థితి లేదు. ఎందుకంటే ఒకప్పుడు పదులు, వందల్లో ఉండే థియేటర్ల సంఖ్య ఇప్పుడు వేలల్లో ఉంది. వేల థియేటర్లలో సినిమా రిలీజ్ అవ్వడంతో మహా అయితే బొమ్మ (సినిమా) ఏడెనిమిది వారాలు స్క్రీన్ మీద ఉంటుంది.. అంతే. అయితే థియేటర్లో ఉన్న సినిమా ఈ ఏడెనిమిది వారాల్లోపు ఎక్కడైనా దర్శనమిస్తే.. ఇక థియేటర్‌కి వెళ్లి చూడాలనుకున్నవాళ్లు కూడా ఇంటిపట్టునే చూడాలనుకుంటారు. అమెజాన్, నెట్‌ఫ్లిక్స్.. ఇలా డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఎలాగూ వచ్చేస్తాయి కాబట్టి వచ్చినప్పుడు సినిమా చూసేద్దాం.. పనిగట్టుకుని థియేటర్‌కి వెళ్లడం ఎందుకని చాలామంది ప్రేక్షకులు ఫిక్స్ అయ్యారు. థియేటర్ అధినేతలకు ఈ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. తెలుగు పరిశ్రమలో ఇంకా ఈ విషయమై వివాదాలు జరుగుతున్నట్లు కనిపించడంలేదు కానీ తమిళ పరిశ్రమకు చెందిన పంపిణీదారులు, థియేటర్ అధినేతలు చర్చలు మొదలు పెట్టారు. దానికి కారణం ఏంటంటే...

రజనీకాంత్ 'దర్బార్' విడుదలై 50వ రోజు పూర్తి కాకుండానే డిజిటల్‌కి వచ్చేసింది. ఇక థియేటర్‌కి ఎవరు వెళతారు? కార్తీ నటించిన 'ఖైదీ' అయితే విడుదలైన 30వ రోజులోపే నెట్టింట్లో దర్శనమిచ్చింది. ఇలా అయితే సినిమా కొనుక్కున్నవాళ్ల పరిస్థితి ఏంటి? ఆడించేవాళ్ల (థియేటర్ ఓనర్స్) పరిస్థితి ఏంటి? ఈ విషయంపై తమిళనాడు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు ఓ మీటింగ్ ఏర్పాటు చేసుకున్నారు. ''సినిమా విడుదలైన ఎనిమిది వారాలు లేదా 100 రోజులు తర్వాతే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో, టీవీ చానల్స్‌లో విడుదల చేయాలి'' అని సినిమా కొనే ముందు అగ్రిమెంట్‌లో రాయించుకోవాలనుకుంటున్నారు. పంపిణీదారులు, థియేటర్ అధినేతల అభిప్రాయం ఇలా ఉంటే.. ''ఒకవేళ మా సినిమాను థియేటర్‌లో 50 నుంచి 60 రోజులు ఆడిస్తానంటే అప్పుడు 'ఓటీటీ ప్లాట్‌ఫామ్స్'లో విడుదలను జాప్యం చేస్తాం'' అంటూ డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్ల ముందు కొందరు నిర్మాతలు ఓ డిమాండ్ ఉంచారు. ''చిన్న సినిమాలకు 'ఓటీటీ ప్లాట్‌ఫామ్' బెస్ట్. విడుదలైన నెలలోపు ఓటీటీలో వచ్చేస్తే చిన్న సినిమా నిర్మాతకు కాస్త రెవెన్యూ వస్తుంది'' అన్నది ఓ నిర్మాత వాదన. ప్రస్తుతం తమిళ పరిశ్రమలో ఈ విషయమై చర్చలు జరుగుతున్నాయి. ఇక మన తెలుగు విషయానికొస్తే... మహేశ్‌బాబు 'సరిలేరు నీకెవ్వరు', అల్లు అర్జున్ 'అల.. వైకుంఠపురములో' చిత్రాలు విడుదలైన 50 రోజులకు రీచ్ అయ్యే టైమ్‌కి నెట్టింట్లోకి రావడం విశేషం.

సినిమా ఇంకా థియేటర్లో ఉండగానే టీవీలోనో, కంప్యూటర్లోనో, సెల్ ఫోన్‌లోనో చూసే చాన్స్ వస్తే బంపర్ ఆఫర్ కొట్టేసినట్లే. అది కూడా సూపర్ స్టార్ రజనీకాంత్ సినిమానో వేరే స్టార్ హీరో సినిమానో అయితే చేతిలో ఉన్న రొట్టె విరిగి నెయ్యిలో పడ్డట్టే. తంతే బూరెల బుట్టలో పడ్డట్లే. సినిమా లవర్స్‌కి 'ఓటీటీ' ఇలాంటి బంపర్ ఆఫర్లే ఇస్తోంది. 'ఓటీటీ' అంటే 'ఓవర్ ది టాప్' అని అర్థం. 'పై చేయి' అన్నమాట. నిజమే.. పరిస్థితి చూస్తుంటే సినిమాకంటే 'డిజిటల్ ప్లాట్‌ఫామ్'దే పై చేయి అయ్యే చాన్స్‌ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ ఓటీటీ గురించి వివరంగా తెలుసుకుందాం.

ఒకప్పుడు వినోదం అంటే సినిమానే. ఇప్పుడు సీరియల్స్, వెబ్ సిరీస్‌లు, పార్కులు, పబ్బులు, గేమింగ్ జోన్లు.. ఇలా ఎన్నో. ఇవి కాదనుకుని ప్రేక్షకులు థియేటర్‌కి రావాలంటే సినిమా అద్భుతంగా ఉండాలి. అయినా వంద రోజులు ఆడే సినిమా థియేటర్లో ఉండగానే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌కి వస్తే... ఎగ్జిబిటర్స్‌కి కొంత మేర నష్టం జరుగుతుందనే చెప్పాలి. ఒకవేళ 50 రోజుల్లో రెవెన్యూ వచ్చేస్తే.. ఆ తర్వాత బోనస్‌గా వచ్చే వసూళ్లకు గండిపడినట్లే. అయితే చిన్న సినిమాలకు 'ఓటీటీ' పెద్ద వరం.

టెక్నాలజీ పెరిగే కొద్దీ పెను మార్పులు వస్తుంటాయి. ఈ మార్పు అందరి మంచికీ కారణం అయితే అదేదో యాడ్‌లో 'మరక మంచిదే' అన్నట్లుగా 'మార్పు మంచిదే' అనుకోవచ్చు.

థియేటర్స్ క్లోజ్ కరోనా

ప్రపంచాన్ని ప్రస్తుతం కరోనా వైరస్ వణికిస్తోంది. ఈ కరోనా ప్రభావం ఫిల్మ్ ఇండస్ట్రీపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. పలు చిత్రాల షూటింగ్స్ ఈ వైరస్ ప్రభావిత దేశాల్లో క్యాన్సిల్ అయ్యాయి. 'నో టైమ్ టు డై' (జేమ్స్‌బాండ్ సిరీస్‌లో 25వ చిత్రం) వంటి హాలీవుడ్ సినిమా విడుదల కూడా కరోనా దెబ్బకు వాయిదా పడింది. ఈ సినిమాయే కాదు... ఇటు ప్రాంతీయ సినిమాల నిర్మాతలు కూడా తమ సినిమాల రిలీజ్ విషయంలో పునరాలోచనలో పడ్డారు.

కరోనా వైరస్ భయంతో జనం థియేటర్స్‌కు రాకపోతే ఈ ప్రభావం కలెక్షన్స్‌పై పడుతుందని ఆలోచిస్తున్నారు. తాజాగా కేరళలో థియేటర్స్ క్లోజ్ కరోనా (చెయ్యవా) అనే పరిస్థితి. అక్కడ కరోనా ప్రభావం ఎక్కువగా ఉండటంతో బుధవారం నుంచి మార్చి 31వరకు కేరళలో సినిమా థియేటర్స్‌ను క్లోజ్ చేయాలని కేరళ ప్రభుత్వం సూచించింది. ''ఈ నెల 16 వరకూ క్లోజ్ చేస్తాం. ఆ తర్వాతి పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం ఆదేశాలను పాటించి, 31 వరకూ క్లోజ్ చేస్తాం'' అని కేరళ చిత్రనిర్మాతల మండలి అధ్యక్షుడు ఎం. రంజిత్ పేర్కొన్నారు. దీంతో మాలీవుడ్ స్టార్ హీరోలు కూడా తమ సినిమాల షూటింగ్స్‌కు కాస్త బ్రేక్ ఇవ్వాలనుకుంటున్నారట.

టూర్ క్యాన్సిల్!

కరోనా వైరస్ ప్రభావంతో ముంబై టూర్‌ను క్యాన్సిల్ చేసుకున్నారు హాలీవుడ్ స్టార్ హీరో క్రిస్ హేమ్స్‌వర్త్. ఆయన నటించిన 'ఎక్స్‌ట్రాక్షన్'(2020) మూవీ ప్రమోషన్‌లో భాగంగా చిత్రదర్శకుడు సామ్ హార్ప్‌వ్‌తో కలిసి ఈ నెల 16న క్రిస్ ముంబై రావాల్సి ఉంది. కానీ కరోనా ఎఫెక్ట్‌తో క్రిస్ తన ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారని ముంబై సినీ వర్గాల కథనం.

చిన్న గ్యాప్ తర్వాత

● అనూ ఇమ్మాన్యుయేల్

'శైలజారెడ్డి అల్లుడు (2018)' తర్వాత తెలుగులో కాస్త స్లో అయినట్లున్నారు హీరోయిన్ అనూ ఇమ్మాన్యుయేల్. మళ్లీ స్పీడ్‌ను అందుకోవాలనే ఆలోచనతో తాజాగా ఓ తెలుగు సినిమాకు అనుసైన్ చేశారట. చిరంజీవి చిన్నల్లుడు కల్యాణ్‌దేవ్ హీరోగా పరిచయమైన 'విజేత' చిత్రాన్ని డైరెక్ట్ చేసిన రాకేశ్ శశి దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రంలో అను హీరోయిన్‌గా నటించబోతున్నారని సమాచారం. ఇందులో అల్లు శిరీష్ హీరోగా నటిస్తారట. ప్రస్తుతం స్క్రిప్ట్‌కు ఫైనల్ టచ్ ఇచ్చే పనిలో ఉన్నారట శశి.

ఓటీటీ కోసమే సినిమాలు నిర్మించనున్నాం

– నిర్మాత **అల్లు అరవింద్**

గీతా ఆర్ట్స్ బేనర్‌లో పెద్ద సినిమాలతో పాటు చిన్న సినిమాలు కూడా తీస్తున్న ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఇటీవల ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లోకి వచ్చిన విషయం తెలిసిందే. 'ఆహా' పేరుతో వచ్చిన ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో వెబ్ సిరీస్, సినిమాల స్ట్రీమింగ్ జరుగుతాయి. ''ప్రారంభమైన రెండు వారాల్లోనే ఆరు లక్షల పైనే రిజిస్ట్రేషన్స్ పూర్తయ్యాయి'' అని 'ఆహా' ప్రతినిధులు తెలిపారు. ఒకవైపు నిర్మాణం, డిస్ట్రిబ్యూషన్ రంగంలో ఉన్నారు అల్లు అరవింద్. మరి.. సినిమా విడుదల తర్వాత 'ఓటీటీ' ప్లాట్‌ఫామ్‌లో ప్రదర్శించాలంటే ఎన్ని వారాలు గ్యాప్ ఉండాలి? చిన్న సినిమాలకు 'ఓటీటీ' వల్ల ఎలాంటి లాభం చేకూరుతుంది? అనే ప్రశ్నలకు అల్లు అరవింద్ ఈ విధంగా చెప్పారు.

– ఓ నెల తిరక్కుండానే అనూహ్యంగా ఐదు లక్షల మంది మా 'ఆహా' యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకున్నారు. నాలుగైదు నెలల్లో మా యాప్‌కి ఇంత స్పందన వస్తుందనుకుంటే నెలకే వచ్చింది. సో.. ఓటీటీలకు కూడా జనం పెరుగుతున్నారు. ప్రజలకు ఏది అవసరమో దాన్ని ఇవ్వడమే ఇండస్ట్రీ ఉద్దేశం. ఓటీటీ కోసమే నిర్మించే సినిమాలు అతి త్వరలో రాబోతున్నాయి. మంచి కథతో వస్తే మేమే రెండు మూడు కోట్ల రూపాయలు ఆఫర్ చేసి, ఓటీటీ కోసమే సినిమాలు తీయమని చెప్పబోతున్నాం. దీనివల్ల చాలా మందికి అవకాశాలు పెరుగుతాయి. ఓటీటీల కోసమే సినిమాలు తీసే నిర్మాతల సంఖ్య పెరుగుతుంది. మనం థియేటర్స్‌కి వెళ్లకుండా ఓటీటీ వాళ్లకే సినిమా ఇవ్వొచ్చు, ఓ 50 లక్షలు సంపాదించుకోవచ్చనే అభిప్రాయం చిన్న సినిమా నిర్మాతలకు ఏర్పడుతుంది.

– చిన్న సినిమాలకు థియేటర్‌లో ఏడెనిమిది వారాల సమయం పెట్టలేం. మా సినిమాలు ఓటీటీలో పడటం లేదని చిన్న సినిమాల నుంచి ఒత్తిడి ఎక్కువగా ఉంది.. మాకు అంత సమయం పెట్టొద్దని అంటున్నారు. అయితే 'ఓటీటీలో ఇచ్చేట్లు అయితే డైరెక్ట్‌గా ఇచ్చేసుకోండి మాకు అవసరం లేదు' అని ఎగ్జిబిటర్స్ అంటున్నారు. దీన్ని ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ టేకప్ చేసి రూల్స్ పెడితే బాగుంటుందనుకుంటున్నా. చిన్న సినిమా అంటే నా ఉద్దేశం ఐదు కోట్ల లోపు చేసేవి. ఆ చిన్న సినిమాలకి ఓటీటీ వాళ్లు ఇచ్చేది చాలా ఎక్కువగా కనిపిస్తుంది కాబట్టి నాలుగు వారాలు దాటాక 30 రోజుల్లోనే మేము ఇచ్చుకుంటాం అని చిన్న సినిమా వాళ్లు అడుగుతున్నారు. ఫైనాన్షియల్‌గా సేఫ్ అవుతామనే ఉద్దేశంతో ఓటీటీలకు ఇవ్వాలనుకుంటారు.. చిన్న సినిమా వాళ్లు గ్రహించాల్సింది ఏంటంటే.. నాలుగువారాల్లో ఓటీటీలో వస్తుందనుకుంటే థియేటర్‌కి వెళ్లి చూడాల్సిన అవసరం ఏంటి? అని ప్రేక్షకులకు అనిపిస్తుంది. అది గ్రహించి చిన్న సినిమా వాళ్లు కూడా పెద్ద సినిమాల్లా ఎనిమిది వారాలకు ఒప్పుకుంటే బాగుంటుంది. అయితే పెద్ద సినిమాలు ఎలాగూ 8 వారాలు ఆడతాయిలే అని నిర్మాతలు అనుకుంటున్నారు.. ఇందుకు ఓటీటీ వాళ్లు కూడా ఒప్పుకుంటున్నారు.

8 వారాలు గ్యాప్ ఉండాలి

– నిర్మాత **డి. సురేష్‌బాబు**



"సినిమా విడుదలైన తర్వాత డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రదర్శితం అవ్వాలంటే కనీసం ఎనిమిది వారాలు గ్యాప్ ఉండాలి. అదే కరెక్ట్ అంటాను. అయితే 'ఓటీటీ ప్లాట్‌ఫామ్' అధినేతలు కొందరు ఈ విషయంతో ఏకీభవించడంలేదు. 30 రోజుల్లో అయితేనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో సినిమాని ప్రదర్శించే హక్కులు కొంటామని కొందరు 'ఓటీటీ ప్లాట్‌ఫామ్' ప్లేయర్స్ నిర్మాతలను ఒత్తిడి చేస్తున్నారు.

– డి.జి. భవాని

ప్రేమ ప్రభావం

● సాహితి, నిఖిల్

నిఖిల్ దేవాదుల ('బాహుబలి' ఫేమ్), కీర్తన్, ఉపేందర్, సాహితి, సిమ్రాన్ సానియా, పారుల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం '15-18-24 లవ్ స్టోరీ'. మాడుపూరి కిరణ్ కుమార్ దర్శకత్వం వహించారు. స్రవంతి ప్రసాద్, కిరణ్‌కుమార్ నిర్మిస్తున్న ఈ సినిమా పోస్టర్‌ను ఏపీ బీజేపీ ఆర్టిసన్ సెల్ స్టేట్ కన్వీనర్ బంగారుబాబు విడుదల చేసి, మాట్లాడుతూ –''ప్రకాశం జిల్లాకి చెందిన మాజేటి ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం మంచి విజయం సాధించాలి. మంచి కథతో కిరణ్ కుమార్ ఈ సినిమా చేస్తున్నాడు. పాటలు కూడా చాలా బాగున్నాయి'' అన్నారు. మాడుపూరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ –''ప్రేమ ప్రభావం వయసు మీద చాలా ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా 15, 18, 24 ఏళ్ల వయసుల్లో ప్రేమ, దాని పర్యవసానాల మీద చక్కని కథతో తెరకెక్కుతున్న యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. అన్నివర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది'' అన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హజరత్ బాబు, సహనిర్మాతలు: బి వి శ్రీనివాస్, బొద్దుల సుజాత శ్రీనివాస్.

అమాయక కుర్రాడి పెళ్లి

● మహి, మోనా

మహి రాథోడ్ హీరోగా నటిస్తూ, పీవీయమ్ జ్యోతి ఆర్ట్స్ పతాకంపై నిర్మిస్తోన్న చిత్రం '1992'. శివ పాలమూరి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్ లోగో, ఒక పాటను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేసి, మాట్లాడుతూ– ''1992' టైటిల్, ఫస్ట్ సింగిల్ చాలా ఆసక్తిగా ఉన్నాయి. కొత్త వారిని ప్రోత్సహించడానికి నేనెప్పుడూ ముందుంటాను. కొత్త వారు చేస్తోన్న ఈ ప్రయత్నం విజయం సాధించాలి'' అన్నారు. శివ పాలమూరి మాట్లాడుతూ–''దర్శకుడిగా నా తొలి చిత్రమిది. నేటి సమాజంలో ప్రేమ, పెళ్లిళ్లు ఎలా తయారయ్యాయో చూపించే ప్రయత్నం చేస్తున్నాం. మా సినిమా చివరి షెడ్యూల్ జరుగుతోంది. వేసవిలో సినిమా విడుదలకి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ''శివగారు సినిమాను అనుకున్న విధంగా తెరకెక్కిస్తున్నారు'' అన్నారు హీరో, నిర్మాత మహి రాథోడ్. ''యాత్ర' సినిమా తర్వాత మంచి పాత్రలు వస్తున్నాయి. '1992'లో హీరోయిన్ తండ్రి పాత్రలో నటిస్తున్నా. ఒక అమాయక కుర్రాడు ప్రేమించి, పెళ్లి చేసుకుని ఆ తర్వాత ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు? అనేది చిత్ర కథ'' అన్నారు నటుడు 'దిల్' రమేష్. ''తెలుగులో నాకిది తొలి చిత్రం. మంచి పాత్ర చేస్తున్నా'' అన్నారు మోనా ఠాగూర్.

పరిపరిశోధన

నానో పసుపుతో మెరుగైన ప్రయోజనాలు

పసుపుతో శరీరానికి బోలెడంత మేలు జరుగుతుందని ఆయుర్వేదం చెబుతుంది. ఆధునిక వైద్యం కూడా దీన్ని గుర్తించింది. కానీ పసుపులో మనకు మేలు చేసే మూలకం కర్కుమిన్‌తో ఓ చిక్కుంది. ఎంత తిన్నా శరీరానికి ఒంట బట్టేది కొంతే. ఈ సమస్యను అధిగమించేందుకు టెక్సస్‌లోని ఏ అండ్ ఎం, కెనెడాలోని మెక్‌మాస్టర్, సౌత్ ఆస్ట్రేలియా యూనివర్శిటీలు సంయుక్తంగా ఒక వినూత్నమైన పద్ధతిని ఆవిష్కరించారు. కర్కుమిన్‌తో నిండిన నానో కణాలను ఉత్పత్తి చేసే ఈ పద్ధతిని పరీక్షించినప్పుడు ఆశ్చర్యకరమైన ఫలితాలు వచ్చాయి. కర్కుమిన్‌తో కూడిన నానో కణాలు శరీర కణాలకు నేరుగా పూర్తి

స్థాయిలో ఔషధాన్ని అందిస్తున్నట్లు గుర్తించారు. జంతువులపై ఈ నానో కర్కుమిన్‌ను వాడినప్పుడు కూడా వయసుతోపాటు మెదడు పనితీరులో వచ్చే సమస్యను నయం చేయగలిగినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. మంట/వాపులను తగ్గించడం ద్వారా కర్కుమిన్ మెదడులోని అల్జైమర్స్ సంబంధిత గారను తొలగించగలిగిందని వీరు అంటున్నారు. తాజాగా ఈ నానో మందును జననాంగాలకు వచ్చే హెర్పిస్ వ్యాధిని తగ్గించేందుకూ ఉపయోగిస్తున్నారు. గుండెజబ్బు, కేన్సర్ విషయంలోనూ కర్కుమిన్ సత్ఫలితాలు అందిస్తుందని ఇప్పటికే పలు ప్రయోగాల ద్వారా స్పష్టమైన నేపథ్యంలో ఈ కొత్త పరిశోధనకు ప్రాధాన్యం ఏర్పడుతోంది.

సినీ పరివారం

ఆయన గట్టి ప్రసాద్

'పితా' అంటూ 'రెండు రెళ్లు ఆరు'లో అందరినీ నవ్వులలో ముంచారు. 'నమస్కారవండయ్యా! నమస్కారవండయ్యా!' అంటూ 'సాగర సంగమం'లో బావి గట్టు మీద నవ్వులు పూయించారు. ఇక 'చంటబ్బాయ్'లో పత్రిక ఎడిటర్‌గా శ్రీ లక్ష్మి కవితలను ప్రచురించలేక, బంగాళా భౌభౌ తినలేక ఆయన నవ్వించిన నవ్వులు అన్నీ ఇన్నీ కాదు. ఆయన పొట్టి ప్రసాద్. తెలుగు హాస్యంలో గట్టి ప్రసాద్. బ్లాక్ అండ్ వైట్ నుంచి కలర్ వరకు ఆయన సినీ ప్రయాణం సుదీర్ఘమైనది. ఆ తండ్రి గురించి ఎన్నో జ్ఞాపకాలను, ఆయనతో ఉన్న అనుబంధాన్ని ఏకైక కుమారుడు కవిపురపు జగన్నాథరావు సాక్షితో పంచుకున్నారు.

కవిపురపు జగన్నాథరావు

నాన్నగారు కృష్ణాజిల్లా ఆటపాకలో 1929 జనవరి 5న జన్మించారు. నాన్నగారి అసలు పేరు కవిపురపు ప్రసాదరావు. ఆయన కొద్దిగా పొట్టిగా ఉండటం వల్ల అందరూ పొట్టిప్రసాద్ అనేవారు. ఆ పేరే స్థిరపడిపోయింది. అందరూ ఆ పేరుతోనే గుర్తిస్తారు. నాన్నగారు సినిమాలలోకి వచ్చిన కొత్తలో టైటిల్స్‌లో ప్రసాద్ అనే ఉండేది. అమ్మ పేరు రాజ్యలక్ష్మి. వాళ్లది కృష్ణా జిల్లా కైకలూరు. నాన్నగారికి నేను ఒక్కడినే అబ్బాయిని. నా భార్య పేరు శారద. నాకు ఇద్దరు పిల్లలు. రాజేశ్వర ప్రసాద్, శ్రీరాజ్ని. నేను పుట్టటానికి ముందు ఒక ఆడపిల్ల పుట్టి పోయిందట. అందుకని నాన్నగారు ఆడపిల్లలను చూసి మురిసిపోయేవారు.

మేనత్తగారే పెంచారు...

మాది సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబం. నాన్న చిన్నతనంలోనే బామ్మ పోవటంతో ఆయన మేనత్త మైనంపాటి కామేశ్వరమ్మ ఆ లోటు తెలియకుండా కన్నతల్లిలా పెంచారు. క్రమశిక్షణ అలవాటు చేశారు. ఆవిడంటే మా తాతగారితో సహా ఇంట్లో అందరికీ హడలు. నాన్నగారు బి.కాం వరకు చదువుకున్నారు. నాటకాలలో గిరీశం పాత్రలో ప్రసిద్ధులైన కె. వెంకటేశ్వరరావు గారి రస సమాఖ్యలో నాటకాలు వేసేవారు. అది వాళ్ల మేనత్తగారికి ఇష్టం ఉండేది కాదు. ఆవిడకు తెలియకుండా గోడ దూకి వెళ్లి, మళ్లీ ఆవిడ చూడకుండానే గోడ దూకి వచ్చేసేవారట. ఇలా నాటకాలలో వేషం వేస్తూ, జీవితంలో ఆర్థికంగా స్థిరపడరేమోనని, పెళ్లి చేసేయాలనుకున్నారట తాతగారు. మేనత్తగారికి ఇష్టం లేకుండానే నాన్నగారికి పెళ్లి చేసేశారట. ఈ విషయాలు మా వాళ్లంతా మాట్లాడుకుంటున్నప్పుడు విన్నాను.

సినిమాల కోసం...

1958లో నాన్నగారు నటించిన ఆకాశరామన్న నాటకం చూసి నిర్మాత చక్రపాణిగారు నాన్నగారిని వచ్చి కలవమన్నారు. సరేనని నాన్న ఎలాగో కష్టపడి మద్రాసు వెళ్లారు. 'అప్పు చేసి పప్పు కూడు' చిత్రంలో పెళ్లి కొడుకు వేషం వేశారు. అది నాన్నగారు నటించిన మొదటి సినిమా. ఆ తరవాత ఎల్. వి. ప్రసాద్ గారికి దగ్గర నెలవారీ జీతానికి పనిచేశారు. ఎక్కువ అవకాశాలు రాకపోవటంతో, మళ్లీ వెనక్కి వచ్చేద్దామనుకున్నారట. ఆ సమయంలో జె. వి. రమణమూర్తి సహాయపడ్డారట. పూజాఫలంలో నాన్న పెద్ద పాత్ర వేశారు. మళ్లీ సినిమాలలో ఇబ్బంది వచ్చి నాటకాలు వేయటం ప్రారంభించారు.

నిత్యం బంధుమిత్రులు..

చెన్నైలో నుంగంబాకంలో అద్దెకు ఉండేవాళ్లం. అమ్మ తరపున చుట్టాలు ఎక్కువ. నాన్నగారు అందరితోనూ చాలా స్నేహంగా ఉండేవారు. అందువల్ల నాన్నగారికి స్నేహితులు ఎక్కువ. మా ఇంట్లో నిత్యం సంతర్పణ సాగేది. చిడతల అప్పారావు, అల్లు రామలింగయ్య, రావి కొండలరావు అందరూ భోజనానికి వచ్చేవారు. కొన్నాళ్ల తరవాత సాలగ్రామంలో స్థలం కొనుక్కున్నాం. మా పక్కనే సాక్షి రంగారావు గారు కూడా కొన్నారు. రెండు కుటుంబాల మధ్య గోడలు ఉండేవి కాదు. అంత కలసిమెలసి ఉండేవాళ్లం. నాన్నగారికి భక్తి ఎక్కువ. పండుగలు బాగా చేసేవారు. దసరా నవరాత్రులు తొమ్మిది రోజులు ఇంట్లో పెళ్లి జరుగుతున్నట్లు ఉండేది. అంత వైభవంగా చేసేవారు.

కవిపురపు ప్రసాదరావు (పొట్టి ప్రసాద్)

నాన్నగారు ఇంట్లో ఉన్నప్పుడు చిన్న తువ్వాలు కట్టుకుని సింపుల్‌గా ఉండేవారు. ఆర్భాటంగా కనిపించటం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. ఆయనకు విల్‌పవర్ ఎక్కువే. సిగరెట్ మానేయాలనుకున్నప్పుడు వెంటనే మానేశారు. దాని బదులు జర్దా అలవాటు చేసుకున్నారు. ఆ తరవాత అది మానేసి ముక్కుపొడుం మొదలుపెట్టారు. ఆ తరవాత అది కూడా మానేయాలనుకున్నారు. మానేశారు. నాన్నగారు ఉన్నన్ని రోజులు ఆయన మంచితనం తెలియలేదు. 1998 ఫిబ్రవరి 23న నాన్నగారు కన్నుమూశాక, ఆయన నా గురించి ఎందుకు బాధపడ్డారో అర్థమైంది.

- కవిపురపు జగన్నాథరావు

నాన్నగారు చాలా స్ట్రిక్ట్...

నాన్నగారు నా చదువు విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా ఉండేవారు. ఆయనలా నేను ఇబ్బందులు పడకూడదని, చదువును నిర్లక్ష్యం చేయకూడదని తాపత్రయపడ్డారు. తొమ్మిదో తరగతి దాకా నాకు చదువు మీద శ్రద్ధ ఉండేది కాదు. పరీక్షల్లో ఫెయిల య్యేవాడిని. పరీక్ష పేపర్లు ఇచ్చేరోజున నాకు చాలా దడగా ఉండేది. నా మార్కులు చూసి, నాన్నగారు కోపంగా, నా చేతిలో నుంచి పుస్తకాలు తీసుకుని విసిరేసేవారు. సెంట్రల్ సిలబస్ వల్ల చదవలేకపోతున్నానేమోనని, స్టేట్ సిలబస్ కోసం కేసరి స్కూల్‌లో చేర్పించారు. పదోతరగతి ఫస్ట్ క్లాసులో పాసయ్యాను. నాన్నగారు నమ్మలేదు. పదకొండు, పన్నెండు తరగతుల్లో కూడా మార్కులు బాగా వచ్చాయి. బి. కామ్ పూర్తి చేశాను. ఎం.కామ్ మధ్యలోనే ఆపేశాను.

పొట్టి ప్రసాద్ భార్య, కొడుకు, కోడలు, మనుమలు

సినిమాలకు దూరంగా...

నాన్నగారికి నేను సినిమా ఫీల్డ్‌లోకి రావటం ఇష్టం లేదు. మా ఇంటికి ఎవరైనా సినిమా వాళ్లు వచ్చినప్పుడు, నేను అక్కడ నిల్చుంటే క్లాస్లెరచేసేవారు.

సంగీతమే ప్రాణం

నాకు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ఇష్టం. కాని నాన్నగారికి ఇష్టం లేదు. ఒకసారి నాన్న తన స్నేహితులతో కలిసి మా ఇంటి హాల్లో కూర్చుని పాటలు వింటూ, నన్ను రూమ్‌లో కూర్చుని చదువుకోమన్నారు. నా దృష్టంతా సంగీతం మీదే ఉండటంతో, ఆయన మీద కోపంగా ఉండేది. ఒకసారి కీబోర్డు కొనిపెట్టమని నాన్నగారిని అడిగాను. ఆయన నో చెప్పారు. నేను మొండివాడిని కావటంతో, పేచీ పెట్టి, సాధించుకున్నాను. నా పద్ధతి చూసి, 'నీకు కొడుకు పుడితేనే కాని, నేను ఎందుకు బాధ పడుతున్నానో నీకు తెలియదురా' అనేవారు.

కంపెనీ ఉద్యోగిగా..

నాన్నగారు నా కోసమని ఆయనకు తెలిసిన ఎం.ఎస్.మూర్తిగారి కంపెనీకి ఇంటర్వ్యూకి వెళ్లమంటే వెళ్లాను. అక్కడ వారు అడిగిన ప్రశ్నలకు చాలా తిక్కగా సమాధానాలు చెప్పాను. వాళ్లు పదిరోజుల తరవాత చెప్తామన్నారు. ఇంక రాదంతే అనుకున్నాను. కాని పిలుపు వచ్చింది. మొదటినెల జీతం వెయ్యి రూపాయలు వచ్చింది. నాన్నకు ఇస్తుంటే, 'నాకెందుకు? నువ్వే జాగ్రత్తగా ఖర్చు చేసుకో' అన్నారు. అయినా నాలో పెద్దగా మార్పు రాలేదు. ఉద్యోగం నుంచి ఇంటికి రాగానే సంగీత సాధనకు వెళ్లిపోయేవాడిని. ఒకరోజు... నాన్నకు ఒంట్లో బాగులేదని థమ్‌గారి ద్వారా కబురు వచ్చింది. ఇంటికి వచ్చి చూసేసరికి ఆయనకు స్ట్రోక్ రావటంతో, వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లాను. పదిరోజులు ఆసుపత్రిలో ఉన్నారు. గొంతు పాడైపోయింది. అప్పటికి నాన్నగారి చేతిలో ఐదారు సినిమాలున్నాయి. 400 సినిమాలకు డబ్బింగ్ చెప్పిన నాన్నగారు మాట్లాడలేకపోయేసరికి ఒత్తిడిలోకి వెళ్లిపోయారు. రెండేళ్ల పాటు వైద్యం చేయించిన తరవాత నాన్నగారికి మాట వచ్చింది. కాని సినిమాలు తగ్గిపోయాయి. మళ్లీ 1998లో నాన్నగారు తీవ్ర అనారోగ్యంతో బాధపడ్డారు. ఫిబ్రవరి 23న తన నవ్వులను దేవలోకంలో పూయించడానికి తరలి వెళ్లిపోయారు.

నాన్నగారు పోయినప్పుడు గొల్లపూడి మారుతీరావుగారు, 'పూర్ణానంద సత్రంలో పొట్టి ప్రసాద్ వేస్తున్న నాటకాన్ని, ఒక మామూలు సంచి భుజాన వేసుకుని, గేటు బయట నుంచి చూశాను. అప్పట్లో నాటకాలకు అంత ఆదరణ ఉండేది' అని రాశారు.

– సంభాషణ: **డా. వైజయంతి పురాణపండ**

సీ'రియల్'

ఎక్కడకు వెళ్లినా సాకేత్ అని పిలుస్తారు

'మంగమ్మగారి మనవరాలు' సీరియల్‌లో సాకేత్‌గా బుల్లితెరకు పరిచయం అయిన గుడిబోయిన మధుబాబు అతి త్వరలోనే అభిమానులను సంపాదించుకున్నాడు. ఆ తర్వాత 'అభిషేకం', 'అత్తారింట్లో అక్కాచెల్లెళ్లు', 'రెండు రెళ్లు ఆరు'... ఇలా వరుస సీరియల్స్‌తో ఏడేళ్లుగా బుల్లితెర నటుడిగా బిజీ బిజీగా ఉన్న మధుబాబు తన గురించి పంచుకున్న ముచ్చట్లివి.

''మంగమ్మగారి మనవరాలు' సీరియల్ వెయ్యికి పైగా ఎపిసోడ్స్‌లో నటించాను. ఆ తర్వాత అభిషేకం సీరియల్ మూడువేలకు పైగా దాటింది. దీంతోపాటు జీ టీవీలో వచ్చే అత్తారింట్లో అక్కాచెల్లెళ్లు, జెమినీలో వచ్చే రెండు రెళ్లు ఆరు సీరియల్స్‌లో నటిస్తున్నాను. అన్ని సీరియల్స్ టాప్ రేటింగ్‌లో నన్ను నిలబెట్టాయి. ఇంతగా బుల్లితెర అభిమానులను సంపాదించుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఎక్కడకు వెళ్లినా నా అసలు పేరు కన్నా సాకేత్ అని పిలిచేవారు. ఆ పేరుతోనే ఇప్పటికీ పిలిచేవారున్నారు.

బీటెక్ చేస్తూ..

పుట్టి పెరిగింది వరంగల్‌లోని హన్మకొండలో. చిన్నప్పటి నుంచి డ్యాన్స్ అంటే పిచ్చి. స్కూల్, కాలేజీల్లో ఏ చిన్న సందర్భం వచ్చినా డ్యాన్స్‌లో ముందుండేవాడిని. హైదరాబాద్‌లో బీటెక్ చేశాను. అమెరికాలో ఉద్యోగం చేయాలనుకున్నాను. కానీ, ఈ ఇండస్ట్రీకి రావాలని ఆలోచనా ఎక్కువ ఉండేది. దానికితోడు స్నేహితుల ప్రోత్సాహం నన్ను 'యంగ్ ఇండియా' సినిమా ఆడిషన్స్‌కు వెళ్లేలా చేసింది. సెలక్ట్ అయ్యాను. ఆ తర్వాత 'పవనిజం' సినిమా చేశాను. ఇప్పుడు 'సత్యాగ్రాహి' సినిమాలోనూ నేనే హీరోని. డ్యాన్స్ బాగా వచ్చినా నటన కోసం రెండు నెలల పాటు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో యాక్టింగ్ నేర్చుకున్నా.

ఉద్యోగం చేయకపోయినా ఏమీ అనలేదు

హైదరాబాద్‌కి వచ్చి పన్నెండేళ్లు అయ్యింది. నేను బీటెక్ చదువుకుని ఉద్యోగం చేయకుండా ఈ ఫీల్డ్‌కి వచ్చినందుకు మా ఇంట్లో వాళ్లు ఎలాంటి అభ్యంతరం పెట్టలేదు. పిల్లల ఇష్టాలకే వదిలేశారు. మా తమ్ముడికి ఆర్ట్ అంటే చాలా ఇష్టం. యానిమేషన్ నేర్చుకొని ఇప్పుడు జాబ్ చేసుకుంటున్నాడు. మాకు ఒక చెల్లి. తను ఇప్పుడు కెనడాలో ఉంటోంది. మా బావ, తను ఇద్దరూ ఫిజియోథెరపిస్టులు. వాళ్లన్నా, వాళ్ల బాబు లక్కీ అన్నా నాకు చాలా ఇష్టం.

మద్యం తెచ్చిన ముప్పు

మా నాన్నగారు రైల్వేలో పనిచేసేవారు. అమ్మ గృహిణి. జాలి గుండె. మా నాన్న మందుకు బానిసవడంతో కుటుంబం మొత్తం చాలా సఫర్ అయ్యాం. ఆ సమయంలో కొండంత అండగా నిలిచి మా బాగోగులు చూసుకున్న దేవతలాంటి మా అమ్మమ్మ మూడేళ్ల క్రితం దేవుడి దగ్గరకు వెళ్లిపోవడంతో ఆమెను బాగా చూసుకోవాలనుకున్న నాకు చాలా బాధగా ఉంది. మా నాన్న తాగుడు వ్యసనం మూలంగా మా బంధువులు మమ్మల్ని చులకనగా చూసేవారు. అలాంటి తండ్రి మీద ఆశ వదిలేసుకోమనేవారు. కానీ, వదిలిపెట్టకుండా కౌన్సెలింగ్ ఇప్పిస్తూ, విరుగుడు మందులు వాడుతూ ఆ మద్యం చెర నుంచి విడిపించి హైదరాబాద్ తీసుకువచ్చాను. మంచి ప్లాట్ కొనుక్కొని అందరం సంతోషంగా ఉన్నాం. ఇప్పుడు అమ్మానాన్నలు నా సీరియల్స్ చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. మా నాన్నలో వచ్చిన ఈ మార్పు చూసి మా బంధువులంతా ఆశ్చర్యపోతుంటారు. గతంలో వెలివేసినట్టుగా చూసిన వారే ఇప్పుడు మమ్మల్ని గౌరవంగా చూస్తున్నారు. వాళ్లు అప్పుడు మమ్మల్ని అలా నిరుత్సాహపరచడం వల్లే మేము పట్టుదలతో ఎదిగాం అనిపిస్తుంది.

చాలా నిరుత్సాహపడ్డాను

టీవీ సీరియల్స్ ద్వారా ఇంత పేరు వస్తుందని మొదట్లో అనుకోలేదు. సినిమాలో నిలదొక్కుకోవడానికి చాలానే ప్రయత్నాలు చేశాను. కానీ, కొన్ని సినిమాలు సగం షూటింగ్‌తోనే ఆగిపోయి చాలా నిరుత్సాహపడ్డాను. ముందుగానే అనుకున్న సీరియల్ ఆఫర్ ఆగిపోయింది. అవకాశాలు లేనప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందో చూశాను. ఓర్పు వహించాను. ఆ తర్వాత ఒకటొకటిగా అవకాశాలు వచ్చాయి. సినిమాల మీద ఉన్న ఇష్టంతో ఆ ప్రయత్నాలూ మానుకోలేదు. పవనిజం తర్వాత ఇప్పుడు సత్యాగ్రాహి సినిమా చేస్తున్నాను.

సంతోషమే బలం

ఇప్పుడు ఇంట్లో అందరం సంతోషంగా ఉన్నాం. మా అమ్మ జీవితంలో చాలా బాధలు పడింది. ఆమెను సంతోషంగా చూసుకోవాలి. మా కుటుంబాన్ని అర్థం చేసుకుని మాతో ఫ్రీగా కలిసిపోయే అమ్మాయి భార్యగా రావాలనుకుంటున్నాను. వస్తున్న అవకాశాలు అందుకుంటూ ఇలా సీరియల్స్, సినిమాలు చేసుకుంటూ రోజులు హ్యాపీగా గడిపేయాలనుకుంటున్నాను.''

– సంభాషణ: **నిర్మలారెడ్డి**

'అత్తారింట్లో అక్కాచెల్లెళ్లు' సీరియల్‌లో...

'మంగమ్మ గారి మనవరాలు' సీరియల్‌లో...

ఫ్యామిలీ డాక్టర్

గ్యాస్ట్రోఎంటరాలజీ కౌన్సెలింగ్స్

కళ్లు మళ్లీ పచ్చగా మారుతున్నాయి

నా వయసు 42 ఏళ్లు. కొన్నాళ్ల కిందట నాకు కామెర్లు వచ్చాయి. అప్పుడు తీవ్రమైన కడుపు నొప్పి కూడా వచ్చింది. ఒళ్లంతా చాలా దురద పెట్టింది. డాక్టర్‌ను సంప్రదిస్తే కొన్ని పరీక్షలు చేసి, గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఉన్నాయని చెప్పారు. ఈఆర్‌సీపీ టెస్ట్ చేసి, స్టెంట్ వేశారు. గత కొద్దిరోజుల నుంచి కళ్లు మళ్లీ పచ్చబడుతున్నాయి. జ్వరం వస్తోంది. నా లక్షణాలను అధ్యయనం చేసి, నాకు తగిన సలహా ఇవ్వగలరు.

- ఆర్. అక్షయ్‌కుమార్, సికింద్రాబాద్

మీరు గాల్‌స్టోన్స్‌తో పాటు సీబీడీ స్టోన్స్ అనే సమస్యలతో బాధపడుతున్నారు. మీకు ఇటీవల వేసిన బిలియరీ స్టెంట్ మూసుకుపోయి ఉండవచ్చు. దాంతో మీకు కామెర్లు, జ్వరం వస్తున్నాయి. మీరు మళ్లీ వీలైనంత త్వరగా ఈఆర్‌సీపీ పరీక్ష చేయించుకోండి. దీనివల్ల మీకు సీబీడీలో రాళ్లు ఉన్నా తొలగించడానికి వీలవుతుంది. అలాగే మూసుకుపోయిన స్టెంట్ స్థానంలో కొత్త స్టెంట్ కూడా అమర్చవచ్చు. ఈఆర్‌సీసీ తర్వాత మీరు లాపరోస్కోపీ ద్వారా గాల్ బ్లాడర్‌ను తొలగించుకోవాల్సి ఉంటుంది. లేకపోతే ఇదే సమస్య మళ్లీ మళ్లీ వచ్చే అవకాశం ఉంది.

ఫ్యాటీ లివర్ అంటే..?

నా వయసు 49 ఏళ్లు. ఇటీవల టోటల్ బాడీ జనరల్ హెల్త్ చెకప్ చేయించుకున్నాను. పరీక్షల ఫలితాలు చూసి డాక్టర్ నాకు ఫ్యాటీలివర్ ఉన్నట్లు చెబుతున్నారు. ఫ్యాటీ లివర్ అంటే ఏమిటి? నేను తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించండి.

- సీహెచ్. రమేశ్‌కుమార్, వరంగల్

మన దేహంలోని కొవ్వు పదార్థాలను గ్రహించిన కాలేయం... వాటిని మన శరీరానికి ఉపయోగపడేలా చేస్తుంది. ఇది ఒక సంక్లిష్టమైన జీవప్రక్రియ (మెటబాలిక్ యాక్టివిటీ). ఇందులో ఏమాత్రం తేడా వచ్చినా... కాలేయం ద్వారా కొవ్వు తాలూకు జీవక్రియలు సక్రమంగా జరగకపోగా... ఆ కొవ్వులన్నీ కాలేయంలోనే చేరుతుంటాయి. దాని వల్ల కాలేయంలో కొవ్వు చేరి... ఫ్యాటీలివర్ అనే కండిషన్‌కు దారితీస్తుంది. ఇది రెండు కారణాల వల్ల వస్తుంది. మొదటిది మద్యం ఎక్కువగా తీసుకోవడం, రెండోది మద్యం అలవాటుకు సంబంధం లేని ఇతర కారణాలు. ఇందులోకి స్థూలకాయం, డయాబెటిస్, అధిక కొలెస్ట్రాల్, హైపోథైరాయిడిజమ్ వంటివీ వస్తాయి. సాధారణంగా ఫ్యాటీలివర్ సమస్య ఉన్నవారిలో ఎలాంటి లక్షణాలు బయటకు కనిపించవు. కేవలం అల్ట్రాసౌండ్ స్కానింగ్ (కడుపు భాగం) , కాలేయ సంబంధ పరీక్షలు చేయించుకున్నప్పుడు ఈ సమస్య బయటపడుతుంది. ఇలా ఆ పరీక్షల ద్వారా కాలేయ కణాల్లో కొవ్వు చేరిందని తెలుసుకున్నప్పుడు దాన్ని ఫ్యాటీలివర్‌గా గుర్తిస్తారు. సాధారణంగా ఫ్యాటీలివర్ సమస్యవల్ల 80 శాతం మందిలో ఎలాంటి ప్రమాదమూ ఉండదు. అయితే 20 శాతం మందిలో అది రెండో దశకు చేరుకోవచ్చు. ప్రధానంగా ఇది మెటబాలిక్ సిండ్రోమ్ అనే సమస్యకు కారణమై... గుండెకు, మెదడుకు సంబంధించిన ప్రమాదాలకు దారితీసే ప్రమాదం ఉంది. మీకు ఫ్యాటీలివర్ ఉందని నిర్ధారణ అయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీకు దగ్గర్లోని డాక్టర్‌ను సంప్రదించి, అవసరమైన పరీక్షలు చేయించుకొని, దానికి కారణాలను కనుగొని, తగిన మందులు వాడాల్సి ఉంటుంది. కొవ్వు పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం తగ్గించాలి. మామూలుగా మధ్యవయసులో ఉన్నవారికి చాలా పరిమితమైన కొవ్వులు సరిపోతాయి. ఇక జంతుసంబంధమైన కొవ్వులను చాలా తక్కువ మోతాదులో తీసుకోవాలి. ఒకవేళ మీకు మద్యం అలవాటు ఉంటే పూర్తిగా మానేయాలి. మీరొక సారి మీకు దగ్గరలోని గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌ను సంప్రదించండి.

కడుపులోకి నీరు చేరుతోంది

నాకు ఈ మధ్య కడుపులో నీరు చేరుతోంది. కాళ్లు కూడా వాస్తున్నాయి. డాక్టర్‌ను సంప్రదిస్తే కొన్ని టాబ్లెట్స్ ఇచ్చారు. మొదట్లో సమస్య కాస్త తగ్గింది గానీ... మళ్లీ అది తిరగబెడుతోంది. నేను రోజూ పరిమితంగా ఆల్కహాల్ తీసుకుంటూ ఉంటాను. నాకు తగిన సలహా ఇవ్వండి.

- డి. నర్సింగ్, సిద్ధిపేట

కడుపులో నీరు రావడం, కాళ్ల వాపులు వంటి లక్షణాలను బట్టి మీకు లివర్, కిడ్నీ లేదా గుండెజబ్బు ఉన్నట్లుగా అనుమానించాల్సి ఉంటుంది. అయితే మీరు ఆల్కహాల్ తీసుకునే అలవాటు ఉందంటున్నారు కాబట్టి మీరు ఒకసారి తప్పకుండా కడుపు స్కానింగ్, లివర్ ఫంక్షన్ పరీక్ష, కిడ్నీ ఫంక్షన్ పరీక్ష, కడుపులో నీటి పరీక్ష వంటివి చేయించుకోవాలి. మీ టెస్ట్ రిపోర్టులో వచ్చిన ఫలితాల ఆధారంగా మీకు చికిత్స అందించడం జరుగుతుంది. మీరు వీలైనంత త్వరగా మీకు దగ్గర్లోని గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌ను కలవండి.

డాక్టర్ భవానీరాజు, సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, బంజారా హాస్పిటల్స్, కేర్ హాస్పిటల్స్, హైదరాబాద్

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
బుధవారం
11-03-2020

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

స్టార్టప్ ఇండియా టు టు

ఇంటర్ నుంచి ఇంజనీరింగ్ వరకు.. బీపీ నుంచి ఎంబీపీ దాకా.. ఏ కోర్సు పూర్త వుతున్నా.. కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అడిగే కామన్ ప్రశ్న.. తర్వాత ఏంటి..? అని!! ఇంజనీరింగ్, ఎంబీపీ విద్యార్థుల్లో చాలా మంది ఇప్పుడీ ప్రశ్నకు 'స్టార్టప్ పెడతా' అంటూ.. సమాధానం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో.. స్టార్టప్ ఔత్సాహికులకు ఉపయోగపడేలా.. ప్రస్తుతం దేశంలో స్టార్టప్ వాతావరణం.. స్టార్టప్‌లకు చేయూతనిస్తున్న ప్రభుత్వ పథకాలు.. అనుకూలమైన రంగాలపై ప్రత్యేక కథనం..

» స్వయం ఉపాధి దిశగా యువత ఆలోచనలు
» దన్నుగా నిలుస్తున్న పలు ప్రభుత్వ పథకాలు

కెరీర్ కౌన్సెలింగ్

» జేఎన్‌టీయూ అనంతపురం నుంచి సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. యాప్ డవలప్‌మెంట్‌లో కెరీర్ కోరుకుంటున్నాను. యాప్ డవలపర్‌గా మారేందుకు అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవడం ఎలాగో తెలపండి? –షరీఫ్

✦ ప్రస్తుతం చదివిన డొమైన్‌తో సంబంధం లేకుండా.. అన్నిరకాల కోర్సులు పూర్తిచేసిన వారికి చక్కటి ఉపాధి కల్పిస్తున్న విభాగం.. మొబైల్ యాప్ డెవలప్‌మెంట్. పెరుగుతున్న స్మార్ట్‌ఫోన్స్ వినియోగం.. మొబైల్ గేమ్స్‌కు యువత ఆదరణతోపాటు.. యాప్ ఆధారిత సేవలవైపు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్న నేపథ్యంలో యాప్ డెవలపర్స్‌కు మంచి డిమాండ్ నెలకొంది. దీనికి సంబంధించి ప్రత్యేక కోర్సులు, శిక్షణ ద్వారానే యాప్ డెవలప్‌మెంట్ నైపుణ్యాలు సొంతమవుతాయి. ముఖ్యంగా యాప్ డెవలప్‌మెంట్ విభాగంలో కెరీర్ ప్రారంభించాలనుకుంటే.. సీ,సీ++,ఆబ్జెక్టివ్ సి వంటి కంప్యూటర్ లాంగ్వేజ్‌ల ప్రోగ్రామింగ్ స్కిల్స్ ఎంతో ముఖ్యం.

✦ ప్రస్తుతం ట్రిపుల్ ఐటీలు, ఐఐటీలు, ఎన్ఐటీలు సహా పలు ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు యాప్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన కోర్సులను అందిస్తున్నాయి. వీటితోపాటు పలు ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్స్ సైతం యాప్ డెవలప్‌మెంట్‌పై శిక్షణనిస్తున్నాయి. ఉడెమీ, ఎడ్యురేక, ఎడెక్స్ తదితర ఆన్‌లైన్ లెర్నింగ్ పోర్టల్స్‌లో సైతం ఆన్‌లైన్ విధానంలో మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అదే విధంగా గూగుల్, ఒరాకిల్ సంస్థలు అందిస్తున్న సర్టిఫికేషన్ కోర్సులు కూడా పూర్తి చేయొచ్చు. వీటిని పూర్తి చేసుకుంటే మరిన్ని అవకాశాలు లభిస్తాయి.

✦ ఈ రంగంలో రాణించేందుకు.. సాంకేతిక నైపుణ్యాలతోపాటు క్రియేటివిటీ, అడాప్టబిలిటీ స్కిల్స్ కూడా ఉండాలి. అప్పుడే వినియోగదారుల అవసరాలు, మార్కెట్‌లో నెలకొన్న డిమాండ్‌కు అనుగుణంగా యాప్స్‌ను డెవలప్ చేసే నైపుణ్యం లభిస్తుంది.

✦ నైపుణ్యాలున్న అభ్యర్థులకు నెలకు రూ.18వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం అందుతోంది. స్వయం ఉపాధి కోణంలోనూ యాప్ డెవలపర్స్‌కు అవకాశాలు విస్తృతం. సొంతంగా యాప్‌ను రూపొందించే ముందు దానికి సంబంధించి మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకోవాలి. ఫ్రీలాన్సింగ్ విధానంలో పనిచేస్తూ ఆదాయం పొందే అవకాశం ఉంది.

కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ గతేడాది విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం– స్థాపించి/నమోదుచేసుకొని పదేళ్లలోపు ఉన్న, ఏ ఆర్థిక సంవత్సరంలోనూ రూ.100 కోట్ల టర్నోవర్ దాటని ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ లేదా పార్టనర్‌షిప్ కంపెనీ లేదా లిమిటెడ్ లయబిలిటీ కంపెనీలను స్టార్టప్‌లుగా వ్యవహరిస్తారు. కొన్నేళ్లలో ఎప్పుడూ లేనంతగా ప్రముఖ రంగాలు నేల చూపు చూస్తుండటంతో.. ప్రస్తుతం స్టార్టప్ భవిష్యత్‌పై సర్వత్రా చర్చ జరుగుతోంది.

భారత్ భేష్!

స్టార్టప్‌లకు భారత్ అనుకూలమైన దేశంగా నిలుస్తోంది. నాస్కామ్ నివేదిక ప్రకారం–స్టార్టప్‌లకు అనుకూల వాతావరణం విషయంలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. 2014–2019 మధ్య కాలంలో దేశంలో 8,900–9,300 స్టార్టప్‌లు ఏర్పాటయ్యాయి. ఇందులో ఒక్క 2019లో ఏర్పాటైనవి 1300. అదేవిధంగా గతేడాది జనవరి–సెప్టెంబర్ మధ్యకాలంలో స్టార్టప్‌లు 60,000 ఉద్యోగాలు కల్పించాయి. దీంతోపాటు మరో 1.3–1.8 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు అందించాయి. ఇదే కాలానికి స్టార్టప్‌లు అందుకున్న ఫండింగ్ 4.4 బిలియన్లు కావడం గమనార్హం.

బడ్జెట్ భరోసా

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2020–2021 బడ్జెట్‌లో స్టార్టప్‌లకు ప్రోత్సాహకాలను ప్రకటించారు. ఇందులో స్టార్టప్‌లకు కొత్త స్లాబ్ రేటు, ఎంప్లాయి స్టాక్ ఆప్షన్ ప్లాన్(ఈఎస్‌వోపీ)పై ట్యాక్స్ చెల్లింపు, డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ రద్దు, సావరిన్ వెల్త్ ఫండ్(ఎస్‌డబ్ల్యూఫ్)పై 100 శాతం ట్యాక్స్ మినహాయింపు, రూ.100 కోట్ల టర్నోవర్ కలిగిన స్టార్టప్ కంపెనీలకు 100 శాతం ట్యాక్స్ తగ్గింపు, ఎంఎస్ఎంఈ కంపెనీల ఆడిట్‌ను రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంపు, డిపాజిట్ ఇన్సూరెన్స్‌ను రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంపు, క్వాంటమ్ టెక్నాలజీతోపాటు ఇతర కంపెనీలకు సంబంధించిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పై రూ.100కోట్ల కేటాయింపు తదితరాలు కీలకంగా నిలుస్తున్నాయి. దీంతోపాటు ఆర్థిక మంత్రి నూతనంగా ఏర్పాటైన స్టార్టప్ కంపెనీలకు సీడ్ ఫండ్‌ను ప్రకటించారు. తద్వారా భారత్‌లో స్టార్టప్‌ల ఏర్పాటుకు మరింత సానుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

పీఎంఈజీపీ

✦ స్టార్టప్‌లను ప్రారంభించాలనుకొనే వారికి ప్రభుత్వ పరంగా అందుబాటులో ఉన్న ప్రధాన రుణ సదుపాయ పథకం...ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్(పీఎంఈజీపీ). ఈ పథకం కింద తయారీ రంగ స్టార్టప్‌లకు రూ.25 లక్షలు, సేవల రంగ స్టార్టప్‌లకు రూ.10లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తారు. మొత్తం రుణంలో 25–30 శాతం మేర సబ్సిడీ సదుపాయం కూడా ఉంటుంది. అంటే.. రుణం పొందిన వారు ఆ మొత్తం తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు.

✦ ఈ రుణం పొందేందుకు ప్రాజెక్టు డాక్యుమెంట్ » ఉద్యోగాల కల్పన » మార్కెట్ రీసెర్చ్ » ఆధార్‌కార్డు నంబర్ » ట్యాక్స్ డిడక్షన్ అండ్ కలెక్షన్ అకౌంట్ నంబర్(టాన్ నంబర్) » కంపెనీ పాన్ నంబర్ » కార్పొరేట్ ఐడెంటిఫికేషన్ నంబర్ (సీఐఎన్ నంబర్) » బ్యాంకు వివరాలు అందించాల్సి ఉంటుంది.

✦ రుణానికి దరఖాస్తు చేసుకోవాలనుకొనేవారు మొదట ప్రాజెక్టు డాక్యుమెంట్‌ను రూపొందించుకోవాలి. ఇన్వెస్ట్‌మెంట్ వివరాలతోపాటు కంపెనీకి సంబంధించిన పూర్తి వివరాలను అందులో పేర్కొనాలి. అలాగే మార్కెట్ రీసెర్చ్ ద్వారా రాబోయే మూడేళ్ల నుంచి ఐదేళ్లలో బిజినెస్‌పై పరికరాలు, ఎక్విప్‌మెంట్, సేవలపై చేసే ఖర్చులు... తిరిగి పొందే రాబడి వివరాలతో ప్రాజెక్టు రిపోర్టును రూపొందించుకోవాలి.

✦ వెబ్‌సైట్: www.kviconline.gov.in

స్టాండప్ ఇండియా

ప్రత్యేకించి వెనుకబడిన వర్గాలను ప్రోత్సహించే ఉద్దేశంతో స్టాండప్ ఇండియా పథకాన్ని ప్రవేశపెట్టారు. దీని కింద ఎస్సీ, ఎస్టీ వర్గాలతోపాటు మహిళలకు రుణ సదుపాయం కల్పిస్తారు. ఇతర జనరల్ కేటగిరీలకు చెందిన వారు ఎస్సీ, ఎస్టీ, మహిళా భాగస్వాములతో కలిసి స్టాండప్ ఇండియా పథకంలో రుణం పొందవచ్చు. సదరు భాగస్వామికి కంపెనీలో 51శాతం వాటా ఉండాలి. ఈ పథకం కింద రూ.90 పైసల నుంచి రూ.1 వడ్డీతో రూ.10 లక్షల నుంచి రూ.1 కోటి వరకు రుణం మంజూరు చేస్తారు. కొత్తగా స్టార్టప్‌ను ప్రారంభించిన వారంతా స్టాండప్ ఇండియా లోన్‌కు వెళ్లొచ్చు. కొత్తలో వెళితే లోన్ మొత్తం తక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి కంపెనీ పెట్టిన ఏడాదికి కంపెనీ విస్తరణకు లోన్‌కు వెళితే అధిక మొత్తం చేతికందుతుంది. స్టాండప్ ఇండియా పథకం కింద రుణం పొందేందుకు కంపెనీ రిజిస్ట్రేషన్ వివరాలు, కంపెనీ పాన్, ట్యాన్, సీఐఎన్ వివరాలు, ప్రాజెక్టు రిపోర్టు తదితరాలను అందించాల్సి ఉంటుంది. ఆర్‌బీఐ ప్రకటించిన 27 షెడ్యూల్ బ్యాంకుల నుంచి స్టాండప్ ఇండియా రుణాలు పొందవచ్చు. స్టాండప్ ఇండియా హెల్ప్ సెంటర్‌తోపాటు చార్టెడ్ అకౌంటెంట్‌లను సంప్రదించి కంపెనీ డాక్యుమెంటేషన్‌ను పూర్తి చేసుకోవచ్చు.

✦ వెబ్‌సైట్: www.standupmitra.in

ముద్ర యోజన

2015లో ప్రధానమంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై) పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా వ్యక్తులు, సంస్థలు మూడు రకాల రుణాలను పొందవచ్చు. కమర్షియల్ బ్యాంకులు, ఆర్ఆర్‌బీలు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాలను అందిస్తాయి. వెబ్‌సైట్ డెవలప్‌మెంట్ కంపెనీలు, మొబైల్ షాపులు, బ్రిక్ తయారీలకు సంబంధించి వ్యక్తులకు ముద్ర రుణాలను అందిస్తారు. ఇతర చిన్నతరహా పరిశ్రమలు ముద్ర రుణాలు పొందవచ్చు. ఈ రుణాల మంజూరు పూర్తిగా బ్యాంకుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి ముద్ర రుణాలు పొందాలనుకొనే వారు వ్యాపారానికి సంబంధించి పూర్తి వివరాలతో బ్యాంకులను సంప్రదించాలి. పొందిన రుణం మొత్తం ఆధారంగా రుణ చెల్లింపు వ్యవధిని నిర్ణయిస్తారు.

✦ **ముద్ర స్టార్టప్ లోన్ రకాలు:** **శిశు:** రూ. 50,000; **కిశోర్:** రూ.50,000 నుంచి రూ.5 లక్షలు; **తరుణ్:** రూ.5 లక్షలు–రూ.10 లక్షలు.

✦ వెబ్‌సైట్: www.mudra.org.in

ప్రయివేటు ఫండింగ్

ఏంజెల్ ఫండ్

స్టార్టప్‌ల్లో పెట్టుబడులు పెట్టే వ్యక్తులు లేదా కంపెనీలను ఏంజెల్ ఇన్వెస్టర్లుగా పిలుస్తారు. సెబి.. ఏంజెల్ ఇన్వెస్ట్‌మెంట్‌ను వెంచర్ క్యాపిటల్ ఉప వర్గంగా పేర్కొంది. ఈ విధానంలో యూనిట్ల(ఈక్విటీ) జారీ ద్వారా మాత్రమే నిధులు సేకరించే వీలుంది. దీంతోపాటు పది కోట్ల రూపాయల కార్పస్ తప్పనిసరి. ఏంజెల్ ఫండ్స్ మూడు సంవత్సరాల వ్యవధిలోనే పొందే అవకాశం ఉంటుంది. » ప్రారంభించి 3ఏళ్లు దాటని కంపెనీలు మాత్రమే ఏంజెల్ ఇన్వెస్ట్‌మెంట్ పొందగలవు. » టర్నోవర్ రూ. 25 కోట్లకు మించరాదు. » ఏంజెల్ ఇన్వెస్టర్లు అసోసియేట్స్‌లో పెట్టుబడి పెట్టలేరు. మొత్తం పెట్టుబడులలో 25 శాతానికి మించి వారు అన్ని పథకాల కింద ఒక వెంచర్ క్యాపిటల్ అండర్ టేకింగ్‌లో పెట్టుబడి పెట్టలేరు. ఇంకా, ఏంజెల్ ఫండ్ ద్వారా పెట్టుబడిదారుడి సంస్థలో పెట్టుబడి రూ. 50 లక్షలు, రూ.5కోట్లు, కనీసం 3 ఏళ్ల కాలానికి నిర్వహించాల్సిన అవసరం ఉంది.

క్రౌడ్ ఫండింగ్

ఒక ప్రాజెక్ట్ లేదా వెంచర్‌కు ఇంటర్నెట్, ఇతర నెట్‌వర్కింగ్ వేదికలను ఉపయోగించి పెద్ద సంఖ్యలో ప్రజల నుంచి డబ్బును సేకరించడాన్ని క్రౌడ్ ఫండింగ్ అంటారు. ఈ విధానంలో చిన్న చిన్న మొత్తాలను కూడా పెట్టుబడిగా స్వీకరిస్తారు. లాభదాయక, కళాత్మక, సృజనాత్మక ప్రాజెక్టులు, సమాజ–ఆధారిత సామాజిక వ్యవస్థాపిత ప్రాజెక్టులకు క్రౌడ్ ఫండింగ్ విధానం చక్కగా సరితూగుతుంది.

అనుకూల రంగాలు

భారత్‌లో పలు రంగాల్లో స్టార్టప్‌లకు విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అవి.. » హెల్త్‌కేర్ సెక్టార్ » పేమెంట్స్(ఆన్‌లైన్ /ఈకామర్స్/ఆఫ్‌లైన్ ఇంటిగ్రేషన్) » రిటైల్(షాపర్ స్టార్ట్స్/కస్టమర్ ఎక్స్‌పీరియెన్సెస్‌కు సంబంధించిన ఆడిట్ సంస్థలు).

మంచి టీమ్ ఉండాలి

స్టార్టప్ ప్రారంభించాలనుకొనే వారు ముందు టీమ్‌పై దృష్టిసారించాలి. మంచి టీమ్, బిజినెస్ అవకాశం ఉన్నప్పుడే ఫండింగ్ సులభంగా లభిస్తుంది. స్టార్టప్ కంపెనీ పెట్టిన వారు మొదట్లో పొరపాట్లు చేయకుండా జాగ్రత్త పడాలి. కంపెనీ ఏర్పాటుకు సంబంధించి భవనాలు, ఇతర సౌకర్యాలపై ఎక్కువగా వెచ్చించడం సరి కాదు. అలాగే పెద్ద మొత్తంలో జీతాలు కోరుకునే వారికంటే.. తక్కువ వేతనంతో బాగా పనిచేయగలిగేవారిని ఎంపికచేసుకోవాలి. కంపెనీతో దీర్ఘకాలం ప్రయాణించేవారిని ఉద్యోగులుగా నియమించుకోవడం లాభిస్తుంది. ఖర్చులు, పెట్టుబడి విషయంలో తెలివిగా వ్యవహరించాలి. స్టార్టప్‌లు సాధ్యమైనంత పొదుపు పాటించి... రెండేళ్లలో నిలదొక్కుకొనేలా ప్రయత్నించాలి.

రామ్ గొల్లమూడి, స్టార్టప్ నిపుణుడు

జాబ్ పాయింట్

అప్రెంటిస్

బీఎస్ఎన్ఎల్-100

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) తెలంగాణ సర్కిల్ కింద 100 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగం:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్–100 (గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–75, టెక్నికల్ (డిప్లొమా) అప్రెంటిస్–25)
- **కాల వ్యవధి:** ఏడాది
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా (ఇంజనీరింగ్), ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 16, 2020
- **ఇంటర్వ్యూ తేదీ:** మార్చి 19, 2020
- **వెబ్‌సైట్:** http://portal.mhrdnats.gov.in

ఈసీఐఎల్-45

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్).. 45 గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్ (సీఎస్ఈ, ఈసీఈ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష/డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 16, 2020
- **వెబ్‌సైట్:** www.ecil.co.in

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
MATHEMATICS

ఎన్ఎల్‌సీ-56

తమిళనాడులోని భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎల్‌సీ).. 56 ఇండస్ట్రియల్ ట్రెయినీ (ఫైనాన్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా/ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత.
- **వయసు:** మార్చి 1, 2020 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** సీఏ/సీఎంఏ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 26, 2020
- **వెబ్‌సైట్:** www.nlcindia.com

ఐజీసీఏఆర్-30

కల్పకంలోని భారత ప్రభుత్వ అణుశక్తి విభాగానికి చెందిన ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ (ఐజీసీఏఆర్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 30 జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **ఎంపిక:** రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 16, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 3, 2020
- **పరీక్ష తేదీ:** మే 3, 2020
- **వెబ్‌సైట్:** www.igcar.gov.in

హెచ్ఎస్ఎల్-51

విశాఖపట్నంలోని భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(హెచ్ఎస్ఎల్)..వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 51 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** డిజైనర్–13, జూనియర్ సూపర్‌వైజర్–23, ఆఫీస్ అసిస్టెంట్–9, జూనియర్ ఫైర్ ఇన్‌స్పెక్టర్–4, డ్రైవర్–2.
- **అర్హత:** పోస్టులను బట్టి పదోతరగతి, సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా (ఇంజనీరింగ్), గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 25–30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 7, 2020
- **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** ఏప్రిల్ 14, 2020
- **వెబ్‌సైట్:** www.hslvizag.in

ఏఐఐఎస్‌హెచ్-21

మైసూర్‌లోని భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన ఆలిండియా ఆన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ (ఏఐఐఎస్‌హెచ్) ఒప్పంద ప్రాతిపదికన 21 స్పీచ్ అండ్ హియరింగ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా/తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష/ప్రాక్టికల్ స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 20, 2020
- **వెబ్‌సైట్:** https://aiishmysore.in

ఈసీఐఎల్-23

హైదరాబాద్‌లోని భారత ప్రభుత్వ అణుశక్తి విభాగానికి చెందిన ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 23 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్,సీనియర్ మేనేజర్, పర్సనల్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్ తదితర పోస్టులున్నాయి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 11, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 10, 2020
- **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** ఏప్రిల్ 17, 2020
- **వెబ్‌సైట్:** www.ecil.co.in

ఎన్ఐడీ-18

భోపాల్ (మధ్య ప్రదేశ్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 18 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అడ్మిన్ ఆఫీసర్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్ లైబ్రేరియన్, సీనియర్ సూపరింటెండెంట్ తదితర పోస్టులున్నాయి.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేట్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, కంప్యూటర్ నాలెడ్జ్, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** స్క్రీనింగ్ టెస్ట్, ట్రేడ్/స్కిల్ టెస్ట్, రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** గ్రూప్–ఏ పోస్టులకు రూ.1000; గ్రూప్–బీ, సీ పోస్టులకు రూ.500.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 31, 2020
- **వెబ్‌సైట్:** www.nidmp.ac.in

సెబీ-147

భారత ప్రభుత్వ సంస్థ అయిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) 147 ఆఫీసర్ గ్రేడ్–ఏ (అసిస్టెంట్ మేనేజర్) పోస్టుల భర్తీకి వాక్‌ఇన్ నిర్వహిస్తోంది.

- **విభాగాలు:** జనరల్ స్ట్రీమ్, లీగల్ స్ట్రీమ్, ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ స్ట్రీమ్ తదితరాలు.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత విభాగాల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, సీఏ/సీఎస్/ సీఎఫ్ఏ/సీడబ్ల్యూఏ, మాస్టర్స్ డిగ్రీ, ఎంసీఏ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **వయసు:** ఫిబ్రవరి 29, 2020 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 23, 2020
- **వెబ్‌సైట్:** www.sebi.gov.in

పవర్‌గ్రిడ్-25

భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ 25 ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ (ఫైనాన్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సీఏ/ఐసీడబ్ల్యూఏ (సీఎంఏ) ఉత్తీర్ణత.
- **వయసు:** ఏప్రిల్ 6, 2020 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** రాతపరీక్ష (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), గ్రూప్ డిస్కషన్, బిహేవియరల్ అసెస్‌మెంట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 7, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 6, 2020
- **వెబ్‌సైట్:** http://powergridindia.com

బ్యాంక్ ఆఫ్ బరోడా-39

వడోదర ప్రధాన కేంద్రంగా ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 39 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** టెక్నాలజీ ఆర్కిటెక్ట్, ప్రోగ్రామ్ మేనేజర్, డేటాబేస్ ఆర్కిటెక్ట్, బిజినెస్ అనలిస్ట్ లీడ్, డేటా అనలిస్ట్, డేటా ఇంజనీర్, ఇంటిగ్రేషన్ ఎక్స్‌పర్ట్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 25–45 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్/క్వాలిఫయింగ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.600
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 27, 2020
- **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

సాక్షి స్పోర్ట్స్
బుధవారం
11-3-2020

"కోవిడ్-19 వైరస్ ప్రస్తుతం భారత్‌తోపాటు చాలా దేశాల్లోనూ ఉంది. ఈ నేపథ్యంలో ఈసారి ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో కరచాలనం చేయను. నమస్తే మాత్రమే చేస్తాను. మనం మన జాగ్రత్తలో ఉండాలి. మన ఆరోగ్యంపై అదనంగా శ్రద్ధ తీసుకోవాలి. పలువురు భారత ఆటగాళ్లతోపాటు ఇతర దేశాల ప్లేయర్లు ఈ టోర్నీ నుంచి వైదొలిగిన సంగతి తెలుసు. ఈసారి ఆల్ ఇంగ్లండ్ టోర్నీకి సన్నాహాలు బాగున్నాయి. గొప్ప టోర్నమెంట్‌లలో ప్రతీ మ్యాచ్ కఠినంగానే ఉంటుంది. తమదైన రోజున ఎవరు బాగా ఆడితే వారినే విజయం వరిస్తుంది. – పీవీ సింధు

ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ తొలి రౌండ్ మ్యాచ్‌లు నేటి మధ్యాహ్నం గం. 2.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-3లో ప్రత్యక్ష ప్రసారం

ఈసారైనా సాధించేనా!

నేటి నుంచి ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ

బరిలో సింధు, సైనా, శ్రీకాంత్, సాయిప్రణీత్

తొలి రౌండ్‌లోనే క్లిష్టమైన ప్రత్యర్థులతో 'ఢీ'

కోవిడ్-19 నేపథ్యంలో వైదొలిగిన ఏడుగురు భారత ఆటగాళ్లు

సింగిల్స్ విజేతలకు రూ. 57 లక్షల చొప్పున ప్రైజ్‌మనీ

గతేడాది విశ్వ విజేతగా అవతరించి అంద రిచేతా శభాష్ అనిపించుకోవడంతోపాటు విమర్శ కుల నోళ్లు మూయించిన తెలుగు తేజం, భారత స్టార్ షట్లర్ పూసర్ల వెంకట (పీవీ) సింధు కొత్త ఏడాదిలో తొలి టైటిల్ కోసం వేట మొదలు పెట్టనుంది. బ్యాడ్మింటన్‌లో అతి పురాతనమైన, అత్యంత ప్రతిష్టాత్మక టోర్నీగా భావించే ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టోర్నమెంట్‌లో టైటిల్ నెగ్గడమే లక్ష్యంగా 24 ఏళ్ల సింధు బరిలోకి దిగనుంది. ఈ సీజన్‌లో మలేసియా మాస్టర్స్, ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీల్లో ఆడిన ఈ ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని దాటలేకపోయింది. ఈ రెండు టోర్నీల తర్వాత దాదాపు 50 రోజుల విరామం లభించడంతో సింధు ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌కు పకడ్బందీగా సిద్ధమైంది. కోవిడ్-19 వైరస్ నేపథ్యంలో పలువురు సహచర క్రీడాకారులు ఈ టోర్నీ నుంచి వైదొలిగినా సింధు మాత్రం ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌కు సమాయత్తమయింది. సింధుతోపాటు మాజీ రన్నరప్ సైనా నెహ్వాల్... పురుషుల సింగిల్స్‌లో మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్, పారుపల్లి కశ్యప్ ఈ మెగా టోర్నమెంట్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

బర్మింగ్‌హామ్: పద్దెనిమిదేళ్లుగా భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఊరిస్తోన్న ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టైటిల్‌ను సాధించాలనే తపనతో మరోసారి మనోళ్లు సమాయత్తమయ్యారు. నేటి నుంచి మొదలయ్యే ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నమెంట్‌లో సింధుతోపాటు సైనా, శ్రీకాంత్, సాయిప్రణీత్, కశ్యప్, లక్ష్య సేన్ సింగిల్స్ బరిలో ఉన్నారు. ముందుగా ఎంట్రీలు పంపించినా... కోవిడ్-19 వైరస్ నేపథ్యంలో ఏడుగురు భారత ఆటగాళ్లు (సింగిల్స్‌లో ప్రణయ్, సమీర్ వర్మ, సౌరభ్ వర్మ; డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి; సుమీత్ రెడ్డి-మనూ అత్రి జోడీలు) ఈ టోర్నీ నుంచి వైదొలిగారు. శతాబ్దంకంటే ఎక్కువ చరిత్ర ఉన్న ఈ టోర్నీలో భారత్ నుంచి ఇద్దరు మాత్రమే చాంపియన్స్‌గా నిలిచారు. ప్రకాశ్ పదుకొనే (1980లో), పుల్లెల గోపీచంద్ (2001లో) ఈ ఘనత వహించారు. 2001 తర్వాత 2015లో సైనా నెహ్వాల్ మాత్రమే ఒకసారి ఫైనల్‌కు చేరుకొని తుది మెట్టుపై తడబడి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది.

తొలి రౌండ్‌లోనే...

110వ సారి నిర్వహిస్తున్న ఈ టోర్నీలో ఈసారి భారత క్రీడాకారులకు క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ చాంపియన్ పీవీ సింధు తొలి రౌండ్‌లో చైనా సంతతికి చెందిన అమెరికా ప్లేయర్ బీవెన్ జాంగ్‌తో... ప్రపంచ మూడో ర్యాంకర్ అకానె యామగుచి (జపాన్)తో సైనా నెహ్వాల్ తలపడనున్నారు. గెలుపోటముల ముఖాముఖి రికార్డులో సింధు 5-4తో ఆధిక్యంలో ఉండగా... సైనా మాత్రం 2-8తో వెనుకబడి ఉంది. ఒకవేళ సింధు, సైనా తొలి రౌండ్ అడ్డంకి దాటినా తర్వాత రౌండ్‌లలో వీరిద్దరికి క్లిష్టమైన ప్రత్యర్థులే ఎదురుకానున్నారు. సింధు తొలి రౌండ్‌లో గెలిస్తే ప్రిక్వార్టర్ ఫైనల్లో సుంగ్ జీ హున్ (కొరియా) లేదా నిచావోన్ జిందాపోల్ (థాయ్‌లాండ్) ఎదురుపడతారు. ఇందులోనూ గెలిస్తే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మాజీ చాంపియన్ నొజోమి ఒకుహారాతో సింధు ఆడే అవకాశం ఉంటుంది. సెమీఫైనల్లో వరల్డ్ నంబర్‌వన్ చెన్ యుఫె (చైనా) లేదా ప్రపంచ మాజీ చాంపియన్ రచనోక్ (థాయ్‌లాండ్) సింధుకు ఎదురుకావొచ్చు. మరోవైపు సైనా తొలి రౌండ్‌ను దాటితే ప్రిక్వార్టర్ ఫైనల్లో సయాక తకహాషి (జపాన్), క్వార్టర్ ఫైనల్లో రియో ఒలింపిక్స్ చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్)... సెమీఫైనల్లో రెండో సీడ్ తై జు యింగ్ (చైనీస్ తైపీ) లేదా ఏడో సీడ్ హి బింగ్‌జియావో (చైనా) ప్రత్యర్థులుగా ఉంటారు. ఈ నేపథ్యంలో ఈసారైనా సింధు, సైనా అద్భుతం చేస్తారో లేదో వేచి చూడాలి.

శ్రీకాంత్ గాడిలో పడేనా!

కొంతకాలంగా ఫామ్ కోల్పోయి తడబడుతోన్న ప్రపంచ మాజీ నంబర్‌వన్, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్‌కు తొలి రౌండ్‌లోనే రియో ఒలింపిక్స్ చాంపియన్ చెన్ లాంగ్ (చైనా) ఎదురుకానున్నాడు. ఈ ఏడాది శ్రీకాంత్ నాలుగు టోర్నీలు ఆడగా మూడింటిలో తొలి రౌండ్‌లోనే ఓడిపోయి, మరో టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించాడు. గతేడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గిన భమిడిపాటి సాయిప్రణీత్ తొలి రౌండ్‌లో జావో జున్‌పెంగ్ (చైనా)తో... లీ చెయుక్ యియు (హాంకాంగ్)తో లక్ష్య సేన్... రుస్తావిటో (ఇండోనేసియా)తో కశ్యప్ తలపడనున్నారు. మొత్తం 11 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీతో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో పురుషుల, మహిళల సింగిల్స్ విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారికి 77 వేల డాలర్ల చొప్పున (రూ. 57 లక్షలు) అందజేస్తారు.

పురుషుల డబుల్స్‌లో ఈసారి భారత్ నుంచి ప్రాతినిధ్యం లేకుండా పోయింది. మహిళల డబుల్స్‌లో నేలకుర్తి సిక్కి రెడ్డి-అశ్విని పొన్నప్ప; దండు పూజ-సంజన సంతోష్ జోడీలు... మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి-ప్రణవ్ చోప్రా జంట బరిలో ఉన్నాయి.

అశ్విని, సిక్కి రెడ్డి — ప్రణవ్ చోప్రా, లక్ష్య సేన్

1900 — ఆల్ ఇంగ్లండ్ టోర్నీ ప్రారంభమైన ఏడాది. తొలి, రెండో ప్రపంచ యుద్ధ సమయాల్లో మినహా మిగతా సంవత్సరాలలో ఈ టోర్నీ కొనసాగింది.

2 — ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో అత్యధిక టైటిల్స్ నెగ్గిన దేశాల సంఖ్య. చైనా, డెన్మార్క్ ఆటగాళ్లు 20 సార్లు చొప్పున ఈ టోర్నీలో విజేతగా నిలిచారు.

1 — ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టైటిల్‌ను అత్యధికసార్లు గెలిచిన ప్లేయర్ రూడీ హర్తానో. ఇండోనేసియాకు చెందిన రూడీ హర్తానో ఓవరాల్‌గా ఎనిమిదిసార్లు విజేతగా నిలువగా... 1968 నుంచి 1974 వరకు వరుసగా ఏడేళ్లు టైటిల్ గెలిచాడు.

7 — ఇప్పటివరకు సింధు ఏడుసార్లు ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో ఆడింది. 2018లో సెమీఫైనల్ చేరడమే ఆమె అత్యుత్తమ ప్రదర్శన. 2017లో క్వార్టర్ ఫైనల్ చేరిన సింధు నాలుగుసార్లు (2012, 2014, 2016, 2019) తొలి రౌండ్‌లో, ఒకసారి రెండో రౌండ్‌లో (2013) ఓడిపోయింది.

14 — ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో సైనా ఆడనుండటం ఇది వరుసగా 14వ ఏడాది. 2007 నుంచి ఈ టోర్నీలో ఆడుతున్న సైనా ఒకసారి ఫైనల్, రెండు సార్లు సెమీస్, ఆరుసార్లు క్వార్టర్ ఫైనల్ చేరింది.

డివిలియర్స్‌ను తీసుకోవాలి!

దక్షిణాఫ్రికా ప్రపంచకప్ జట్టుపై రోడ్స్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఈ ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌ను గెలవాలంటే దక్షిణాఫ్రికా జట్టు ఏం చేయడానికైనా సిద్ధంగా ఉండాలని మాజీ ఆటగాడు జాంటీ రోడ్స్ అభిప్రాయపడ్డాడు. విధ్వంసక బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్‌ను ఎంపిక చేయడం కూడా అందులో ఒకటని అతను అన్నాడు. డివిలియర్స్ జాతీయ జట్టు తరఫున ఆడి దాదాపు రెండేళ్లయింది. అయితే రిటైర్మెంట్ ప్రకటించిన అనంతరం అతను పునరామగనం చేసేందుకు సిద్ధమని కూడా ప్రకటించాడు. 'నేను డివిలియర్స్‌కు పెద్ద అభిమాని. టి20 ప్రపంచకప్ గెలవాలంటే మీరు ఎలాంటి అవకాశాన్ని వదిలి పెట్టవద్దు. రాబోయే ఐపీఎల్‌లో అతను ఎలా ఆడతాడనేది ప్రపంచం మొత్తం చూస్తుంది. అయితే ఇటీవల బిగ్‌బాష్ లీగ్‌లో అతని ఆట చూస్తే ఏబీ ఎంత అద్భుతమైన ఆటగాడో అర్థమవుతుంది' అని రోడ్స్ వ్యాఖ్యానించాడు. అయితే ప్రస్తుతం పోటీలో ఉన్న ఆటగాళ్లను కాదని ఒక్కసారిగా డివిలియర్స్‌ను ఎంపిక చేస్తే ఇది దక్షిణాఫ్రికా క్రికెట్‌లో చెడు సాంప్రదాయానికి దారి తీసినట్లు విమర్శలు వస్తాయని కూడా రోడ్స్ అన్నాడు. కానీ వరల్డ్ కప్ కోసం, డివిలియర్స్ స్థాయి ఆటగాడి కోసం ఒక సారి ఇలా చేసినా తప్పేమీ కాదని కూడా అతను విశ్లేషించాడు.

వికాస్

పసిడి కోసం వికాస్, సిమ్రన్ పోరు

- ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఫైనల్ చేరిన భారత బాక్సర్లు
- సెమీస్‌లో ఓడి కాంస్యాలు నెగ్గిన అమిత్, ఆశిష్, సతీశ్, మేరీకోమ్, పూజా రాణి, లవ్లీనా

అమ్మాన్ (జోర్డాన్): టోక్యో ఒలింపిక్స్ ఆసియా క్వాలిఫయింగ్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో ఇద్దరు భారత బాక్సర్లు ఫైనల్ చేరగా... మరో ఆరుగురు సెమీస్‌లో ఓడి కాంస్య పతకాలతో ముగించారు. పురుషుల 69 కేజీల విభాగంలో వికాస్ కృషన్... మహిళల 60 కేజీల విభాగంలో సిమ్రన్‌జిత్ కౌర్ ఫైనల్లోకి ప్రవేశించారు. సెమీస్‌లో వికాస్ 3-2 తేడాతో ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత అబ్‌లైఖన్ జుసుపొవ్ (కజకిస్తాన్)పై విజయం సాధించాడు. బౌట్‌లో ఎడమ కంటి దిగువభాగంలో గాయమైనా... పట్టుదల ప్రదర్శించిన వికాస్ తుది పోరుకు అర్హత సాధించాడు. ఫైనల్లో అతను ఈషా హుస్సేన్ (జోర్డాన్)తో తలపడతాడు. ఒకవేళ వికాస్ కంటి గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే అతనికి ఫైనల్లో పోటీపడే అవకాశం ఇవ్వరు. సిమ్రన్‌జిత్‌కు సెమీస్‌లో విజయం సులువుగానే దక్కింది. సిమ్రన్‌జిత్ 4-1తో ఆసియా చాంపియన్‌షిప్ రజత పతక విజేత షి యి వు (చైనీస్ తైపీ)ని ఓడించింది. ఫైనల్లో సిమ్రన్ రెండుసార్లు ఆసియా విజేతగా నిలిచిన ఓ యెన్ జీ (దక్షిణ కొరియా)ను ఎదుర్కొంటుంది.

పురుషుల విభాగంలో అమిత్ పంఘాల్ (52 కేజీలు), ఆశిష్ కుమార్ (75 కేజీలు), సతీశ్ కుమార్ (ప్లస్ 91 కేజీలు)... మహిళల విభాగంలో మేరీకోమ్ (51 కేజీలు), లవ్లీనా బొర్గొహైన్ (69 కేజీలు), పూజా రాణి (75 కేజీలు) సెమీస్‌లో ఓటమి పాలయ్యారు. అమిత్ 2-3తో రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత జియాంగ్వాన్ హు (చైనా) చేతిలో, ఆశిష్ 1-4తో మార్సియల్ ఇమర్ (ఫిలిప్పీన్) చేతిలో... సతీశ్ 0-5తో బఖోదిర్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో... మేరీకోమ్ 2-3తో యువాన్ చాంగ్ (చైనా) చేతిలో, లవ్లీనా 0-5తో హోంగ్ గు (చైనా) చేతిలో, పూజ రాణి 0-5తో ఖియాన్ లి (చైనా) చేతిలో పరాజయం పాలయ్యారు. ఈ టోర్నీ ద్వారా ఇప్పటికే ఎమిమిది మంది భారత బాక్సర్లు టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. పురుషుల 81 కేజీల విభాగంలో భారత బాక్సర్ సచిన్ కుమార్ ఫైనల్ బాక్స్ ఆఫ్ బౌట్‌కు అర్హత సాధించాడు. నేడు జరిగే ఫైనల్ బాక్స్ ఆఫ్ బౌట్‌లో షబ్బోస్ నెగ్‌మతులోయెవ్ (తజికిస్తాన్)పై సచిన్ గెలిస్తే టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాడు.

సిమ్రన్‌జిత్

'మాకు ధోనిలాంటి ఫినిషర్ కావాలి'

ఆసీస్ కోచ్ లాంగర్ వ్యాఖ్య

మెల్‌బోర్న్: వన్డేలు, టి20ల్లో తమ జట్టుకు ఒక సరైన ఫినిషర్ అవసరం ఉందని ఆస్ట్రేలియా కోచ్ జస్టిన్ లాంగర్ అభిప్రాయపడ్డాడు. అందుకు భారత స్టార్ ఎమ్మెస్ ధోని తరహా ఆటగాడైతే సరిగ్గా సరిపోతాడని అతను అన్నాడు. 'గతంలో ఆస్ట్రేలియా జట్టుకు మైకేల్ బెవాన్, మైక్ హస్సీలాంటి వారు మ్యాచ్‌ను ముగించే బాధ్యతను సమర్థంగా నిర్వర్తించారు. ఇంగ్లండ్‌కు ఇప్పుడు బట్లర్ అలాంటి పని చేస్తున్నాడు. ఇక ఎమ్మెస్ ధోని అయితే ఈ విషయంలో మాస్టర్‌లాంటివాడు. ప్రపంచంలో ప్రతీ జట్టు ఇప్పుడు ఇలాంటి క్రికెటర్లను కోరుకుంటోంది' అని లాంగర్ వ్యాఖ్యానించాడు. ఇక ఆస్ట్రేలియా జట్టులో 'ఫినిషర్'గా తమ స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు ఆటగాళ్లు పోటీ పడాలని కూడా కోచ్ సూచించాడు. గతంలో మార్కస్ స్టొయినిస్‌ను ఆసీస్ ప్రయత్నించినా అతను ఘోరంగా విఫలమయ్యాడు.

ఐర్లాండ్ 'సూపర్' విజయం

అఫ్గానిస్తాన్‌తో చివరి టి20

గ్రేటర్ నోయిడా: అఫ్గానిస్తాన్ చేతిలో టి20 సిరీస్ కోల్పోయిన తర్వాత చివరి మ్యాచ్‌లో ఐర్లాండ్‌కు విజయం దక్కింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో 'సూపర్ ఓవర్' ద్వారా ఐర్లాండ్ నెగ్గింది. ముందుగా ఐర్లాండ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. డెలానీ (29 బంతుల్లో 37; 5 ఫోర్లు, 1 సిక్స్), టెక్టర్ (22 బంతుల్లో 31; 1 ఫోర్, 2 సిక్సర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెవిన్ ఓబ్రైన్ (21 బంతుల్లో 26; 4 ఫోర్లు) రాణించారు. నవీన్, ఖైస్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం అఫ్గానిస్తాన్ కూడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 142 పరుగులే సాధించింది. రహ్మానుల్లా (29 బంతుల్లో 42; 3 ఫోర్లు, 3 సిక్సర్లు), అస్గర్ అఫ్గాన్ (30 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. స్కోర్లు సమం కావడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు వెళ్లింది. అఫ్గాన్ జట్టు ఒక వికెట్ కోల్పోయి 8 పరుగులు చేయగా...ఐర్లాండ్ వికెట్ నష్టానికి 12 పరుగులు చేసింది. తొలి రెండు మ్యాచ్‌లు నెగ్గిన అఫ్గానిస్తాన్ 2-1తో సిరీస్ గెలుచుకుంది.

టోక్యో ఒలింపిక్స్‌కు శివ్‌పాల్ సింగ్ అర్హత

పాచెఫ్‌స్ట్రూమ్: భారత జావెలియన్ త్రోయర్ శివ్‌పాల్ సింగ్ టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. దక్షిణాఫ్రికాలో జరిగిన ఏసీఎ నడబ్ల్యూ అథ్లెటిక్స్ మీట్‌లో శివ్‌పాల్ సింగ్ ఈటెను 85.47 మీటర్ల దూరం విసిరి విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో టోక్యో ఒలింపిక్స్ అర్హత ప్రమాణం 85 మీటర్లను కూడా శివ్‌పాల్ సింగ్ అధిగమించాడు. భారత్ తరఫున టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత పొందిన రెండో జావెలియన్ త్రోయర్ శివ్‌పాల్ సింగ్. ఇప్పటికే నీరజ్ చోప్రా 'టోక్యో' బెర్త్ సాధించాడు.

అర్పిత్ సెంచరీ: సౌరాష్ట్ర 384/8

రాజ్‌కోట్: అర్పిత్ వసవాడా (287 బంతుల్లో 106; 11 ఫోర్లు) అద్భుత సెంచరీ... చతేశ్వర్ పుజారా (237 బంతుల్లో 66; 5 ఫోర్లు) బాధ్యతాయుత ఇన్నింగ్స్... వెరసి బెంగాల్ జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్లో సౌరాష్ట్ర భారీ స్కోరు నమోదు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 206/5తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి 160 ఓవర్లలో 8 వికెట్లకు 384 పరుగులు చేసింది. తొలి రోజు అస్వస్థత కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన పుజారా రెండో రోజు మళ్లీ బ్యాటింగ్ చేశాడు. అర్పిత్‌తో కలిసి పుజారా సౌరాష్ట్ర ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టాడు. ఇద్దరూ రెండు సెషన్లపాటు ఆడటంతోపాటు ఆరో వికెట్‌కు 380 బంతుల్లో 142 పరుగులు జోడించారు. గుజరాత్‌తో జరిగిన సెమీఫైనల్లో సెంచరీ చేసిన అర్పిత్ అదే జోరును ఫైనల్లోనూ కొనసాగించాడు. ఓవరాల్‌గా రెండో రోజు సౌరాష్ట్ర 79.1 ఓవర్లు ఆడి మూడు వికెట్లు కోల్పోయి 178 పరుగులు సాధించింది. చివరి సెషన్‌లో అర్పిత్, పుజారా అవుటైనా అప్పటికే బెంగాల్‌కు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రస్తుతం చిరాగ్ జానీ (44 బంతుల్లో 13 బ్యాటింగ్), ధర్మేంద్ర సింగ్ జడేజా (22 బంతుల్లో 13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

రెండు వైపుల నుంచి ఒకరే అంపైరింగ్!

రంజీ ఫైనల్లో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. అంపైర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో సి.షంషుద్దీన్‌కు దెబ్బ తగిలింది. వికెట్ తీసిన ఆనందంలో బెంగాల్ ఫీల్డర్ ఒకరు బంతిని విసరగా దీనిని గమనించని షంషుద్దీన్ పొత్తికడుపునకు బలంగా తగిలింది. దాంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న అంపైర్‌ను సౌరాష్ట్ర క్రికెట్ సంఘం అధికారులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం ఒక సెషన్ పాటు మరో ఆన్‌ఫీల్డ్ అంపైర్ కేఎన్ అనంతపద్మనాభన్ ప్రతీ ఓవర్‌కు మారుతూ రెండు ఎండ్‌ల నుంచి అంపైరింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. స్థానిక అంపైర్ పీయూష్ కక్కడ్ స్క్వేర్ లెగ్ అంపైర్‌గా నిలబడిపోయారు. బీసీసీఐ నిబంధనల ప్రకారం ఈ మ్యాచ్‌కు తటస్థ అంపైర్లు ఉండాలి. పీయూష్ సౌరాష్ట్రకు చెందినవాడు కావడంతో మెయిన్ ఎండ్ నుంచి అంపైరింగ్ చేయని వ్వలేదు. థర్డ్ అంపైర్ రవికి మాత్రమే డీఆర్ఎస్ విధానంపై అవగాహన ఉండటంతో ఆయనా మైదానంలోకి రాలేదు. చివరకు షంషుద్దీన్‌ను టీవీ అంపైర్ స్థానంలో కూర్చోబెట్టి రవి ఆ తర్వాత అంపైరింగ్ బాధ్యతలు నిర్వహించారు. రంజీ ఫైనల్ నిర్వహణలో ఈ తరహా బీసీసీఐ వైఫల్యంపై విమర్శలు వచ్చాయి. ముంబై నుంచి రానున్న యశ్వంత్ బర్డే నేటినుంచి ఫీల్డ్ అంపైర్‌గా వ్యవహరిస్తారు.

సాక్షి బిజినెస్
బుధవారం
11-3-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (సోమవారం ముగింపు)

సెన్సెక్స్	నిఫ్టీ
1942 ▼	538 ▼
35,635	10,451

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	8,123	▲ 173
డోజోన్స్	24,135	▲ 284
ఎఫ్‌టీఎస్‌ఈ 100	5,960	▼ 6
డాక్స్	10,475	▼ 150
షాంఘై	2,997	▲ 53
నికాయ్	19,867	▲ 168

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో (సోమవారం ముగింపు)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	73.22	74.87
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	95.15	98.45
€	యూరో	ఎస్‌బీఐ	82.89	85.88
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	70.87	73.55
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.26	49.41
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	52.73	54.53
SAR	సౌదీ రియాల్	ఫామ్‌స్కుక్	18.77	20.58
UAE D	యూఏఈ దిర్హామ్	ఫామ్‌స్కుక్	19.11	21.11
¥	చైనా యువాన్	ఫామ్‌స్కుక్	9.53	11.30

టీసీఎస్ మధ్యంతర డివిడెండ్ రూ.12

న్యూఢిల్లీ: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 1 ముఖ విలువ గల ఒక్కో ఈక్విటీ షేర్‌కు రూ.12 మధ్యంతర డివిడెండ్‌ను ఇవ్వనున్నది. ఈ మేరకు డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని టీసీఎస్ వెల్లడించింది. ఈ నెల 20లోపు తమ షేర్లను హోల్డ్ చేసిన వాటాదారులకు ఈ నెల 24న ఈ డివిడెండ్‌ను చెల్లిస్తామని వివరించింది.

టీవీఎస్ మోటార్ కంపెనీ రెండో డివిడెండ్

ఒక్కో షేర్‌కు రూ.1.40 చెల్లింపు

న్యూఢిల్లీ: టీవీఎస్ మోటార్ కంపెనీ తన వాటాదారులకు రెండో మధ్యంతర డివిడెండ్‌ను ఇవ్వనున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ఒక్కో షేర్‌కు రూ.1.40 చొప్పున(140 శాతం) రెండో మధ్యంతర డివిడెండ్‌ను ఇవ్వడానికి కంపెనీ డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపింది. ఈ నెల 18నాటికి తమ షేర్లను హోల్డ్ చేస్తున్న వాటాదారులకు ఈ నెల 20లోపు ఈ డివిడెండ్‌ను చెల్లిస్తామని టీవీఎస్ మోటార్ కంపెనీ తెలిపింది. మొత్తం 47.5 కోట్ల షేర్లకు రూ.80 కోట్లు చెల్లించనున్నామని పేర్కొంది. గత నెలలోనే ఈ కంపెనీ ఒక్కో షేర్‌కు రూ.2.10 డివిడెండ్‌ను ప్రకటించింది.

ఆసియా అపర కుబేరుడు జాక్ మా!

- మళ్లీ అగ్రస్థానాన్ని దక్కించుకున్న ఆలీబాబా ఫౌండర్
- రెండో స్థానానికి తగ్గిన ముకేశ్ అంబానీ
- రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ల పతనంతో సంపద భారీగా తగ్గడమే కారణం

న్యూఢిల్లీ: కరోనా వైరస్ తీవ్రతకు ప్రపంచ దేశాలు మాంద్యం లోకి జారుకుంటాయన్న భయాలతో సోమవారం స్టాక్‌మార్కెట్లు కుప్పకూలిన నేపథ్యంలో .. పలువురు బిలియనీర్ల స్థానాలు మారిపోయాయి. ఇప్పటిదాకా ఆసియా కుబేరుల్లో అగ్రస్థానంలో ఉంటున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ రెండో స్థానానికి పరిమితమయ్యారు. మార్కెట్ పతనంలో ఆయన సంపద విలువ 5.8 బిలియన్ డాలర్ల మేర హరించుకుపోవడం ఇందుకు కారణం. దీంతో 44.5 బిలియన్ డాలర్ల సంపదతో చైనాకు చెందిన ఆలీబాబా గ్రూప్ హోల్డింగ్ వ్యవస్థాపకుడు మళ్లీ నంబర్‌వన్ స్థానంలో నిల్చారు. అంబానీ కన్నా ఆయన సంపద సుమారు 2.6 బిలియన్ డాలర్లు ఎక్కువగా ఉంది. 2018 మధ్యలో జాక్ మా ఆసియాలో నంబర్ 1 హోదాను కోల్పోయారు. అపర కుబేరుల సంపద లెక్కించే బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ సూచీ ద్వారా ఇది వెల్లడైంది.

'చమురు' వదులుతోంది...

ముడి చమురు రేట్లు భారీగా పతనమైన నేపథ్యంలో రిలయన్స్ నిర్దేశించుకున్నట్లుగా 2021 నాటికి రుణరహిత సంస్థగా మారే అవకాశాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. సౌదీ అరేబియన్ ఆయిల్ కంపెనీకి రిలయన్స్ చమురు, పెట్రోకెమికల్స్ విభాగంలో వాటాల విక్రయ డీల్ సజావుగా జరగడంపైనే ఇదంతా ఆధారపడనుందని పరిశ్రమవర్గాలు తెలిపాయి. మరోవైపు, కరోనా వైరస్ దెబ్బతో జాక్ మా ఆలీబాబా వ్యాపారం కాస్త దెబ్బతిన్నా.. ఆ గ్రూప్‌లోని క్లౌడ్ కంప్యూటింగ్ సేవలు, మొబైల్ యాప్స్‌కి డిమాండ్ పెరగడంతో పెద్దగా ప్రతికూల ప్రభావం పడలేదు. అయితే, రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి అలాంటి వెసులుబాటు లేకుండా పోయింది. సోమవారం స్టాక్ మార్కెట్ పతనంలో రిలయన్స్ షేర్లు ఏకంగా 12 శాతం పడిపోయాయి. 2009 తర్వాత ఈ స్థాయిలో పడిపోవడం ఇదే ప్రథమం.

డ్యూరోఫ్లెక్స్ క్యాంపైన్.. 'యాన్ ఆఫ్ స్లీప్ ఆన్'

న్యూఢిల్లీ: ప్రముఖ పరుపుల తయారీ సంస్థ డ్యూరోఫ్లెక్స్ మాట్రెసెస్.. నిద్ర ఆవశ్యాకతను తెలియజేస్తూ 'యాన్ ఆఫ్ స్లీప్ ఆన్' పేరిట ఓ సరికొత్త క్యాంపైన్‌ను ప్రారంభించింది. ఈ నెల 13న (శుక్రవారం) ప్రపంచ నిద్ర దినం ఉన్నందున ఈ వారం మొత్తం పలు ఆసక్తికర వీడియోలను సోషల్ పేజీల్లో పోస్ట్ చేస్తోంది. ఆవలింతలు వస్తున్నా నిద్ర పోకుండా పనిచేయడం వల్ల ఆరోగ్యానికి నష్టం జరుగుతుందని, వీలైనంత వరకు సరిపడా నిద్ర మనిషికి అవసరం అనే విషయాన్ని తెలియజేస్తూ ప్రచారం కొనసాగుతుందని సంస్థ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) స్మితా మురార్కా అన్నారు.

గృహిణులు వ్యాపారవేత్తలుగా మారేందుకు ప్రోత్సాహం

బ్రిటానియా 'మ్యారీగోల్డ్ మై స్టార్టప్' శిక్షణ

న్యూఢిల్లీ: గృహిణులు వ్యాపారవేత్తలుగా ప్రస్థానాన్ని ఆరంభించేందుకు (స్టార్టప్‌ల ఏర్పాటుకు) బ్రిటానియా మ్యారీగోల్డ్ బ్రాండ్ 'బ్రిటానియా మ్యారీగోల్డ్ మై స్టార్టప్' కార్యక్రమం రెండో విడతను మంగళవారం ఆరంభించింది. జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ)తో ఈ విడత బ్రిటానియా మ్యారీ గోల్డ్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. వ్యాపారవేత్తలుగా మారాలనే ఉత్సాహం ఉన్న గృహిణులకు ఈ కార్యక్రమం కింద నైపుణ్యాలపై శిక్షణ ఇస్తారు. ఇదొక ఆన్‌లైన్ కోర్సు. ఈ ఏడాది ఏప్రిల్, జూన్ కాలంలో దేశవ్యాప్తంగా 10 వేల మంది గృహిణులు ఈ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్స్‌లో పాల్గొననున్నారు. గృహిణుల స్వావలంబనకు, ఉద్యోగ సృష్టికర్తలుగా వారిని మార్చడమే ఈ కార్యక్రమం లక్ష్యం. ఇందులో పాల్గొనదలిచిన వారు బ్రిటానియా మ్యారీగోల్డ్ ప్యాకెట్‌పై ఉన్న వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ చేయడం లేదా www.mystartupcontest.com పోర్టల్‌కు లాగిన్ అయి పేర్లను నమోదు చేసుకోవచ్చని సంస్థ తెలిపింది.

కో-ఆపరేటివ్‌లకూ యస్ బ్యాంక్ కష్టాలు

- 54 పట్టణ సహకార బ్యాంక్‌ల సీటీఎస్‌లు రద్దు
- రూ.200 కోట్ల మేర నిలిచిపోయిన చెక్ లావాదేవీలు
- తెలుగు రాష్ట్రాల్లో తొమ్మిది కో-ఆప్ బ్యాంక్‌లపై ప్రభావం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యస్ బ్యాంక్ ఆర్థిక సంక్షోభం ప్రభావం దేశంలోని పట్టణ సహకార బ్యాంక్‌ల మీద పడింది. యస్ బ్యాంక్ మారటోరియం నేపథ్యంలో యస్ బ్యాంక్‌తో ఒప్పందం చేసుకున్న అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ (యూసీబీ) చెక్ ట్రన్కేషన్ సిస్టమ్ (సీటీఎస్)లను ఆర్‌బీఐ రద్దు చేసింది. దేశవ్యాప్తంగా సీటీఎస్‌ల లావాదేవీల కోసం 54 యూసీబీలు యస్ బ్యాంక్‌తో ఒప్పందం చేసుకోగా.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తొమ్మిది బ్యాంక్‌లున్నాయి. చెక్ డిపాజిట్స్, విత్‌డ్రా సేవలు నిలిచిపోవటంతో కస్టమర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకూ సీటీఎస్ క్లియరెన్స్‌లు జరగవని ఆర్‌బీఐ తెలిపింది.

లక్ష కంటే ఎక్కువ జనాభా ఉన్న అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌ల ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతులిచ్చిన విషయం తెలిసిందే. స్థానిక కమ్యూనిటీలు, వర్కింగ్ గ్రూప్‌లకు, చిన్న తరహా వ్యాపారస్తులకు, వ్యవసాయ రుణాలను అందించడమే కో-ఆప్ బ్యాంక్‌ల ప్రధాన లక్ష్యం. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి దేశంలో 1,544 అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లు, 11,115 బ్రాంచీలున్నాయి. డిపాజిట్లు రూ.4,84,315 కోట్లుగా, అడ్వాన్స్‌లు రూ.3,03,017 కోట్లుగా ఉన్నాయి.

54 యూసీబీల సీటీఎస్‌ల రద్దు..

దేశవ్యాప్తంగా 54 కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లకు యస్ బ్యాంక్ స్పాన్సర్ బ్యాంక్‌గా ఉంది. వీటి సీటీఎస్ క్లియరెన్స్‌లను రద్దు చేస్తూ గత శుక్రవారం ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. ఒక్క చెక్ క్లియరెన్స్ కోసం స్పాన్సర్ బ్యాంక్‌కు ఒప్పంద యూసీబీ బ్యాంక్‌లు 50 పైసల నుంచి రూపాయి వరకు చార్జీల రూపంలో చెల్లిస్తుంటాయి. వారం రోజులుగా 54 పట్టణ సహకార బ్యాంక్‌లలో సీటీఎస్ క్లియరెన్స్ జరగడం లేదని.. వీటి విలువ రూ.200 కోట్లుంటుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

ఇతర బ్యాంక్‌లతో ఒప్పందాలు..

కస్టమర్ల ఆందోళన నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని తొమ్మిది యస్ బ్యాంక్ ఒప్పందం కో-ఆపరేటివ్ బ్యాంక్‌లు సీటీఎస్ క్లియరెన్స్ కోసం హెచ్‌డీఎఫ్‌సీ, ఐడీబీఐ, యాక్సిస్ వంటి ఇతర బ్యాంక్‌లతో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. గత ఐదు రోజులుగా పోచంపల్లి కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో సీటీఎస్ క్లియరెన్స్‌లు జరగడం లేదని ఆ బ్యాంక్ సీఈఓ సీతా శ్రీనివాస్ తెలిపారు. కస్టమర్లకు ఆందోళన వద్దని, కొద్ది రోజుల పాటు చెక్ విత్‌డ్రా, డిపాజిట్ వంటి లావాదేవీలను వాయిదా వేసుకోవాలని కస్టమర్లకు సూచిస్తున్నామని చెప్పారు. అత్యవసరమైతే నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ సేవలను వినియోగించుకోవాలని కస్టమర్లకు మెసేజ్, వాట్సాప్, ఈ-మెయిల్స్ ద్వారా సందేశాలను పంపిస్తున్నామన్నారు. పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌కు పోచంపల్లి, చౌటుప్పల్, దేవరకొండ, నల్లగొండ, హాలియా, చందూర్, సూర్యాపేట 7 బ్రాంచీల్లో 50 వేల మంది కస్టమర్లు, రూ.60 కోట్ల అడ్వాన్స్‌లు, రూ.100 కోట్ల డిపాజిట్లున్నాయి. యాదాద్రి లక్ష్మీనరసింహా స్వామి అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో రోజుకు రూ.10 లక్షల వరకు చెక్ లావాదేవీలు జరుగుతుంటాయని బ్యాంక్ ఎండీ చెన్న వెంకటేశం తెలిపారు. సీటీఎస్ క్లియరెన్స్‌కు హెచ్‌డీఎఫ్‌సీతో చర్చలు జరుపుతున్నామన్నారు.

తెలుగు రాష్ట్రాల్లోని బ్యాంకులివే...

సీటీఎస్ క్లియరెన్స్‌ల కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి యస్ బ్యాంక్‌తో తొమ్మిది అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లు ఒప్పందం చేసుకున్నాయి. తెలంగాణ నుంచి పోచంపల్లి, సెవెన్ హిల్స్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్, వరంగల్ అర్బన్, భద్రాద్రి, యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి, ది సంగమిత్ర కో-ఆప్ అర్బన్ బ్యాంక్‌లున్నాయి. ది తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్, ది గుంటూరు కో-ఆపరేటివ్ బ్యాంక్, ది హిందుస్తాన్ షిప్‌యార్డ్ స్టాఫ్ కో-ఆప్ బ్యాంక్‌లు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవి. ''ఏపీలో 47 యూసీబీలు, 230 బ్రాంచీలున్నాయి. వీటి డిపాజిట్లు రూ.9,040 కోట్లు, అడ్వాన్స్‌లు రూ.6,230 కోట్లు. తెలంగాణలో 51 యూసీబీలు, 211 బ్రాంచీలున్నాయి. డిపాజిట్లు రూ.7,517 కోట్లు, అడ్వాన్స్‌లు రూ.5,592 కోట్లు.

యస్ ఖాతాదారులకు కాస్త ఊరట

- ఇన్‌వార్డ్ ఐఎంపీఎస్, నెఫ్ట్ సేవల పునరుద్ధరణ
- ఇతర బ్యాంకు ఖాతాల ద్వారా ఈఎంఐలు, క్రెడిట్ కార్డు చెల్లింపులకు ఓకే

న్యూఢిల్లీ: మారటోరియం వల్ల తాత్కాలికంగా నిలిపివేసిన కొన్ని సర్వీసులను యస్ బ్యాంక్ క్రమంగా పునరుద్ధరిస్తోంది. తాజాగా ఇన్‌వార్డ్ ఐఎంపీఎస్, నెఫ్ట్ సర్వీసులను పునరుద్ధరించినట్లు మంగళవారం మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విట్టర్‌లో వెల్లడించింది. దీంతో యస్ బ్యాంక్ నుంచి క్రెడిట్ కార్డులు, రుణాలు తీసుకున్న వారు ఇతర బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లింపులు జరిపేందుకు వెసులుబాటు ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం తమ ఏటీఎంలన్నీ పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయని, ఇతర ఏటీఎంల నుంచి కూడా నిర్దిష్ట స్థాయిలో నగదు విత్‌డ్రా చేసుకోవచ్చంటూ యస్ బ్యాంక్ తెలిపింది. సంక్షోభంలో చిక్కుకున్న యస్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ నెలరోజుల మారటోరియం విధించడంతో కస్టమర్లలో ఆందోళన నెలకొంది. నగదు విత్‌డ్రాయల్‌పై ఆంక్షలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌తో పాటు ఇతర ప్లాట్‌ఫాంల ద్వారా డిజిటల్ పేమెంట్స్ సేవలు కూడా నిల్చిపోవడం మరింత గందరగోళానికి దారి తీసింది. ఫారెక్స్ సర్వీసులు, క్రెడిట్ కార్డు కొనుగోళ్లపై ప్రతికూల ప్రభావం పడింది.

యస్ బ్యాంక్‌లో టియర్ 1 బాండ్లేమీ లేవు: శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్

నిధుల కొరతతో సతమతమవుతున్న యస్ బ్యాంక్‌లో తమకు టియర్ 1 స్థాయి బాండ్లేమీ లేవని శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ (ఎస్‌టీఎఫ్‌సీ) సంస్థ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. అప్పర్ టియర్ 2 స్థాయి బాండ్లలో 2010లో ఇన్వెస్ట్ చేసిన రూ. 50 కోట్లు మాత్రమే రావాల్సి ఉందని పేర్కొంది. ఆర్‌బీఐ రూపొందించిన పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళిక ప్రకారం.. సుమారు రూ. 10,800 కోట్ల టియర్ 1 బాండ్ల చెల్లింపులు రద్దు కానున్న సంగతి తెలిసిందే. మరోవైపు, 2006లో జారీ చేసిన వారంట్లకు సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తమపై రూ. 5 కోట్ల జరిమానా విధించినట్లు ఎస్‌టీఎఫ్‌సీ తెలిపింది. ప్రస్తుతం తమ గ్రూప్‌లో భాగమైన శ్రీరామ్ హోల్డింగ్స్ (మద్రాస్) (ఎస్‌హెచ్ఎంపీఎల్) అప్పట్లో రూ. 244 కోట్ల సమీకరణ కింద ఒక ప్రవాస భారతీయ వ్యక్తి నుంచి కూడా నిధులు సమీకరించినట్లు వివరించింది. ఈ లావాదేవీలో విదేశీ మారక నిర్వహణ (ఫెమా) చట్టాల ఉల్లంఘన జరిగిందన్న ఆరోపణలతో ఈడీ తాజా జరిమానా విధించినట్లు ఎస్‌టీఎఫ్‌సీ తెలిపింది.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	44,940	
బంగారం (22 క్యారెట్లు)	42,800	
వెండి (కిలో)	50,300	▲ 800
హైదరాబాద్/చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	44,250	▲ 350
బంగారం (22 క్యారెట్లు)	42,140	▲ 330
వెండి (కిలో)	50,300	▲ 1200
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	43,450	▲ 100
బంగారం (22 క్యారెట్లు)	40,000	▼ 200
వెండి (కిలో)	47,700	▲ 1200
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	45,130	0
బంగారం (22 క్యారెట్లు)	41,980	0
వెండి (కిలో)	48,000	0
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	45,560	▲ 310
బంగారం (22 క్యారెట్లు)	42,140	▲ 330
వెండి (కిలో)	48,000	▲ 1100

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	33.84 (రాత్రి 11.30కు)	$ 31.13 (సోమవారం ముగింపు)
బ్రెంట్	37.30 (రాత్రి 11.30కు)	$ 34.36 (సోమవారం ముగింపు)

వాహన రంగానికి... బీఎస్-4 గుదిబండ

- కరోనా వైరస్ కారణంగా తగ్గిన వాహన విక్రయాలు
- మార్చి 31తో ముగియనున్న పాతవాటి రిజిస్ట్రేషన్లు
- ఈలోపే అమ్మకాలు పూర్తి చేయలేమంటున్న కంపెనీలు
- ఆటో రంగానికి మరో కొత్త కష్టం

న్యూఢిల్లీ: వాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించడం కోసం భారత్ స్టేజ్ (బీఎస్)-6 ఉద్గార నిబంధనలను ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా అమలుచేయాలని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసిన నేపథ్యంలో పలు రాష్ట్ర ప్రభుత్వాలు రిజిస్ట్రేషన్లకు సంబంధించి తాజా ఉత్తర్వులను జారీ చేస్తున్నాయి. వచ్చే నెల ప్రారంభం నుంచే కొత్త నిబంధనలు అమలుకానున్న కారణంగా పాత నిబంధనలకు అనుగుణంగా ఉన్న బీఎస్-4 వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈ నెల చివరినాటికి ముగించేయాలని ఆదేశిస్తున్నాయి. దీంతో భారీ స్థాయిలో ఇన్వెంటరీలను కలిగి ఉన్న వాహన రంగ కంపెనీలు హడలెత్తిపోతున్నాయి. మొన్నటివరకు పరిస్థితి బాగానే ఉందని, ప్రాణాంతకమైన కరోనా వైరస్ (కోవిడ్-19) వ్యాప్తి వేగంగా ఉన్నందువల్ల షారూంలకు వచ్చే వారి సంఖ్య బాగా తగ్గిపోయి అమ్మకాలు నిలిచిపోయాయని చెబుతున్నాయి. విజృంభిస్తోన్న వైరస్ పరంగా చూస్తే.. గడువు తేదీలోపు బీఎస్-4 వాహన విక్రయాలను పూర్తి చేయడం కష్టమేనని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఎఫ్ఏడీఏ) తెలిపింది. మరోవైపు పాత వాహనాల రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తికావాలని పలు రాష్ట్ర రవాణా విభాగాలు డీలర్లకు సర్క్యులర్లు జారీ చేస్తున్నట్లు వెల్లడించింది.

30-రోజులకు పెరిగిన నిల్వలు

పేరుకుపోయిన పాత వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడం కోసం పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు తమ వంతు సహాయాన్ని అందిస్తున్నాయని ఎఫ్ఏడీఏ అధ్యక్షుడు హర్షరాజ్ కాలే అన్నారు. ఆదివారం, సెలవు రోజుల్లో కూడా ఈ రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ కొనసాగుతుందని చెప్పారు. కరోనా వైరస్ కారణంగా దేశవ్యాప్తంగా అనేక మంది డీలర్ల వద్ద అన్ని విభాగాలకు చెందిన పాత వాహనాల నిల్వలు అధిక స్థాయికి చేరుకున్నాయని, ముఖ్యంగా ద్విచక్ర నిల్వలు అధికంగా ఉన్నాయని వివరించారు. వీటి ఇన్వెంటరీ 20-30 రోజులుగా ఉందన్నారు. ఓఈఎం (ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్)తో కలిసి సంప్రదింపులు నిర్వహించనున్నామని, ఇందుకు తగిన పరిష్కార మార్గం దొరక్కపోతే డీలర్లు భారీ స్థాయిలో నష్టాలను చవిచూడాల్సి ఉంటుందని వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 11-3-2020

విశాఖ	323-00
చిత్తూరు	323-00
వరంగల్	298-00
విజయవాడ	324-00
గోదావరి	324-00
10-3-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	295-00

హెచ్‌బీఎల్‌కు రూ.181 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హెచ్‌బీఎల్ పవర్ సిస్టమ్స్ రూ.181 కోట్ల విలువైన ఆర్డర్లను చేజిక్కించుకుంది. దక్షిణ మధ్య రైల్వే నుంచి రూ.70 కోట్ల విలువైన ఆర్డరులో భాగంగా సేఫ్టీ క్రిటికల్ టెక్నాలజీ అయిన ట్రైన్ కొల్లీషన్ అవాయిడెన్స్ సిస్టమ్‌ను అందిస్తుంది. ఈ సాంకేతికతను దేశీయంగా అభివృద్ధి చేసేందుకు 12 ఏళ్లు శ్రమించినట్టు కంపెనీ తెలిపింది. భారత నావికా దళం నుంచి రూ.85 కోట్ల కాంట్రాక్టు పొందింది. సబ్‌మెరైన్ ప్రొపల్షన్ సిస్టమ్‌కు అవసరమైన బ్యాట రీలను సరఫరా చేస్తారు. రూ.26 కోట్ల విలువైన లిథియం థర్మల్ బ్యాటరీల సరఫరా కాంట్రాక్టు మరొకటి. కొత్త క్లయింట్ల నుంచి ఈ ఆర్డరు అందుకున్నామని హెచ్‌బీఎల్ సీఎండీ ఏ.జే.ప్రసాద్ తెలిపారు.

కోలుకొని మళ్లీ కూలిన మార్కెట్లు!

- 8 శాతం ఎగసిన చమురు ధరలు
- ఉద్దీపన చర్యలపై ఆశలు
- లాభపడిన ఆసియా మార్కెట్లు
- ఆరంభంలో పుంజుకున్న యూరప్ మార్కెట్లు
- ఇటలీలో ముదిరిన కోవిడ్-19 కల్లోలం
- దీంతో నష్టాల్లోకి జారిపోయిన యూరప్ మార్కెట్లు
- తీవ్ర ఒడిదుడుకుల్లో అమెరికా స్టాక్ సూచీలు

హాంకాంగ్: సోమవారం నాటి భారీ పతనం నుంచి మంగళవారం ప్రపంచ మార్కెట్లు కోలుకొని ఆ తర్వాత మళ్లీ కుప్పకూలాయి. ఆసియా మార్కెట్లు నష్టాల్లోంచి లాభాల్లోకి, యూరప్ మార్కెట్లు లాభాల్లోంచి నష్టాల్లోకి జారిపోగా, అమెరికా స్టాక్ సూచీలు లాభనష్టాల మధ్య తీవ్రమైన ఒడిదుడుకుల్లో ట్రేడవుతున్నాయి. చమురు ధరలు పుంజుకోవడం ఒకింత సానుకూల ప్రభావం చూపించింది. అయితే చైనాలో అదుపులోకి వచ్చినా, ఇతర దేశాల్లో కోవిడ్-19 (కరోనా)వైరస్ కల్లోలం కొనసాగుతుండటంతో యూరప్ మార్కెట్లు లాభాల్లోంచి నష్టాల్లోకి జారిపోయాయి. . కోవిడ్-19(కరోనా) వైరస్ కల్లోలం అంతకంతకూ పెరిగిపోతుండటం, ముడిచమురు ధరల పోరు మొదలుకావడంతో సోమవారం ఆసియా, యూరప్, అమెరికా మార్కెట్లు కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ మార్కెట్లన్నీ 2-8 శాతం రేంజ్‌లో పతనమయ్యాయి.

నష్టాల్లోంచి లాభాల్లోకి.....

మంగళవారం ముడిచమురు ధరలు 8% మేర ఎగియడంతో ప్రపంచ మార్కెట్లు ముఖ్యంగా ఆసియా సూచీలు పుంజుకున్నాయి. కరోనా వైరస్ మూల కేంద్రమైన వూహాన్ నగరాన్ని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సందర్శించడం, గత వారమే రేట్లను తగ్గించిన అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోసారి రేట్లను తగ్గిస్తుందన్న వార్తలు, వైరస్ కల్లోలంతో కుదేలైన ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడానికి అమెరికా ప్రభుత్వం ఉద్దీపన చర్యలు తీసుకోనున్నదన్న అంచనాలు... సానుకూల ప్రభావం చూపించాయి. సోమవారం అమెరికా మార్కెట్లు 8 శాతం మేర నష్టపోయిన నేపథ్యంలో మంగళవారం ఆసియా మార్కెట్లు నష్టాల్లోనే ఆరంభమయ్యాయి. అయితే మెల్లగా లాభాల్లోకి వచ్చాయి. ఆసియా మార్కెట్లు 1-3 శాతం రేంజ్‌లో లాభాల్లో ముగిశాయి.

లాభాల్లోంచి నష్టాల్లోకి...

ఆసియా మార్కెట్లు నష్టాల్లోంచి లాభాల్లోకి రాగా, యూరప్ మార్కెట్లు లాభాల్లోంచి నష్టాల్లోకి జారిపోయాయి. ఆసియా మార్కెట్ల జోష్‌తో యూరప్ మార్కెట్లు లాభాల్లోనే ఆరంభమై 1-2.5% రేంజ్ లాభాల్లో ట్రేడయ్యాయి. అయితే ఇటలీలో కోవిడ్-19 వైరస్ సోకి మరణించిన వారి సంఖ్య, ఈ వైరస్ సోకిన వారి సంఖ్య పెరగడం, ఆ దేశంలో ప్రయాణాలు, సామూహిక కార్యక్రమాలపై నిషేధం విధించడం, అమెరికా ఉద్దీపన ప్యాకేజీకి మరికొంత సమయం పడుతుందనే వార్తలతో యూరప్ మార్కెట్లు నష్టాల్లోకి జారిపోయాయి. డ్యాక్స్ (జర్మనీ), క్యాక్(ఫ్రాన్స్) సూచీలు 0.7 శాతం నుంచి 1.5 శాతం రేంజ్‌లో నష్టాల్లో ముగిశాయి. ఇక అమెరికా మార్కెట్ లాభాల్లోనే ఆరంభమైనా, మధ్యలో నష్టాల్లోకి జారిపోయి, మళ్లీ లాభాల్లోకి వచ్చాయి. మొత్తం మీద తీవ్రమైన ఒడిదుడుకుల్లో ట్రేడవుతున్నాయి. ఇక ఈ వార్త రాసే సమయానికి (రాత్రి గం.11.30ని.)కు 0.7-1.2% రేంజ్ లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ ప్రతిరూపం... ఎస్‌జీఎక్స్ నిఫ్టీ 1% (115 పాయింట్లు)నష్టంతో ట్రేడవుతోంది. దీంతో నేడు(బుధవారం) మన మార్కెట్ గ్యాప్‌డౌన్‌తో ఆరంభమయ్యే అవకాశ

లేబర్ అసిస్టెంట్ కమిషనర్ హత్య

ఈనెల 7న హన్మకొండ నుంచి ప్రదీప్‌రెడ్డితో కలసి భూపాలపల్లికి..

- 8న మిస్సింగ్ కేసు నమోదు.. రంగంలోకి ప్రత్యేక బృందాలు
- ఇరువురి నడుమ రూ. 80 లక్షల మేర ఆర్థిక లావాదేవీలు
- మంగళవారం రాత్రి భూపాలపల్లి అడవుల్లో మృతదేహం గుర్తింపు
- పోలీసుల అదుపులోకి నిందితుల్లో ఒకరు..

లేబర్ అసిస్టెంట్ కమిషనర్ ఆనంద్‌రెడ్డి

మంగళవారం రాత్రి భూపాలపల్లి అడవిలో మృతదేహం కోసం గాలిస్తున్న పోలీసులు

కాజీపేట అర్బన్ /భూపాలపల్లి /జనగామ అర్బన్: రియల్ మాఫియా ఉచ్చులో పడిన అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మోకు ఆనంద్ రెడ్డి (45) హత్యకు గురయ్యారు. వ్యాపార లావాదేవీల కారణంగా హత్యకు గురైనట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో నిర్ధారణకు వచ్చారు. హత్యా ప్రదేశాన్ని నిందితుల్లో ఒకరు చూపించగా.. మృతదేహాన్ని మంగళవారం రాత్రి పొద్దుపోయాక గుర్తించారు.

జనగామ నుంచి ఖమ్మం

జనగామ జిల్లా ఓబుల్‌కేశపూర్‌కు చెందిన మధుసూదన్‌రెడ్డి, పద్మ దంపతుల పెద్ద కుమారుడు ఆనంద్‌రెడ్డి తొలుత జనగామ, వరంగల్‌లలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. ఇప్పుడు ఇన్‌చార్జి అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా ఖమ్మంలో పని చేస్తున్నారు. తరచుగా హన్మకొండకు వచ్చే ఆయన ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఈనెల 7వ తేదీన హన్మకొండలోని ఓ హోటల్‌కు ప్రదీప్‌రెడ్డి వచ్చాడని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లారు..

ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్

హోటల్‌కు వెళ్లాక ఏం చర్చించుకున్నారో ఏమో కానీ.. బయటకు వెళ్లే సమయంలో ఆనంద్‌రెడ్డి తన సోదరుడు శివకుమార్‌రెడ్డికి ఫోన్ చేశారు. 'ప్రదీప్‌రెడ్డి భూపాలపల్లి రామారంలో స్థలం చూపిస్తానని చెబుతున్నాడు.. నువ్వు కూడా రా'అంటూ శివకుమార్ రెడ్డికి ఫోన్‌లో సూచించారు. దీంతో ఆయన నేరుగా భూపాలపల్లికి వెళ్లి ఫోన్ చేస్తే అన్న స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో హన్మకొండలో తమ బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. 8న హన్మకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. తమకు ప్రదీప్‌రెడ్డిపై అనుమానం ఉందని ఆనంద్ సోదరుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, హన్మకొండ హోటల్‌లోని సీసీ పుటేజీలను పరిశీలించగా.. ప్రదీప్‌రెడ్డి కారులో ఆనందర్ రెడ్డి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు.

ఇసుక వ్యాపారం కోసం రూ.80 లక్షల అప్పు

ప్రదీప్‌రెడ్డి చేసే ఇసుక వ్యాపారం నిమిత్తం ఆనంద్‌రెడ్డి రూ.80 లక్షల వరకు అప్పుగా ఇచ్చినట్లు సమాచారం. కాగా డబ్బులు తిరిగి ఇవ్వమని అడగగా.. తన వద్ద ఇప్పుడు డబ్బులు లేవని, అందుకు తగ్గట్టు స్థలాన్ని ఇస్తానని బదులిచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో భూపాలపల్లి రాంపూర్‌లో స్థలం చూపిస్తామని నమ్మించి తన స్నేహితుడు, డ్రైవర్‌తో కలసి వాహనంలో ఆనంద్‌ను తీసుకెళ్లి హత్య చేసి ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే, వేరే చోట హత్య చేసి రాంపూర్ వద్ద మృతదేహాన్ని వేశారా, లేక అక్కడే హత్య చేశారా అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. కాగా, ఆనంద్‌రెడ్డి మృతదేహాన్ని పోలీసులు మంగళవారం రాత్రి గుర్తించినట్లు సమాచారం. అనుమానితులైన ప్రదీప్‌రెడ్డి, ఆయన సోదరుడు, డ్రైవర్ ఫోన్లు స్విచ్ఛాఫ్ వచ్చినట్లు సమాచారం. దీంతో గాలింపు చర్యలు చేపట్టగా ముగ్గురిలో ఒకరు పోలీసులకు పట్టుబడ్డాడు. భూపాలపల్లి మండలంలోని కమలాపూర్– రాంపూర్ గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలోని గట్టమ్మ దేవాలయం సమీపంలో ఆనంద్‌రెడ్డి మృతదేహం ఉందని నిందితుడు చెప్పగా.. లైట్ల సాయంతో గంటపాటు వెతికారు. చివరకు దుర్వాసన ఆధారంగా గట్టమ్మ గుడి నుంచి సుమారు కిలోమీటరు దూరంలో మృతదేహాన్ని గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చేతులు కట్టేసి హత్య

అతడి చేతులు వెనుకకు కట్టేసి చంపినట్లు చెబుతున్నారు. మృతదేహం కుళ్లిపోయి ఉండటంతో ఎక్కడెక్కడ కత్తిపోట్లు ఉన్నాయనే విషయాన్ని పోలీసులు నిర్ధారణకు రాలేకపోతున్నారు.

ప్రదీప్‌రెడ్డిని గత ఏడాదే బహిష్కరించాం: టీఆర్ఎస్

కమలాపూర్: వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్ మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన పింగిళి ప్రదీప్‌రెడ్డి టీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కాదని.. ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాట్ల రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పలు పార్టీలు మారిన ప్రదీప్‌రెడ్డి.. టీఆర్ఎస్‌లో చేరినా కొద్దికాలమే కొనసాగారని చెప్పారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండటంతో మంత్రి ఈటల రాజేందర్ ఆదేశాల మేరకు గతేడాది మే 6న పార్టీ నుంచి ప్రదీప్‌రెడ్డిని సస్పెండ్ చేశామని స్పష్టం చేశారు.

హున్సలో పిడిగుద్దులాట

హోలీ పండుగను పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని హున్స గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడిగుద్దులాట ఉత్కంఠగా కొనసాగింది. గ్రామ ప్రధాన కూడలిలోని హనుమాన్ మందిరం ఎదురుగా గల ఖాళీ ప్రదేశంలో వేదికను సిద్ధం చేశారు. తాడుకు ఇరువైపుల గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయి పిడికిలితో ఒకరినొకరు బాదుకున్నారు. ఈ సందర్భంగా కేరింతలు, చప్పట్లతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఆట ముగియగానే గ్రామస్తులు పరస్పరం ఆలింగనం చేసుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

– బోధన్ రూరల్

యాదాద్రికొండపై హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

మాస్క్‌లు కట్టుకుని హుండీ లెక్కింపు!

కరోనా వైరస్ భయంతో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మంగళవారం సిబ్బంది మాస్క్‌లు ధరించి స్వామివారి హుండీ లెక్కించారు. హుండీ లెక్కింపులో ఈఓ గీతారెడ్డితో పాటు పాల్గొన్న అధికారులు, సిబ్బంది, హోంగార్డులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది మాస్క్‌లు ధరించారు. 21 రోజులకుగాను యాదాద్రీశుడి ఆదాయం రూ.76,12,164 వచ్చింది.

– యాదగిరిగుట్ట

అసలే నీటి కొరత ఉంది.. తలస్నానం ఎందుకు చేశారు?

విద్యార్థినులను చితకబాదిన కస్తూర్బా ప్రత్యేకాధికారి

రఘునాథపల్లి: హోలీ సంబరాల్లో భాగంగా సోమవారం రంగులు చల్లుకున్న విద్యార్థినులు తలస్నానాలు చేశారు. నీటి కొరత ఉన్నప్పుడు తలస్నానాలు చేసి నీటిని వృథా చేశారంటూ ఆగ్రహంతో విద్యార్థినులను కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి చితకబాదింది. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని కేజీబీవీ విద్యార్థినులు హోలీ సందర్భంగా సోమవారం సంబరాలు చేసుకున్నాక మధ్యాహ్నం తల స్నానాలు చేశారు. సాయంత్రం ప్రత్యేకాధికారి సుమలత పాఠశాలకు వచ్చే సరికి సంపులోని నీరు ఖాళీ అయిందని తెలియడంతో తలస్నానాలు చేసిన బాలికలందరినీ పిలిచి చేతి వేళ్లపై కర్రతో కొట్టింది. విషయం తెలుసుకున్న బాలికల తల్లిదండ్రులు ఎస్ఓను నిలదీశారు. ఈ విషయమై సుమలతను వివరణ కోరగా.. 'పాఠశాలలో నీటి సమస్య ఉంది.. దీంతో పాటు కరోనా వైరస్ ప్రభావం ఉన్నందున రంగులు చల్లుకోవద్దని చెప్పినా వినలేదు. అందుకే ఓ తల్లిగా కొట్టానే తప్ప ఎలాంటి ఉద్దేశం లేదు'అని చెప్పారు. కాగా, ఘటనపై సెక్టోరియల్ సెక్టార్–3 అధికారి (జీసీడీఓ) సంయుక్తరాణి విచారణ జరిపారు.

ఏటీఎంలో చోరీ.. నిందితుడి అరెస్టు

కేసముద్రం: ఏటీఎంను పగులగొట్టి డబ్బు అపహరించిన ఓ వ్యక్తిని మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పోలీసులు అరెస్టు చేశారు. మహబూబాబాద్ రూరల్ సీఐ వెంకటరత్నం, ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాట్రపల్లికి చెందిన బూర రాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే, అడ్డదారిలో వెళ్తే త్వరగా ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఆశతో యూట్యూబ్‌లో వీడియోలు చూసి ఏటీఎంలో చోరీ ఎలా చేయాలో తెలుసుకున్నాడు. ఈ క్రమంలో గత ఏడాది నవంబర్ మొదట్లో అమరవీరుల స్తూపం సమీపంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించినా సఫలం కాలేదు. మళ్లీ అదే నెల 15న గునపం(గడ్డపార) తీసుకుని అదే ఏటీఎం వద్దకు వెళ్లిన రాజు ఏటీఎంను పగులగొట్టి రూ.1,59,900 అపహరించుకుని వెళ్లాడు. సీసీ కెమెరా పుటేజీలు పరిశీలించిన పోలీసులు.. రాజును మంగళవారం అరెస్టు చేసి రూ.40 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన డబ్బులో రూ.14 వేలు పిల్లల ఫీజు చెల్లించగా.. మిగిలిన డబ్బును జల్సాలకు ఖర్చు చేసినట్లు పోలీసులు గుర్తించారు.

ఒంటరి మహిళలపైనే గురి

- చోరీలకు పాల్పడుతున్న ఘరానా కిలాడీ అరెస్టు
- రూ.44 లక్షల విలువైన బంగారం స్వాధీనం

కాజీపేట అర్బన్: ఒంటరిగా వెళ్తున్న మహిళా ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని బంగారు ఆభరణాల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ఘరానా కిలాడీని వరంగల్ పోలీసులు చేశారు. ఆమె నుంచి రూ.44 లక్షల విలువైన 974 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలికి సంబంధించి వివరాలను పోలీస్ కమిషనర్ వి.రవీందర్ వెల్లడించారు.

తొలుత ఏపీలో.. ఆపై తెలంగాణలో..

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా కావలి మండలం వైకుంఠపురం గ్రామం బుదంగుంట కాలనీకి చెందిన కర్రెద్దుల లలిత అలియాస్ పద్మ భర్త మరణించాడు. దీంతో రోజువారీ కూలి పనులు చేస్తున్న ఆమెకు డబ్బు సరిపోక పోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకుంది. బస్టాండ్లు, రద్దీ ప్రాంతాల్లో ఒంటరిగా కనిపించే మహిళా ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని 2007 సంవత్సరం నుంచి చోరీలకు పాల్పడుతోంది. కడప, ఆత్మకూరు, గుంటూరు, విజయవాడ, ఏలూరు, నల్లగొండ జిల్లాల్లో పలు చోరీలకు పాల్పడిన లలిత.. 2018లో ఖమ్మం ప్రాంతంలో చోరీకి పాల్పడింది. అక్కడ నిందితురాలిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. జైలు నుంచి వచ్చాక ఆమె ఈసారి ఆమె అడ్డాను తెలంగాణకు మార్చింది. వరంగల్ కమిషనరేట్, కరీంనగర్ కమిషనరేట్, మహబూబాబాద్ జిల్లాల్లో 17 చోరీలకు పాల్పడింది. ఫిబ్రవరి 25న జనగామ నుంచి బస్సులో వెళ్తున్న ప్రయాణికురాలి నుంచి 190 గ్రాముల బంగారాన్ని దొంగతనం చేసింది. సీసీ కెమెరలు పుటేజీలో నిందితురాలిని గుర్తించిన పోలీసులు.. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ బృందం విచారణ చేపడుతుండగా మంగళవారం జనగామకు లలిత వచ్చిన సమాచారంతో అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె నుంచి రూ.44 లక్షల విలువైన 974 గ్రాముల బంగారాన్ని స్వాధీనపరచుకున్నట్లు సీపీ తెలిపారు. నిందితురాలని అరెస్టు చేయడంతో పాటు ఆభరణాలను స్వాధీనం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించిన డీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీలు వినోద్‌కుమార్, ఏసీపీ బాబురావు, ఇన్‌స్పెక్టర్లు ఎల్.రమేష్‌కుమార్, మల్లేశ్‌యాదవ్, అసిస్టెంట్ అనాలిటికల్ ఆఫీసర్ సల్మాన్‌పాషా, ఎస్సైలు ఎస్సైలు సాంబమూర్తి, రవికుమార్, రాజేందర్, ఏఎస్సైలు శివకుమార్, పర్వీన్, హెడ్ కానిస్టేబుళ్లు అహ్మద్ పాషా, దామోదర్, కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, నర్సింగరావు, సౌభాగ్యను సీపీ అభినందించారు.

నిజామాబాద్ జిల్లా గుట్టకింది తండాలో పోలీసులను తోసుకుంటూ వెళ్తున్న గిరిజన మహిళలు

కారంపొడి చల్లి.. కర్రలతో దాడి..

వివాహిత ఆత్మహత్య.. కోపోద్రిక్తులైన తండావాసులు

- అడ్డుకున్న పోలీసులపై కూడా దాడికి యత్నం
- నిందితుల ఇళ్ల ధ్వంసం.. తీవ్ర ఉద్రిక్తత
- నిజామాబాద్ జిల్లా గుట్టకింది తండాలో ఘటన

ఇందల్‌వాయి/ధర్పల్లి: (నిజామాబాద్ రూరల్): ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడటం ఉద్రిక్తతకు దారి తీసింది. మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు కలసి నిందితుల ఇళ్లను ధ్వంసం చేశారు. అడ్డొచ్చిన వారిపై కారం పొడి చల్లి.. కర్రలతో దాడి చేశారు. వీరిని అడ్డుకునేందుకు యత్నించిన పోలీసులపైనా దాడికి యత్నించడంతో లాఠీ చార్జి చేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. డిచ్‌పల్లి సీఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం డీబీ తండాకు చెందిన మంజుల (22)కు గుట్టకింది తండాకు చెందిన లావుడ్య గణేష్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. మంజుల ప్రవర్తన బాగోలేదని ఐదు రోజుల క్రితం గణేష్ ఆమెను మందలించాడు. కలత చెందిన మంజుల ఎవరికీ చెప్పకుండా తిరుపతికి వెళ్లింది. తమ కూతురు కనిపించడం లేదని మంజుల తల్లిదండ్రులు ఈ నెల 7న ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే.. మంజుల తిరుపతి నుంచి తన భర్త మిత్రుడైన గోపాల్‌తో మాట్లాడింది. ఫోన్ నంబరు ఆధారంగా ఆమె తిరుపతిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. అక్కడికి బయలుదేరి వెళ్లారు. ఇంతలోనే మంజుల స్వయంగా సోమవారం సాయంత్రం డీబీ తండాకు చేరుకుంది. ఇంటికి వెళ్లని ఆమెను మంగళవారం వేకువజామున పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్నట్లు తల్లిదండ్రులు గుర్తించారు. వెంటనే ఆస్పత్రికి తరలించే లోపే ఆమె ప్రాణాలు కోల్పోయింది. మంజుల మరణాన్ని తట్టుకోలేకపోయిన కుటుంబ సభ్యులు, బంధువులు ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్త గణేష్ అతని స్నేహితుడు గోపాల్‌ను శిక్షించాలని పోస్టుమార్టంను అడ్డుకున్నారు. మరోవైపు డీబీ తండా నుంచి సుమారు రెండు వందల మంది మహిళలు మంగళవారం మధ్యాహ్నం డీసీఎం వ్యానులో గుట్టకింది తండాకు బయలు దేరారు. ముందస్తు సమాచారంతో పోలీసులు వారి వాహనాన్ని మార్గమధ్యలో అడ్డుకున్నారు. అయితే మహిళలు కారం పొడి, కర్రలు పట్టుకుని కాలినడకన గుట్టకింది తండాకు చేరుకున్నారు. పోలీసులను తోసేసి గణేష్, గోపాల్ ఇళ్లపై దాడి చేసి ఫర్నిచర్, తలుపులను ధ్వంసం చేశారు. ఈ క్రమంలో మహిళా పోలీసులపై దాడి జరగడంతో లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇన్‌చార్జి ఏసీపీ ప్రభాకర్, అడిషనల్ డీజీపీలు ఉషా విశ్వనాథ్, రఘువీర్‌లు శాంతి భద్రతలను పర్యవేక్షించారు. నిందితులపై కేసు నమోదు చేశారు. గోపాల్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. పోలీసులపై దాడి చేసిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని డిచ్‌పల్లి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

బెంగళూరు తరహాలో ప్లాంట్

- సిద్దిపేటలో తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ
- ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించిన మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: పట్టణాల్లో పెరుగుతోన్న చెత్త సమస్యను తీర్చేందుకు బెంగళూరు తరహాలో సేంద్రియ ఎరువుల తయారీ ప్లాంట్లను సిద్దిపేటలో ఏర్పాటు చేయనున్నారు. వ్యర్థం.. వేరుచేసి చూస్తే పరమార్థం ఉంటుందనే ఆలోచనతో సిద్దిపేట ఎమ్మెల్యే, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు దేవవ్యాప్తంగా స్వచ్ఛ పట్టణాలుగా రూపొందిన బెంగళూరు, పుణే వంటి పట్టణాలకు సిద్దిపేట వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులను పంపించి ఆయా ప్రాంతాల్లో ఉన్న విధానాన్ని ఇక్కడ అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. స్వచ్ఛ సిద్దిపేట చేయాలనే ఆలోచనతో మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటలో బెంగళూరు తరహాలో సేంద్రియ ఎరువుల తయారీ ప్లాంట్ ఏర్పాటుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇందుకు ముందస్తుగా తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై నాలుగు రోజులుగా హెచ్ఎస్ఆర్ సొసైటీ నిర్వాహకురాలు డాక్టర్ శాంతితో కలసి ఇంటింటికీ వెళ్లి మంత్రి హరీశ్‌రావు అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా తడి, పొడి చెత్తలు వేరే చేసేందుకు డబ్బాలు పంపిణీ చేశారు. మున్సిపల్ అధికారులు, మహిళా సంఘాలు, యువజన సంఘాలతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు ఇందులో భాగస్వాములు కావాలని సూచిస్తున్నారు.

బెంగళూరు తరహాలో ప్లాంట్స్

నిత్యం రద్దీగా ఉండే బెంగళూరు వంటి పట్టణాల్లో పారిశుధ్య సమస్యను పరిష్కరించిన హెచ్ఎస్ఆర్ సామాజిక సేవా సంస్థ పని తీరును సిద్దిపేట జిల్లాలో అమలు చేయనున్నారు. బెంగళూరులోని హుజూర్ సర్జాపూర్ రోడ్డులోని 1.50 లక్షల మంది జనాభా ఉన్న కాలనీలో ఈ విధానంలో ఎక్కడి చెత్తను అక్కడే.. ఆయా కాలనీల్లోనే సేంద్రియ ఎరువులుగా మార్చడంలో హెచ్ఎస్ఆర్ సంస్థ సఫలీకృతమైంది. అలా తయారు చేసిన ఎరువును స్థానికంగా ఇళ్లల్లో, రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కలకు వేస్తారు. పొడిచెత్తను రీసైక్లింగ్‌కు పంపిస్తారు.

పరిశుభ్రమైన సిద్దిపేట లక్ష్యం

ప్రజల్లో అవగాహన లేక తడి, పొడి చెత్తను విచ్చలవిడిగా పారేస్తున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. ఇప్పటికే సిద్దిపేటలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. తడి చెత్తతో బెంగళూరులో సేంద్రియ ఎరువులు తయారీ చేసిన విధానం బాగుంది. ఈ విధానం సిద్దిపేటలో అమలుకు శ్రీకారం చుట్టామన్నారు.

సిద్దిపేటలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మంత్రి హరీశ్‌రావు

డ్రాగ్‌లైన్ యంత్రాలు కంచికి..!

పనిస్థలాలు లేవని సింగరేణి యాజమాన్యానికి ప్రతిపాదనలు

- అయినా రూ.5.80 కోట్లతో కొత్త బకెట్ కొనుగోలు
- నాలుగు గంటలు పనిచేయకుండానే పగుళ్లు
- ఇష్టారాజ్యంగా కొనుగోళ్లపై కార్మిక సంఘాల ఆగ్రహం
- విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్

గోదావరిఖని: సింగరేణి అధికారుల అనాలోచిత చర్యతో రూ.5.80 కోట్లు వృథా అయ్యాయి. ఓసీపీల్లో మట్టి వెలికి తీసే డ్రాగ్‌లైన్ యంత్రాలకు పనిస్థలాలు లేవని ఇప్పటికే అధికారులు యాజమాన్యానికి ప్రతిపాదనలు పంపారు. దీనిపై సమాలోచనలు చేస్తున్న సింగరేణి, యంత్రాల గడువు ఇప్పటికే ముగియడంతో వాటిని పూర్తిగా పక్కన పెట్టాలని భావిస్తోంది. ఈ క్రమంలో అధికారులు డ్రాగ్‌లైన్ యంత్రానికి కొత్తగా భారీ బకెట్ కొనుగోలు చేశారు. తెచ్చిన నాలుగు రోజులకే అది బీటలు వారింది. ఈ నేపథ్యంలో అసలు ఈ కొనుగోళ్లు ఎందుకు జరిగాయి. దీనికి బాధ్యులెవరు..? అనే చర్చ ఇప్పుడు సింగరేణి వ్యాప్తంగా జరుగుతోంది. చిన్న ఇనుప ముక్క బయటకు వెళ్లినా విజిలెన్స్ విచారణ చేపట్టే యాజమాన్యం.. బకెట్ కొనుగోలులో అక్రమాలపై దృష్టి పెట్టాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సింగరేణి సంస్థ పెద్దపల్లి జిల్లా రామగుండం డివిజన్– 3 పరిధిలోని ఓబీ వెలికితీత కోసం 1986లో రూ.25 కోట్లతో డ్రాగ్‌లైన్ యంత్రం కొనుగోలు చేసింది. దీనికి పృథ్వీభంజన్ అని నామకరణం చేశారు. నాటి నుంచి నేటి వరకు ఓబీ వెలికితీతలో తనదైన శైలిలో ముందుకు సాగుతూ అనేక రికార్డులు సృష్టించింది. సింగరేణి సంస్థలోనే అతిపెద్ద భారీ యంత్రంగా రికార్డుకెక్కింది. కోలిండియాలోని డ్రాగ్‌లైన్ యంత్రాలతో పోల్చితే రెట్టింపు జీవిత కాలాన్ని నమోదు చేసుకుంది. అయితే పృథ్వీభంజన్ జీవితకాలం పెంచేందుకు మిడ్‌లైఫ్ ఓవరాల్ నిర్వహించి జాయ్‌సిస్టం బిగించారు. ప్రస్తుతానికి ఓసీపీ–1లోని 18వ కట్‌వద్ద యంత్రంతో ఓబీ తొలగింపు పనులు నిర్వహిస్తున్నారు.

పనిస్థలాలు కరువు

ఓసీపీ–1 క్వారీలో బొగ్గు నిల్వలు అడుగంటి పోవడం డ్రాగ్‌లైన్‌కు పనిస్థలాలు లేకుండా పోయాయి. ఓసీపీ విస్తరణ శరవేగంగా సాగితే డ్రాగ్‌లైన్ యంత్రానికి పనిలేకుండా పోతుంది. ప్రస్తుతం కొనసాగుతున్న 18 కట్‌లో మరికొద్దిరోజులే యంత్రానికి పని ఉండే అవకాశం ఉంది. పక్కనే ఉన్న 19వ కట్ షావల్స్ ద్వారా ఓబీ వెలికి తీస్తుండటంతో డ్రాగ్‌లైన్‌కు పనిస్థలాలు కరువయ్యాయి.

నూతనంగా కొనుగోలు చేసిన డ్రాగ్‌లైన్ బకెట్

రూ.5.80 కోట్లు ఎందుకు?

ప్రస్తుతం కొనసాగుతున్న ఓబీ పనిస్థలాలు పూర్తయితే డ్రాగ్‌లైన్ యంత్రం నిలిపివేయాలని అధికారులు ఇప్పటికే యాజమాన్యానికి ప్రతిపాదనలు పంపా రు. ఈ క్రమంలో మూసివేసేందుకు ప్రతిపాదనలు పంపిన డ్రాగ్‌లైన్‌కు ఇటీవలే రూ.5.80 కోట్లు వెచ్చించి 24 క్యూబిక్ మీటర్ల కెపాసిటీ గల నూతన బకెట్ కొనుగోలు చేశారు. డ్రాగ్‌లైన్ మూసేసే ప్రతిపాదనలు ఉన్న క్రమంలో కొత్త బకెట్ కొనడం, పృథ్వీభంజన్‌కు దానిని బిగించి నాలుగు గంటలు కూడా సరిగా పనిచేయకుండానే అది పగులు చూపడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. దీనిపై కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సంస్థలో చిన్నచిన్న పొరపాట్లకు విచారణ పేరుతో కార్మికులను ఇబ్బంది పెట్టే అధికారులు తాము చేసిన పొరపాటుపై నోరు మెదపడం లేదు. దీనిపై సింగరేణి ఉన్నతాధికారులు దృష్టి సారించి పూర్తి స్థాయిలో విచారణ జరిపితే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.

బడ్జెట్‌లో ప్రవాసుల ఊసేది?

- ఎన్ఆర్ఐ పాలసీపై ఆశలు పెట్టుకున్న ప్రవాసులు
- నిధుల ప్రస్తావన లేక పోవడంతో అసంతృప్తి

మోర్తాడ్ (బాల్కొండ): ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రవాసీలు పెదవి విరుస్తున్నారు. నిన్న మొన్నటి వరకు తెలంగాణ ప్రవాసీ విధానం (ఎన్ఆర్ఐ పాలసీ)పై ప్రకటనలు గుప్పించిన ప్రభుత్వం.. బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన తీసుకురాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎక్కువగా గల్ఫ్ దేశాలకు వలసలు కొనసాగుతుండగా.. అదే క్రమంలో పలు పాశ్చాత్య దేశాలకు ఉన్నత విద్య, ఉద్యోగం, వ్యాపారం కోసం వెళ్లినవారు ఉన్నారు. అయితే గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికులే ఎక్కువగా ప్రవాసీ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవాసుల సంక్షేమం కోసం కేరళ రాష్ట్రం తరహాలో ఎన్ఆర్ఐ పాలసీని అమలు చేస్తామని ప్రకటించారు. రెండు నెలల క్రితం ఉన్నతాధికారుల బృందాన్ని కేరళకు పంపించారు. కేరళలో వలసదారుల కోసం అమలు జరుగుతున్న విధానాలను ఈ బృందం అధ్యయనం చేసింది. దీంతో ఎన్ఆర్ఐ పాలసీ తుది రూపునకు వచ్చిందనే ప్రచారం జరిగింది. అయితే ఆర్థిక మంత్రి హరీశ్ రావు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎన్ఆర్ఐ పాలసీ ఊసే లేకుండా పోయింది.

వలసలతో ఆదాయం సమకూరుస్తున్న ప్రవాసులు

మన రాష్ట్రం నుంచి కేవలం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికుల సంఖ్య దాదాపు 13 లక్షల వరకు ఉంటుందని అంచనా. వీరు ప్రతి నెలా రూ.3 వేల కోట్ల వరకు మన దేశానికి పంపుతున్నారు. ఇలా వలసల ద్వారా తెలంగాణ ప్రవాసులు ఎంతో ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నారు. అయితే వలసదారుల సంక్షేమ అంశంపై ప్రభుత్వం నిర్దయ చూపడం పట్ల ప్రవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
సాగు నీటి పారుదల వలయము, నిర్మల్, నిర్మల్ జిల్లా
టెండరు ప్రకటన
టెండర్ నోటీసు నంబర్లు No. 43/2019 - 20, నుండి 47/2019 - 20, తేది: 26.02.2020 మరియు టెండర్ నోటీసు నంబర్లు No. 48/2019-20, నుండి 56/2019-20 తేది: 27.02.2020 లభ్యమగు తేది: 07.03.2020 నుండి 16.03.2020 వరకు పనులకు గాను **రూ.3199.625 లక్షలకు** టెండర్లు ఆహ్వానించనైనది. మిగతా వివరాలకు ఇ–ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in లో చూడగలరు. పర్యవేక్షక అభియంత, సాగు నీటి పారుదల వలయము, నిర్మల్.
సం/– సూపరింటెండింగ్ ఇంజినీర్, I&CADD, ఇరిగేషన్ సర్కిల్, నిర్మల్
DIPR Ro.No.863-PP/CL/Advt/1/2019-20, Dt: 10/03/2020

వైరస్‌ల నియంత్రణకు శాశ్వత వార్డులు

- ఉమ్మడి జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో 20 ఐసోలేషన్ కేంద్రాలు, 10 ఐసీయూలు
- కోవిడ్, స్వైన్‌ఫ్లూ, నిపా వంటి వైరస్‌లన్నింటికీ చికిత్స

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ మహమ్మారి ప్రపంచ దేశాలను వణికిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని రకాల వైరస్‌ల నియంత్రణకు శాశ్వతంగా ప్రత్యేక ఐసీయూలు, ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కోవిడ్‌తోపాటు స్వైన్‌ఫ్లూ, నిపా వంటి వైరస్‌లన్నింటికీ చికిత్స కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని ఆసుపత్రుల్లో 10 పడకలతో ఐసీయూలు, 20 పడకలతో ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేయనుంది. ఒక్కో ఐసీయూ ఏర్పాటుకు రూ. 2 కోట్ల చొప్పున రూ. 20 కోట్లు, ఒక్కో ఐసోలేషన్ వార్డుకు రూ. కోటి చొప్పున రూ. 10 కోట్లు లెక్కన మొత్తం రూ. 30 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ మేరకు మంగళవారం జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్ నిబంధనల ప్రకారం ఐసీయూలు, ఐసోలేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఆయా కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు వాటికి ప్రత్యేక ప్రవేశ మార్గాలను సిద్ధం చేయనున్నారు. అలాగే రోగులు ఇళ్లకు వెళ్లేందుకు సైతం విడిగా మార్గాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. వాటిని ఎలా ఏర్పాటు చేయాలన్న దానిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్ ప్రతినిధులు మంగళవారం ఆయా జిల్లాల కేంద్రాలకు వెళ్లారు. దీనిపై బుధవారం ప్రత్యేక సమావేశం జరగనుంది.

కోవిడ్ దెబ్బతో బయోమెట్రిక్ బంద్

హాజరు విధానాన్ని నిలిపివేస్తున్న విద్యా సంస్థలు

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ వైరస్ దెబ్బతో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని విద్యా సంస్థలు క్రమంగా నిలిపివేస్తున్నాయి. కోవిడ్ కారణంగా షేక్ హ్యాండ్ ఇవ్వవద్దని, వీలైనన్ని ఎక్కువ సార్లు చేతులు కడుక్కోవాలని ప్రచారం చేస్తున్న నేపథ్యంలో విద్యార్థులంతా ఒకరి తరువాత ఒకరు వేలి ముద్రలు వేయాల్సిన బయోమెట్రిక్ హాజరును తాత్కాలికంగా నిలిపివేస్తున్నాయి. ఇప్పటికే ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తాత్కాలికంగా నిలిపివేయగా, కాకతీయ యూనివర్సిటీ కూడా తమ పరిధిలోని కాలేజీల్లో బయోమెట్రిక్ హాజరు విధానం నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. మరోవైపు జేఎన్‌టీయూ, ఉస్మానియా యూనివర్సిటీలు, పాలిటెక్నిక్ కాలేజీలు, పాఠశాలల్లోనూ బయోమెట్రిక్ హాజరు విధానం నిలిపివేతపై ఆలోచనలు చేస్తున్నాయి. ఒకటి రెండు రోజుల్లో దీనిపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. అయితే ఆయా విద్యా సంస్థల్లో టీచర్ల హాజరు ఎలా చేయాలన్న దానిపై ఆలోచనలు చేస్తున్నాయి. విద్యా సంస్థల వారీగా చూస్తే వారు తక్కువగానే ఉంటారు కనుక చేతులు బాగా శుభ్రం చేసుకొని వేలి ముద్రలు వేసేలా, ఆ తరువాత మళ్లీ శుభ్రం చేసుకునేలా చర్యలు చేపట్టాలని భావిస్తున్నట్లు తెలిసింది.

కోవిడ్ కట్టడికి సాయం చేస్తాం

మంత్రి ఈటలను కలసిన 'యశోద' యాజమాన్యం

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ వైరస్ కట్టడిలో సర్కార్‌కు సాయం అందించేందుకు యశోద ఆసుపత్రి యాజమాన్యం ముందుకొచ్చింది. మంగళవారం వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను యశోద ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ జీఎస్ రావు, వైస్ ప్రెసిడెంట్ సురేశ్‌కుమార్ కలసి కోవిడ్ వైరస్ కట్టడికి తీసుకోవాల్సిన చర్యలు, సంస్థ తరఫున అందించే సాయంపై వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 1.20 లక్షల మాస్క్‌లు అందించామని, మరో 80 వేలు బుధవారంలోగా అందుబాటులోకి తెస్తామన్నారు. అలాగే 60 వెంటిలేషన్‌తో కూడిన ఐసోలేషన్ పడకలను అందుబాటులో ఉంచుతామన్నారు. సికింద్రాబాద్, మలక్‌పేట, సోమాజిగూడలలో 20 చొప్పున బెడ్లను ఏర్పాటు చేశామని యశోద ఆసుపత్రి ఎండీ తెలిపారు. ఈ సందర్భంగా కోవిడ్ వైరస్ వ్యాప్తి కాకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన కొనియాడారు.

కోస్సియుస్కో పర్వతాన్ని అధిరోహించిన తుకారాం

ఐదు ఖండాల్లోని ఎత్తైన పర్వతాలెక్కి సరికొత్త రికార్డు సృష్టించిన తుకారాం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ యువ పర్వతారోహకుడు ఆంగోత్ తుకారాం మరో అరుదైన రికార్డు సృష్టించాడు. ఆస్ట్రేలియా ఖండంలోనే ఎత్తైన పర్వతం కోస్సియుస్కోను మంగళవారం అధిరోహించాడు. ఏడు ఖండాల్లోని ఎత్తైన పర్వతాలను అధిరోహించాలనే లక్ష్యంతో పర్వతారోహణ మొదలుపెట్టిన ఆంగోతు తుకారాం...ఇప్పటికే నాలుగు ఖండాల్లోని ఎత్తైన పర్వతాలను అధిరోహించాడు. తాజాగా కోస్సియుస్కోను అధిరోహించడంతో ఐదు ఖండాల్లోని ఎత్తైన పర్వతాలను ఎక్కి సరికొత్త రికార్డును సొంతం చేసుకున్నాడు. ఆస్ట్రేలియాలోని కోస్సియుస్కో పర్వతాన్ని అధిరోహించేందుకు ఈనెల 5న హైదరాబాద్ నుంచి బయల్దేరిన తుకారాం..8న అక్కడికి చేరుకున్నారు. అదేరోజు సాహసయాత్ర ప్రారంభించి మంగళవారం పూర్తి చేశాడు.

మరో 2 ఖండాల్లోని పర్వతాలను ఎక్కడమే లక్ష్యం: తుకారాం

మరో రెండు ఖండాల్లోని ఎత్తైన పర్వతాలను అధిరోహించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు తుకారాం 'సాక్షి'తో పేర్కొన్నాడు. ఇటీవల ఆస్ట్రేలియాలో అడవులు కాలిపోయి వన్యప్రాణులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ నేపథ్యంలో వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అనే నినాదంతో ఆస్ట్రేలియా సాహసయాత్ర నిర్వహించినట్లు చెప్పారు. చినజీయర్ స్వామి ఆశీస్సులు, జెట్ హెల్పింగ్ హ్యాండ్స్ సహకారంతో యాత్రను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. తుకారాం 2018 జూలైలో ఆఫ్రికాలోని కిలీమంజారో పర్వతాన్ని అధిరోహించాడు. ఆ తర్వాత 2019 మే 22న ఆసియాలోని మౌంట్ ఎవరెస్ట్, 2019 జూ లై 27న యూరప్‌లోని మౌంట్ ఎల్బ్రూస్, 2020 జనవరి 26న ఉత్తర అమెరికాలోని మౌంట్ అకాన్గువా పర్వతాలను అధిరోహించాడు.

సంతాన యోగం!

ఎయిమ్స్, సీసీఎంబీ అధ్యయనంలో వెల్లడి ■ వీర్యకణాలు చురుగ్గా మారే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ప్రజలు మరీ ముఖ్యంగా పురుషులు యోగా సాధన చేసేందుకు మరో బలమైన కారణాన్ని ఆవిష్కరించారు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రవేత్తలు. అననుకూల వాతావరణ పరిస్థితుల కారణంగా తగ్గిపోతున్న పురుషుల వీర్యం నాణ్యత పెంచేందుకు యోగా ఉపయోగపడుతుందని సీసీఎంబీ, ఢిల్లీలోని అఖిల భారత వైద్యవిజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లు సంయుక్తంగా చేసిన పరిశోధన స్పష్టం చేసింది. మానవ జన్యు వ్యవస్థపై వాతావరణం ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందన్నది మనకు తెలిసిన విషయమే. అనారోగ్యకరమైన జీవన శైలి, దురలవాట్ల కారణంగా డీఎన్ఏలో రసాయన మార్పులు చోటు చేసుకుని వీర్యం నాణ్యత తగ్గుతుందని కూడా మనం తరచూ వింటూ ఉంటాం. అయితే ఈ మార్పులను యోగాతో అధిగమించొచ్చని తాజా అధ్యయనం చెబుతోంది. ఆండొలోగియా జర్నల్ తాజా సంచికలో ప్రచురితమైన దాని ప్రకారం వంధ్యత్వ సమస్యలతో బాధపడుతున్న పురుషులు యోగా ఆధారిత జీవనశైలి అలవర్చుకుంటే వీర్యకణాలు చురుగ్గా మారడంతో పాటు వీర్యంపై ఆక్సిడేటివ్ స్ట్రెస్ కూడా తగ్గుతుంది. తద్వారా సంతానం కలిగేందుకు ఉన్న అవకాశాలు పెరుగుతాయి.

సీసీఎంబీలో పరిశీలన..: ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యశాలలో వంధ్యత్వ సమస్యలకు చికిత్స పొందుతున్న కొంతమందిని ఎంచుకుని తాము అధ్యయనం చేశామని సీసీఎంబీ శాస్త్రవేత్త సురభి శ్రీవాత్సవ తెలిపారు. వీరి వంధ్యత్వానికి కారణాలు తెలియదని పేర్కొన్నారు. అయితే తమ యోగా కార్యక్రమంలో చేరాలన్న తమ వినతికి అంగీకరించారని చెప్పారు. వీరు రోజుకు ఒక గంట చొప్పున వేర్వేరు ఆసనాలు వేయడంతో పాటు ప్రాణాయామం, ధ్యానం వంటి యోగా క్రియలను అనుసరించారు. యోగా కార్యక్రమంలో చేరే ముందు.. ఆ తర్వాత వీరి వీర్యాన్ని పరిశీలించగా ఆసక్తికరమైన మార్పులు కనిపించాయని శ్రీవాత్సవ వివరించారు. సుమారు 400 జన్యువులు ఆన్/ఆఫ్ అయ్యేందుకు కీలకమైన మిథైలోమ్‌ను యోగా ప్రభావితం చేస్తున్నట్లు స్పష్టమైందని వివరించారు. వీటిల్లో పురుషుల సంతాన లేమికి వీర్య ఉత్పత్తికి ఉపయోగపడే జన్యువులు ఉన్నాయి. ఈ అధ్యయనంలో గుర్తించిన జన్యువులపై మరిన్ని పరిశోధనలు జరపడం, వీర్యంపై యోగా ప్రభావంపై మరింత విస్తృత స్థాయిలో అధ్యయనం చేపట్టడం ద్వారా వంధ్యత్వ సమస్యలను అధిగమించేందుకు మెరుగైన మార్గం లభిస్తుందని సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా తెలిపారు. యోగా అధ్యయనంలో పాల్గొన్న వారిలో ఇద్దరు ఏడాది తిరగకుండానే తండ్రులు అవుతుండటం విశేషం.

సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రాతో డాక్టర్ రష్మి ఉపాధ్యాయ, సోఫియా భాను, డాక్టర్ సురభి శ్రీవాత్సవ (ఎడమవైపు చివరలో)

నింగిలో సయ్యాట!

- అబ్బురపరిచే విన్యాసాలకు సిద్ధం
- రేపటి నుంచి 'వింగ్స్ ఇండియా' ఏవియేషన్ షో
- ముస్తాబైన బేగంపేట ఎయిర్‌పోర్ట్

హైదరాబాద్: నింగిలో అద్భుతానికి హైదరాబాద్ నగరం మరోసారి వేదికైంది. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ), కేంద్ర పౌర విమానయాన సంస్థ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా రెండేళ్లకోసారి 'వింగ్స్ ఇండియా'పేరిట నిర్వహించే ఏవియేషన్ షోకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ ముస్తాబైంది. ఈ నెల 12 నుంచి 15 వరకు ఈ షో జరగనుంది. ఇందులో ప్రధానంగా సరంగ్ టీమ్, మార్క్ జెఫ్రీ బృందాల విన్యాసాలు హైలైట్‌గా నిలవనున్నాయి. హెలికాప్టర్, ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ కంపెనీల ఉత్పత్తుల ప్రదర్శన కూడా ఉండనుంది. గతంతో పోలిస్తే ఈసారి ఎయిర్ షోకు అధిక ప్రాధాన్యత కల్పించారు. గతంలో ఉదయం 20 నిమిషాలు, సాయంత్రం 20 నిమిషాలే విన్యాసాలు జరిగేవి. మార్క్ జెఫ్రీ బృందం మాత్రమే విన్యాసాలు చేసేది. ఈసారి అదనంగా సరంగ్ టీం కూడా అదరగొట్టనుంది. ప్రతిరోజూ ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు సరంగ్ టీమ్, మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు మార్క్ జెఫ్రీ టీం, తిరిగి మధ్యాహ్నం 3.30 నుంచి 4 గంటల వరకు సరంగ్ టీం, సాయంత్రం 4 నుంచి మార్క్ జెఫ్రీ బృందం విన్యాసాలు చేయనున్నాయి. ఈ రెండు బృందాలు గత రెండు రోజులుగా రిహార్సల్స్ చేస్తున్నాయి. కమర్షియల్, రీజనల్, బిజినెస్, కార్గో ఎయిర్‌క్రాఫ్ట్స్‌తో పాటు హెలీకాప్టర్స్, మోటార్ గ్లైడర్స్, బెలూన్స్ తయారీ కంపెనీలు తమ ఉత్పత్తులను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నాయి. ఎయిర్‌క్రాఫ్ట్ మిషనరీ, ముడి ఉత్పత్తుల కంపెనీలు, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటీరియర్ ఉత్పత్తులు, స్పేస్ ఇండస్ట్రీలు, డ్రోన్ ఉత్పత్తులు, ఎయిర్‌లైన్ సర్వీసెస్, కార్గో ఉత్పత్తులతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ కంపెనీలు సైతం కొలువుదీరనున్నాయి.

13న సీఎం కేసీఆర్ సందర్శన

మొదటిరోజు రిజిస్ట్రేషన్స్, చిన్నచిన్న సమావేశాలు, ఎగ్జిబిషన్ ప్రారంభంతో పాటు సరంగ్, మార్క్ జెఫ్రీ టీంలు నింగిలో సందడి చేయనున్నాయి. 13న ఉదయం 10 గంటలకు సీఎం కేసీఆర్ ఈ షోకు హాజరవుతారు. ఐటీ మంత్రి కేటీఆర్, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఖరోరలా, ఫిక్కీ చైర్మన్ ఆనంద్‌స్టాన్లీ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ అర్విందర్‌సింగ్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com